www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 15-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 271 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 2.18 తదుపరి షష్ఠి; నక్షత్రం: శతభిషం ఉ. 8.08, పూర్వాభాద్ర తె. 6.10 వరకు; వర్జ్యం: మ. 2.00 నుంచి 3.29 వరకు, దుర్ముహూర్తం: మ. 12.47 నుంచి 1.31 వరకు, మ. 3.00 నుంచి 3.44 వరకు; అమృతఘడియలు: రా. 10.50 నుంచి 12.18 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు; సూర్యోదయం: 6.53, సూర్యాస్తమయం: 5.57 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తాడేపల్లిలో ఎన్నికల భక్తి!



క్యాంపు ఆఫీసులో నెలకొల్పిన నమూనా తిరుమల ఆలయం. శఠగోపం పెట్టించుకుంటున్న జగన్ దంపతులు

భారీ ఖర్చుతో ఎన్నికల వేళ రాజకీయ సంక్రాంతి

జగన్ నివాసంలో తిరుమల సెట్టింగు

ప్రముఖ ఆలయాల్లోని దేవుళ్ల నమూనాలు

హిందూ గుళ్లకు భారతీరెడ్డి తొలి నుంచీ దూరం

తిరుమల బ్రహ్మోత్సవాలకూ జగన్ ఒంటరిగానే..

అలాంటిది ఈ ఎన్నికల సంక్రాంతికి నమూనా ఆలయాల్లో జగన్‌తో కలిసి పూజలు

శఠగోపం స్వీకరించి కుంకుమ దిద్దించుకున్న వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్ నివాసంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో తిరుమల ఆలయాన్ని పునఃసృష్టించారు. జగన్ దంపతులు ఆ నమూనా ఆలయంలో పూజలు జరిపారు. శఠగోపం పెట్టించుకున్నారు. ఒకరికి ఒకరు కుంకుమ దిద్దుకుని స్వామిని సేవించారు. అక్కడి

మిగతా12వ పేజీలో...



అమరావతిలో జరిగిన భోగి వేడుకల్లో చంద్రబాబు, పవన్

87 రోజులే

వైసీపీ సర్కారుకు కౌంట్‌డౌన్ మొదలు

పవన్‌తో కలిసి చెబుతున్నా.. అమరావతే రాజధాని: చంద్రబాబు

మళ్లీ వైసీపీ వస్తే ఏపీని మరచిపోవడమే: పవన్

రాజధాని గ్రామం మందడంలో ఉభయుల 'భోగి సంకల్పం'

మంటల్లో చీకటి జీవోల దహనం

దేవతల రాజధానిలో రాక్షస వధ

ఇప్పుడు అమరావతిలో సైకో వధ

మంచి రోజులు వస్తున్నాయి..

విశాఖ ఆర్థిక రాజధాని

కర్నూలులో హైకోర్టు బెంచ్

రాజధాని రైతుల పోరాటానికి, ధైర్యానికి హ్యాట్సాఫ్

మీ గెలుపు 5 కోట్ల ఆంధ్రుల గెలుపు.. రైతులతో బాబు

టీడీపీ-జనసేన కలవడానికి రైతుల ఆవేదనే కారణం

బంగారంలాంటి రాజధానిని నిర్మించుకుందాం: పవన్

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి దేవతల రాజధాని.. దానిని రాక్షసులు చెరబట్టారని మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. జగన్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని.. ఇక మిగిలింది 87 రోజులేనని.. లెక్కపెట్టుకోవాలని

మిగతా 13వ పేజీలో...

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి శుభాకాంక్షలు



సెలవు

సంక్రాంతి సందర్భంగా మా కార్యాలయాలకు సోమవారం సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' మంగళవారం **(16-1-2024)** సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

\- మేనేజింగ్ డైరెక్టర్

బరి తెగింపు

తొలిరోజు రూ.వెయ్యి కోట్ల వరకు పందేల అంచనా

తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన ఔత్సాహికులు



అంపాపురం బరిలో భారీ స్క్రీన్లు.. చేతులు మారుతున్న నోట్ల కట్టలు

కోస్తాంధ్ర జిల్లాల్లో జోరుగా కోడి పందేలు, గుండాటలు

వైసీపీ నేతల కనుసన్నల్లోనే పందేలు

పశ్చిమలోనే 200 బరులు.. కోట్లలో పందేలు

అమిరాంలో ఒక్క పందేనికి రూ.50 లక్షలు

పలు బరుల్లో రూ.25 లక్షలుంటేనే లోపలికి..

13

అక్కడే పేకాటలు.. ఏరులై పారిన మద్యం

నిర్వాహకుల నుంచి భారీ మొత్తంలో నేతల వసూళ్లు

పాలకా.. మీకేనా పండగ!

రైతుకు ఉండరా అండగా?



14

కరువు, తుఫానుతో భారీగా పంట నష్టాలు

అప్పుల పాలై ఆవేదనలో అన్నదాతలు

ఆదుకోవాల్సిన పాలకపక్షం రాజకీయాల్లో బిజీ

నెలలు గడిచినా నిధుల విడుదలలో నిర్లక్ష్యం

సాయం చేయని సర్కారుపై రైతన్న గుర్రు

కర్షకుల లోగిళ్లలో కానరాని సంక్రాంతి

కబ్జాల భూపాలుడు!

అమ్మో ఎమ్మెల్యే

కర్నూలులో సీనియర్ ఎమ్మెల్యే దాదాగిరి



జోరుగా భూకబ్జాలు, దందాలు, సెటిల్‌మెంట్లు

వక్ఫ్ ఆస్తులూ కబ్జా.. జోరుగా ఎర్రమట్టి, ఇసుక రవాణా

ముందు అనుచరుల రాక.. ఆపై ఆయనతోనే పంచాయితీ

తుపాకీతో సోలార్ కాంట్రాక్టరుకు బెదిరింపులు

ఎర్రమట్టి రవాణాలో తనయుడికి మామూళ్లు

14

బావమరిదికీ కీలక కాంట్రాక్టులు

నాయకుడి అండతో అనుచరులూ అక్రమాల బాట

కర్నూలు జిల్లాలో ఆయన సీనియర్ నేత. ఫ్యాక్షన్ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చారు. ఐదారు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలుమార్లు మంత్రి పదవి వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. మంత్రి కాలేకపోయినా సదరు ఎమ్మెల్యే అక్రమార్జనలో మాత్రం టాప్! భూకబ్జాలు, దందాలు, ఎర్రమట్టి, ఇసుక అక్రమ రవాణా, సెటిల్‌మెంట్ వ్యవహారాలన్నింటిలోనూ ఆరితేరారు.

తండ్రి బాటలో పుత్రరత్నం

అక్రమార్జనలో ఎమ్మెల్యే బాటలోనే ఆయన తనయుడూ రాటుదేలుతున్నారు. ఆయన భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు చేస్తే.. కుమారుడు ఏజెంట్లను పెట్టుకుని మామూళ్లు దండుకుంటున్నారు. నియోజకవర్గంలోని ఎర్రమట్టి 'గట్టు'ను మరో 'కేజీఎఫ్'గా మార్చేశారు. ఎర్రమట్టి మాఫియా నుంచి రోజు వారీ వాటా తీసుకుంటున్నట్టు సమాచారం. ఇక ఎమ్మెల్యే బావమరిది కూడా కీలక కాంట్రాక్టులు దక్కించుకున్నారు.



'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం సందర్భంగా రేవంత్‌తో రాహుల్ కరచాలనం

పైన రామ జపం.. లోన కత్తులు

మతాన్ని రాజకీయాలతో కలిపి ప్రజల్ని రెచ్చగొట్టడమే బీజేపీ విధానం

12

మోదీకి సముద్ర షికారుకు టైమ్ ఉంటుంది

మణిపూర్ ప్రజల కన్నీళ్లు తుడవడానికి మాత్రం ఆయనకు సమయం దొరకదు

ఫాసిస్టులపై పోరుకే రాహుల్ యాత్ర: ఖర్గే

మణిపూర్‌లో మళ్లీ శాంతి నెలకొల్పుతాం: రాహుల్

'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం

రావణ వాహనంపై శివపార్వతుల విహారం

▸▸ నేడు పార్వతీ కళ్యాణం.. నంది వాహన సేవ

శ్రీశైలం, జనవరి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆదివారం రావణ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోక కళ్యాణం కోసం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణ వాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా.. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం విశేషంగా నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం నంది వాహన సేవలో భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



రావణ వాహనంపై ఊరేగుతున్న శివపార్వతులు

బహిరంగ ప్రకటన

దిగువ షెడ్యూలులో మరింత స్పష్టంగా వివరించబడినట్టి ఆస్తులను (ఇందులో తర్వాత ఉమ్మడిగా ఆస్తిగా పిలువబడుతుంది) వాటి యజమానుల నుండి కొనుగోలు చేయాలని నా క్లయింట్ భావిస్తున్నారని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు భూమికి సంబంధించి ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, డిమాండ్ కలిగిన లేదా క్లెయిం చేస్తున్న లేదా ఉద్దేశించబడినట్టి సదరు లావాదేవీకి సంబంధించి ఏదేని ఆక్షేపణ కలిగిన ఎవరేని హక్కుదారు/వ్యక్తి లేదా సదరు భూమికి సంబంధించి ఏదేని అమ్మకం, ఒప్పందం, మార్టిగేజ్, అసైన్‌మెంట్, చార్జ్, గిఫ్ట్, లైసెన్స్, కౌలు, అనువంశికత్వం, తాకట్టు రుణభారాలు, తనఖా, తాకట్టు, అప్పులు, రుణబాధ్యతలు, అపరిష్కృత దావాలు, స్వాధీనం, కాంట్రాక్ట్/ ఒప్పందం, అభివృద్ధి హక్కులు, భాగస్వామ్యం, కుటుంబ ఒప్పందాలు/ పరిష్కారాలు, ఏదేని న్యాయస్థాన/రెవెన్యూ అథారిటీల తీర్పు లేదా ఉత్తర్వు, ప్రభుత్వ లేదా ఏదేని ఇతర హక్కుదారు సేకరణ, నిషేధం లేదా ఏదేని ఇతర అవరోధమునకు సంబంధించి ఏదేని విషయం తెలిసిన లేదా పార్టీగా ఉన్నట్టి ఎవరైనా హక్కుదారు/వ్యక్తి, (ఉమ్మడిగా క్లెయిమ్‌లు) ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 7 (ఏడు) రోజుల కాలంలోగా ఖైతాన్ & కో ఎల్ఎల్‌పి ఎంబసీ క్వెస్ట్, 3వ అంతస్తు, 45/1, మాగ్రత్ రోడ్, బెంగళూరు-560025 లో డాక్యుమెంటరీ రుజువులతో వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. లేనిచో సదరు ఆస్తికి సంబంధించి లేదా దానిపై మనుగడలో ఏవిధమైనా స్వభావం కలిగిన ఎటువంటి ప్రతికూల హక్కు, టైటిల్, ప్రయోజనం, వాటా, క్లెయిమ్ లేదా డిమాండ్ లేదని, భూమి యజమాని తాకట్టు రుణభారాలు లేని యాజమాన్యాన్ని, సదరు ఆస్తి స్వాధీనాన్ని కలిగి ఉన్నాడని, ఆస్తి యజమాని పూర్తి హక్కులు కలిగియున్నాడని, స్పష్టమైన మరియు మార్కెటబుల్ హక్కు, టైటిల్ మరియు ప్రయోజనం కలిగియున్నాడని భావించబడును మరియు ఏదేని అట్టి క్లెయిమ్ ఆస్తి ప్రస్తుత యజమాని/లు మరియు/లేదా ఎవరేని వారసులు అందుకు కట్టుబడి ఉండరని తెలియజేయడమైనది.

ఇందులో పైన తెలిపిన షెడ్యూలు ఆస్తి:

ఆస్తి వివరణ:

ఐటమ్ ఆస్తి1 : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, నూజివీడు రెవెన్యూ మండలం మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, దిగవల్లి గ్రామపంచాయతీ అధికారిక పరిధిలోని దిగవల్లి గ్రామం వద్ద గల 13 ఎకరాల విస్తీర్ణం కలిగిన మొత్తం,1) రీ సర్వే నం.680/1లోని 6 ఎకరాల 50 సెంట్ల భూమి విస్తీర్ణం,2) రీ సర్వే నం. 680/2లో కలిగిన 6 ఎకరాల 50 సెంట్ల విస్తీర్ణం కలిగిన భూమి.తూర్పు: మాటూరు సుధాకర్ మరియు మాటూరు రవికాంత్‌కు చెందిన భూమి, పశ్చిమం: మాటూరు సుధాకర్ మరియు మాటూరు రవికాంత్‌కు చెందిన భూమి, ఉత్తరం: మాటూరు సుధాకర్ మరియు మాటూరు రవికాంత్‌కు చెందిన భూమి మరియు అన్నారావు పేటకు వెళ్లే రోడ్ మరియు దక్షిణం: పోరంబోకు భూమి.

ఐటమ్ ఆస్తి 2 :

దానిపై నిర్మించబడినట్టి కట్టడాలతోపాటు, ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, నూజివీడు రెవెన్యూ మండలం, దిగవల్లి గ్రామపంచాయతీ అధికారిక పరిధిలోని దిగవల్లి గ్రామం వద్ద గల 14 ఎకరాల విస్తీర్ణం మొత్తం 1) రీ సర్వే నం.681/1లోని 11 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి, 2) సర్వే నం.681/2లోని 3 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి. సరిహద్దులు: తూర్పు: రీసర్వే నం. 685లోని భూమి, పశ్చిమం: రీ సర్వే నం.787లోని భూమి, ఉత్తరం: రీ సర్వే నం.లు 789 మరియు 799 లలోని భూమి మరియు దక్షిణం: రోడ్.

ఐటమ్ ఆస్తి 3:

ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, నూజివీడు రెవెన్యూ మండలం మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, దిగవల్లి గ్రామపంచాయతీ అధికారిక పరిధిలోని దిగవల్లి గ్రామం వద్ద గల 14 ఎకరాల 40 సెంట్ల విస్తీర్ణం కలిగిన మొత్తం,1) రీ సర్వే నం.685/1లోని 8 ఎకరాల 15 సెంట్ల భూమి విస్తీర్ణం,2) రీ సర్వే నం. 685/2లో కలిగిన 6 ఎకరాల 25 సెంట్ల విస్తీర్ణం కలిగిన భూమి.తూర్పు: నల్లిబోయిన కృష్ణ మరియు శోభనంకు చెందిన భూమి, పశ్చిమం: ఏవోవి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన భూమి, ఉత్తరం: అన్నారావు పేటకు వెళ్లే రోడ్, దక్షిణం: చిన్న కాలువ.

సుధీర్ మడమయ్య,అడ్వకేట్
ఖైతాన్ & కో ఎల్ఎల్‌పి,ఎంబసీ క్వెస్ట్, 3వ అంతస్తు,
45/1,మాగ్రత్ రోడ్, బెంగళూరు-560025,
టెలిఫోన్ : 9180 4339 7000,
మొబైల్: + 91 9845525612

తేది: 15 జనవరి 2024



తనిఖీల్లో పట్టుబడిన సిగరెట్లు, వాహనం

రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్ల స్వాధీనం

అనంతపురం క్రైం, జనవరి 14: అనంతపురం జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్‌లో 44వ జాతీయ రహదారిపై జీఎస్టీ అధికారులు రూ.2.35కోట్ల విలువ చేసే సిగరెట్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పెద్దఎత్తున సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు.. అనంతపురం కేంద్ర జీఎస్టీ విభాగాధికారులు తపోవనం సర్కిల్‌లో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఓ వాహనాన్ని తనిఖీ చేయగా బాక్సుల్లో ప్యాక్ చేసి, సిగరెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించి, రూ.2.35కోట్ల విలువ చేసే 40.68 లక్షల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసినట్టు అనంతపురం కేంద్ర జీఎస్టీ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ అనిత తెలిపారు.

అప్పన్న సేవలో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

సింహాచలం, జనవరి 14: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. ఆండాళ్ అమ్మవారి దర్శనం అనంతరం పండితులు ఆశీర్వదించగా, దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను శాలువాతో సత్కరించి, స్వామి వారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు

తిరుమలలో రేపు పార్వేట ఉత్సవం

తిరుమల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పార్వేట ఉత్సవం ఈ నెల 16న తిరుమలలో జరుగనుంది. అదేరోజు గోదాపరిణయోత్సవం కూడా నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం 9గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్ మఠం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి శ్రీవారికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

వివిధ

సాహిత్య వేదిక

"దళిత కవిత్వం అంటేనే ప్రశ్నించడం."



లోక్ నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కవి, అంతర్జాతీయ పర్యటన శాఖా నిపుణులు తుల్లిమల్లి విల్సన్ సుధాకర్‌తో ఇంటర్వ్యూ

సుధాకర్ గారూ, పాతికేళ్ల కిందటి కవిత్వారంభ యవ్వనం, ఇప్పుడు సాఫల్య దశకు చేరిందని అనుకుంటున్నారా?

నా కవిత్వం సాఫల్య దశకు చేరిందో లేదో పాఠకులే చెప్పాలి. నేను చెప్పడం సాహసమే అవుతుంది. రాయాల్సింది చానా ఉంది.

కాకపోతే గత పాతికేళ్లుగా నేను నిరంతర సమస్యల అధ్యయనంతో కవిత్వం రాస్తున్నందున, ఎప్పటికప్పుడు నవీకరించబడే వ్యక్తీకరణ ప్రక్రియలో వ్రాయడం, నాకంటూ ఒక వ్యక్తీకరణను సృష్టించుకోడం వల్ల నా కవిత్వం ఎప్పుడూ కొత్తదనాన్ని వెతుకుతున్నట్లు అనిపిస్తుంది. సొంత అభివ్యక్తిని సాధించడంలో విజయం సాధించానేమో అని అప్పుడప్పుడూ అనిపిస్తుంది.

ఆశ్చర్యకరమైన పోలికలు, సంక్లిష్టంగా అనిపించే అల్లికలు, పదునైన ఆగ్రహం, ప్రత్యేకమైన డిక్షన్... వీటిని మీ కవిత్వంలో ప్రధాన పనిముట్లు అనుకోవచ్చా?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యల గురించి నేను రాస్తున్నాను. నేను విశ్వవ్యాప్త ప్రేమ, బాధ, కోపం, పోరాటాలను కవిత్వంలో వ్యక్తీకరిస్తున్నాను. వీటిని కవిత్వంలో వ్యక్తీకరించే సాధనాలు నాకు ఎన్నో దొరికాయి. కవిత్వంలోనే ప్రశ్నించడం ఒకటి. దళిత కవిత్వం అంటేనే ప్రశ్నించడం. అదే పనిముట్లతో గిరిజనులు, మైనార్టీల సమస్యల గురించి రాయగలిగాను. సమకాలీన ప్రపంచంలోని ప్రధాన స్రవంతిలో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని, కవిత్వపాదాల్లో నిరసన, ప్రతిఘటన తెలియజేశాను. వ్యవస్థలో మార్పు కోరుకున్నాను. ఆంధ్రాలో దళితుల ఊచకోత, మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింస, హిజాబ్, పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న మారణకాండ, వీటన్నింటి మీద కవిత్వం రాసాను. రాయడానికి ప్రపంచ సమస్యలే నాకు పెద్ద కాన్వాసు. వీటినుండి స్ఫూర్తి పొందుతున్నాను. ఇంకా రాయాల్సింది ఎంతో ఉంది.

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ | పలకరింపు

పేర్లు చదవకుండా కేవలం కవిత్వం చదివి, కవి ఎవరో చెప్పగలిగిన బృందంలో నేనున్నందుకు సంతోషిస్తున్నాను. ఒక వ్యక్తి ఆరాధన కంటే వస్తువు మీద కవిత్వం రాసినప్పుడు ఇది జరుగుతుంది.

కవిగానే కాదు, పర్యాటక రంగ నిపుణునిగా కూడా మీకు జీవనసాఫల్య పురస్కారం ఇస్తున్నారు. ప్రపంచ పర్యటన మీ కవిత్వానికి ఎంతవరకు ఉపయోగపడింది?

చాలా మంది ఫీల్డులో ఎలాటి పాత్ర లేకుండానే పాల్గొనకుండానే ఉద్యమంలోకి వస్తుంటారు. కొంతమంది జర్నలిజం వార్తల ఆధారంగా కవిత్వం రాస్తారు, వివిధ సమస్యలపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. ఈ గందరగోళంలో వాస్తవాలు మరుగుపడుతుంటాయి. నిజానిజాలు కనిపెట్టడానికి ఎంతమందికి మూడో నేత్రం ఉంది? వివిధ దేశాలను సందర్శించే అవకాశం ఉండడం వల్ల కొన్ని కదలికలను, ఉద్యమాలను దగ్గరగా చూడగలిగాను. దక్షిణాఫ్రికాలో నల్లవారి బాధలే కాదు, తెల్లవారి కష్టాలు, భారతీయుల కష్టాలు, నల్లజాతీయుల ఆధిపత్యం కూడా చూడగలిగాను. మొరాకో వెళ్లినప్పుడు కాసాబ్లాంకా మురికివాడల్లో ప్రజల ఆత్మగౌరవ పోరాటాలు చూశాను. అభివృద్ధి చెందిన జపాన్‌లో కూడా అనేక రెస్టారెంట్‌లలో స్థానిక ప్రజలు, మైనారిటీలకు వ్యతిరేకంగా అనేక సైన్ బోర్డులు చూసాను. వివక్షాపూరిత చట్టాలు, జాత్యహంకార ప్రజలు కనబడతాయి. ఇవన్నీ దగ్గరగా చూడగలిగాను. దుబాయ్‌లో ఉన్నప్పుడు వలస కార్మికుల అవస్థలు కనబడుతుండేవి. ఇవన్నీ నాకవిత్వంలో రాసాను.

మార్క్సిస్టులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. దళితోద్యమకార్యకర్తలు కూడా దళితుల సమస్యలను పూర్తిగా తెలుసుకుని రాస్తుంటారు. అలాంటి ప్రపంచానుభవం నాది. వివిధ ప్రదేశాల్లోని సమస్యలను చూసే అవకాశం లభించింది. అవన్నీ నా కవిత్వంలో నిలిచిపోతాయి.

పేరు చూడకుండానే కవిత్వ కర్తను గుర్తుపట్టగలిగే అతి కొద్ది మంది కవుల్లో మీరు చేరారు, మీ వ్యక్తీకరణలోనే కాక, మీరు ఎంచుకునే వస్తువుల్లో కూడా మీ ముద్ర కనిపిస్తుంది. వాట్ నెక్స్ట్?

'Death of author' కాన్సెప్ట్ వినే ఉంటారు. సాహిత్య సిద్ధాంతంలో, కవి కవిత్వం మీద ఎప్పటికీ ఆధిపత్యం వహించడు. కవి మరణిస్తాడు. కవిత్వం మాత్రమే మిగిలి ఉంటుంది. కవిత్వం రాసాక కవి మరణిస్తాడు. మరణం తరువాత, పాఠకులు మరిన్ని కళాకృతుల కోసం తహతహ లాడుతుంటారు. అలాంటి వాతావరణంలో పేర్లు చదవకుండా కేవలం కవిత్వం చదివి, కవి ఎవరో చెప్పగలిగిన బృందంలో నేనున్నందుకు సంతోషిస్తున్నాను. ఒక వ్యక్తి ఆరాధన కంటే వస్తువు మీద కవిత్వం రాసినప్పుడు ఇది జరుగుతుంది. ఈ లక్షణం కొనసాగుతుంది. అయితే వైయక్తిక అనుభూతులతో భావాలతో భావ కవిత్వం కూడా రాశాను. కానీ నిరసన కవిత్వంలోనే వ్యక్తిగత అనుభూతులతో రాసినవి ఎన్నో ఉన్నాయి. కవిత్వంలో విశాల దృక్పథంతో రకరకాల అంశాలతో కవిత్వం రాస్తూ వచ్చాను.

95380 53030

రామేశ్వరం కాకులూ, కొల్లేటి పక్షులూ... పతంజలి కథా!

బొమ్మలు: అక్బర్

మీకు పతంజలి శాస్త్రి తెలుసా? అదే ఆ కథలు రాసే శాస్త్రి, కాదు కాదు నాటకాలు కూడా రాశాడే ఆ పతంజలి, లేదూ పర్యావరణ ఉద్యమాలంటూ తిరుగుతాడే అదిగో ఆ కురచగా ఉండి, పిచ్చిగా నవ్వే పతంజలిశాస్త్రి. ఆ... ఆయనే.

ఎప్పుడో పుట్టిన మనిషి, మరెక్కడో పెరిగిన మనిషి అని చెప్పుకోవటం ఎప్పుడూ వినేదే. ఫలానా కథ రాసిన మనిషి అని చెప్పుకోవటం బావుంటుంది, ఫలానా ప్రాంతంలో భూమిని కాపాడిన మనిషి అని చెప్పుకోవటం ఇంకా బాగుంటుంది. కవి లేదా రచయిత అన్నవాడు ఉద్యమకారుడైనప్పుడు అతని నుంచి ఉత్తమమైన సాహిత్యం వస్తుంది. మనిషి మనిషిలాగానే ప్రవర్తిస్తాడు. పోలీసు పోలీసులాగే ఉంటాడు. కథల్లో సన్నివేశాలు మరీ కృతకంగా అనిపించవు. అయితే అంతా సహజంగానే ఉంటే మరి కథెక్కడ ఉంటుంది!? ముగింపులో... అవును ముగింపులోనే కథ మొదలు ఉంటుంది. దాదాపు చివరికి వచ్చేవరకూ అక్కడే కథంతా ఉందని పాఠకుడికి తెలియకుండా దాచి ఉంచటం బహుశా పతంజలిగారికి ఉన్న ప్రత్యే'కథ'.

'రామేశ్వరం కాకులు', 'కచ్చప సీత', 'మార్కండేయుడి కాఫీ', 'భగవంతం కోసం', 'దూరెన్ పాము' లాంటి కొన్ని కథల్లో పాత్రలన్నీ ఏదో ఒకరకమైన మౌనాన్నీ, భారమైన జీవితాన్నీ మోస్తూనే ఉంటాయి. చివరలో ఆ కథ మొదలు అలా ఎందుకుందో అర్థమయ్యే మాటలు కనిపిస్తాయి అప్పుడు... అక్కడ కథని టెక్నికల్‌గా ముగించేస్తాడు. అక్కడినుంచీ పాఠకుడు మళ్ళీ కథలోకి వెళ్ళాల్సిన అనివార్యమైన స్థితిలో పడిపోతాడు.

ఒక సామాజిక, పర్యావరణ ప్రేమికుడిగా, ఉద్యమకారుడిగా ఉన్నందునే ఆయన కథల్లో అంశాలు కూడా అవే విషయాలని చర్చిస్తాయి. చరిత్ర, పౌరాణిక అంశాలని టచ్ చేసినా మానవ సమాజ హెచ్చుతగ్గులనూ, మానసిక సంచలనాన్నీ చర్చించటం రెగ్యులర్‌గా కనిపించే విషయం.



'గుప్తా 91' కథ చదివితే కథ చెబుతున్నట్టుగా కాక ఒక ప్రాంతపు సామాజిక, భౌగోళిక మార్పుని ఇంతందంగా చెప్పొచ్చా అనిపిస్తుంది. రకరకాల పాత్రల మధ్యలో ఒక మధ్యతరగతివాడి పొదుపరితనం, దాన్ని అధిగమించే ఖర్చులూ, నిరంతరం మేజిక్ జరుగుతున్నట్టుగా మారిపోతున్న ప్రపంచ చిత్రం ఒక ఇరవయ్యేళ్లకాలాన్ని చుట్టచుట్టి తలలోకి కూరటం అంత ఈజీగా సాధ్యపడేది కాదు. కానీ పతంజలిశాస్త్రికి అదేమంత ఇబ్బంది కూడా అయినట్టుగా అనిపించదు. అట్లాగే 'మార్కండేయుడి కాఫీ' లోనూ. అతను... ఆమెకోసం ఎదురు చూస్తాడు, చూస్తూనే ఉంటాడు అతనికి ఆమెమీద ఇష్టం కంటే, ఎదురు చూడటంలోనే ఏదో ఆనందం ఉందన్న విషయం అర్థం కావటానికి కాస్త సమయం పడుతుంది. కానీ ఆ కథ పూర్తయ్యాక మార్కండేయుడు భేతాళుడిలా మన బుర్రలోంచి పోడు. ఇక్కడ కొట్టొచ్చినట్టు కనిపించే ఒక లక్షణం ఏమిటంటే... కథ పాఠకుడిని ఏమాత్రం తక్కువ అంచనాలో ఉంచదు. తనకన్నా పాఠకుడి ఊహాశక్తి తక్కువని రచయిత ఏమాత్రం అనుకోడు. అందుకే కథ స్థల కాలాలలో పాటుగా ముందుకూ వెనక్కూ నడుస్తుంది, అనుకోకుండా ఫ్లాష్‌బ్యాక్ లోకి వెళ్ళిపోయి చప్పున వెంటనే మళ్లీ వర్తమానంలోకి వస్తుంది. ఇదొక ప్రత్యేకమైన టెక్నిక్. ఇది ప్రయత్నిస్తే వస్తుందేమో కానీ అంత సులభ సాధ్యమైనదైతే కాదు.

'భగవంతం కోసం', 'రామేశ్వరం కాకులు', 'ఆమెదనంతపురం' లాంటికథల్లో ఉండే ప్రత్యేకమైన ముగింపులు, ఆ చిన్న చిన్న సంభాషణల్లో అంతర్గతంగా వినిపించే నిశ్శబ్దం ఒక వింత స్థితిలోకి తీసుకుపోతాయి. అయితే ఈ కథల్లోని ఏ పాత్రా మన ఊహకు అందనిది కాదు, మనం చూసే అనేకానేక మనుషులలాగే అత్యంత సాధారణంగా ఉంటుంది, ఆ పాత్రల ప్రవర్తనా, వాటి చుట్టూ ఉండే వాతావరణమూ మన నిత్య జీవితాల్లో కనిపించేవే అయి ఉంటాయి. ఒక రచయిత ఎంతగా ప్రజా జీవితంలో మమేకమైతే అతని రచనా విస్తృతి అంతగా పెరుగుతుంది. రాసే రచనలో వైవిధ్యం ఉంటుంది. ఒకరకమైన మాజిక్ రియలిజం లాంటి కథాగమనంలోనూ కొత్తదనం వచ్చి చేరుతుంది. కాబట్టే పతంజలిశాస్త్రి మాజిక్ రియలిజం తరహా కథల్లోనూ ఏమాత్రం లాజిక్ మిస్సవని తీరు కనిపిస్తుంది. 'భగవంతం కోసం', 'అలవాటైనకోతి', 'దూరెన్ పాము' లాంటి కథల్లో మార్మికత, మాజిక్ రియలిజం సుస్పష్టంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఈ కథలన్నిటిలో పైన చదివేది వేరు, అంతర్లీనంగా రచయిత మనకు చెప్పాలనుకున్నది వేరు. ఇక ఈ కథలని కాస్త అందంగా తీర్చిదిద్దటానికి వాడే పోలికలూ, ఉపమానాలు కొన్నిసార్లు పాఠకున్ని ఆశ్చర్యపరిచేలా ఉంటాయి. అన్నిటికన్నా ముఖ్యంగా పాత్రల స్వభావాన్ని మరీ ఎక్కువ పరిచయం చేసే అవసరం లేకుండా బ్రాకెట్‌లో వాడే చిన్నమాటతో చెప్పటం. ఇది తెలుగులో ఇదివరకు ఎవరన్నా వాడారో లేదో తెలియదు గానీ, ఇదొక అద్భుతమైన ప్రయోగం, ఇది ఈ కథల విక్రమార్కుడి మార్కు. కథ చెప్పినంత సులువుగా రాయటం అలవడిన అతి తక్కువమంది రచయితల్లో పతంజలి ఒకడిగా ఉన్నాడని అంటే ఒప్పుకోని వాళ్ళెవరైనా ఒకసారి మళ్ళీ ఆ కథల్ని చదివితే నా అభిప్రాయంతో ఏకీభవిస్తారనే అనుకుంటున్నాను. నిజానికి ఈ కథలు ఒకరు చెబితేనో, వివరిస్తేనో అర్థమయ్యేవి కాదు. వాటిని నేరుగా చదివితే తప్ప రచయిత ఇచ్చే గొప్ప అనుభవాన్ని పొందటం కష్టం. కథలు, నవలలు, ప్రతీ దాంట్లో పర్యావరణం ప్రకృతి నియమాలు ఒక అంశంగా మారడానికి కారణం ఆయన క్రియాశీలంగా పర్యావరణ పరిరక్షణలో భాగం కావడమని గమనించగలం. కల్చర్, మ్యూజిక్, డాన్స్, పొలిటికల్ హిస్టరీ... ఇలా అన్నిటిలోనూ ఉన్న ప్రవేశం పతంజలిశాస్త్రిని మరింత ప్రత్యేకంగా చేసింది.

'మనో చీమ' వంటి కథను చదువుతున్నప్పుడు ఒక కార్యశీలిగా పతంజలి స్వభావమూ, ఆయన ఆలోచనా ధోరణీ స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా రచయితగా తనని తాను మోసం చేసుకోవటాన్ని నిరాకరించే స్వభావమూ ఉంది.

కొల్లేటిని కాపాడుకోవటం కోసం చేసిన పోరాటం, కొల్లేరు ప్రాంతాన్ని చేపల చెరువులుగా మార్చి అక్కడి జీవావరణాన్ని నాశనం చేసే ప్రయత్నాలని అడ్డుకోవటం కోసం పడ్డ శ్రమా పతంజలి శాస్త్రి రచయితగా చేసిన దానికంటే ఎక్కువ. 1994లో పిల్లల్లో పర్యావరణ స్పృహని పెంచేందుకు సిలబస్‌లో దాన్ని పాఠ్యాంశాలుగా చేర్చాలన్న తీర్పు రావటం, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా, పబ్లిక్ హియరింగ్ మెంబెర్‌గా పనిచేసిన శాస్త్రి కథల్లో కూడా ఆ అంశాలనే ఎత్తుకోవటం వింతగా ఏమీ అనిపించదు. అయితే పోరాట జీవితం ఆయన వ్యక్తిగత ఆరోగ్యాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో, కథకుడిగా, రచయితగా మరింత బలపరిచింది.

'కాసులోడు' కథలో సెజ్‌లో భూముల ఆక్రమణని చర్చిస్తే, 'రామేశ్వరం కాకులు' మరికొన్ని కథల్లో పోలీసు పాత్రలు, పొలిటీషియన్ల రూపాలూ మరింత పచ్చిగా కనిపిస్తాయి. ఇవన్నీ కొత్తవీ, వింతవీ కాదు. మనకు తెలియని నిజాలూ కావు. కానీ అవి కథలుగా మారే క్రమంలో మరింత లోతుగా మనలని ప్రభావితం చేయగలవు. ఒక న్యూస్ ఆర్టికల్ చదివినదానికన్నా ఎక్కువ సమాచారం ఇవ్వగలవు. ఇది అరవయ్యేళ్ల కాలపు కథకుడు ఈ సమాజాన్ని గమనిస్తూ వచ్చి వాటిని డాక్యుమెంట్ చేసి పెట్టిన రిపోర్ట్‌గా అనుకోవచ్చు. ఈ మహా కాలపు మార్పులని, మనుషుల, సమాజాల మానసిక, భౌతిక మార్పులని తెలుసుకోవచ్చు.

> **ఒక సామాజిక, పర్యావరణ ప్రేమికుడిగా, ఉద్యమకారుడిగా ఉన్నందునే పతంజలిశాస్త్రి కథల్లో అంశాలు కూడా అవే విషయాలని చర్చిస్తాయి. చరిత్ర, పౌరాణిక అంశాలని టచ్ చేసినా మానవ సమాజ హెచ్చుతగ్గులనూ, మానసిక సంచలనాన్నీ చర్చించటం రెగ్యులర్‌గా కనిపించే విషయం. పతంజలిశాస్త్రి గురించి, ఆయన కథల గురించి చర్చ జరుగుతుందంటే ఈ సమాజాన్ని మరింత అర్థం చేసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టే. ఇది ఈ కాలానికీ ఈ తరం పాఠకులకీ అత్యవసరమైన విషయం.**

అందుకే ఇప్పటికి ఈ సంతోషమంతా! పతంజలిశాస్త్రి గురించి ఆయన కథల గురించి చర్చ జరుగుతుందంటే ఈ సమాజాన్ని మరింత అర్థం చేసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టే. ఇది ఈ కాలానికీ ఈ తరం పాఠకులకీ అత్యవసరమైన విషయం.

నరేష్కుమార్ సూఫీ
95736 09460

కపర కపర చీకటి



ఆరోజు
నాకు జ్ఞాపకముంది
గూట్లోనుంచి తొంగి చూసే జిట్టపిట్ట మాదిరి
కలుజు మీద పారే నీళ్లు
తల్లి గుండెల మీద పారాడే బిడ్డ లెక్క
ఏట్లో ఎక్కుతున్న చేపలు

నీ నోట్లో నుంచి
ఎవరికెవరం ఏమౌతాం
ఏటి చేప యాడికెళ్తుందో
గేలమేసి గుండె నొక్కేస్తే
పాన మేమో పాకమౌతుంది
కొడం తెచ్చి మాయ చేసేస్తే
చెరువులోకి చేప పోతుందా
కపర కపర చీకటవుతుంది
ఏటి నీళ్లకు ఎక్కిళ్లు అంటూ పాడిన పాట
చెరువు గుండెను సంద్రం చేసింది

నాయిన భుజాన బిడ్డెక్కినట్టు
కలుజు ఎక్కిన నీటి పాదాల సవ్వడి
నీ పాట లాగానే మాయమైంది
గుండెల్లో భూకంప అలజడి
దూరమైన చేపల దుఃఖమిలా
బతుకుతెర మీద ప్రత్యక్షం

ఇప్పుడు
రక్త సంబంధాల మధ్య
మైలు రాళ్లు
చుట్టపు చూపుకొచ్చే కళ్ళు లేవు
బంధాలకు విలువివ్వని
దాయాదులు
ఇంటికొచ్చి పలకరించే
నోళ్లు, గూట్లో చిక్కుకున్నాయ్

అమ్మను
పలకరించే అన్నదమ్ములేరి
నన్ను భుజానేసుకుతిరిగిన
మేనత్తలేరి
కురుస్తున్న వానకు
చేతులడ్డం పెట్టి
తొడునిలిచిన తోబుట్టువులేరి

అంత
ఎందుకు నాయనా
ఒకే రొమ్ము పాలు తాగిన
మా పెదాలు, మాట్లాడుకొని
మాపిటేళ కావొస్తోంది

నువ్వు
పాడిన పాటలో
చెరువు గుండె సంద్రం అయినట్టు

చెట్టు కొమ్మలు
విరుగుతున్న చప్పుడు
పైరులో
తెగులుపడ్డ దిగులు
కంటి ముందు
కపర కపర చీకటి

సుంకర గోపాలయ్య
94926 38547

ముగియని కాలంలో



ఏమో
నువ్వెప్పుడూ
ఏదో మాటాడాలని
మొదలు పెడతావు
ఇంతలో
ఒక పూవు రాలిపోతూ
నేలను తాకుతుంది
నెత్తురంటిన మట్టిని
దోసిలిలోకి తీసుకుని
హృదయానికి హత్తుకుంటావు
ఓ పసిపాప
ఊదారంగు గౌనుతో
ఎదురుగా చినిగిన
పుస్తకాలసంచీతో నడిచిపోతూ ఉంటుంది
ఆ పాదముద్రలను తాకుతూ
ఒరిగిపోతావు

మనుషుల కోసం
మరో మారు ఆర్తిగా
అన్వేషిస్తావు
మొండి గోడల మధ్య
బూడిద రాలిన చెట్ల ఆకులపై
వేలితో నిమురుతూ
ఏదో తెలియని ప్రాకృత భాషలో
రాసిపోతావు
అవునా
నన్నిలా
ఈ నిశ్శబ్ద శూన్యంలో వదిలేసిన
నిన్ను మరలా ఎలా పలికిలించగలను
యుద్ధమెప్పుడూ ముగియని
కాలంలో

కెక్యూబ్ వర్మ
94934 36377


కరుణ కుమార కథల్లో నిశితమైన దళిత స్పృహ

వందల సంవత్సరాల కుల చరిత్ర బ్రిటిష్ వలస పాలనలో ఆధునికమవుతున్న భారత దేశంలో మొదటిసారిగా ప్రశ్నింపబడింది. ఇంగ్లీషు విద్యా ఉద్యోగాల వల్ల, ఆధునిక ప్రాపంచిక విజ్ఞాన శాఖల పరిచయం వల్ల పెరిగిన హేతుబద్ధ మానవీయ దృష్టి ఇందుకు దోహదపడింది. ఈ నేపథ్యంలో జ్యోతిబా పూలే 1873-74లలో సత్యశోధక సమాజాన్ని స్థాపించి కుల వ్యవస్థ మూలాలకు, ఉనికికి సంబంధించిన చర్చ ప్రారంభించాడు. 1910 నాటికి శివరామ్ కాంబ్లే నిమ్న జాతుల వారి మహాసభను ఏర్పాటు చేశాడు. కర్మ వీర్ షిండే- నారాయణ్ గణేష్ చందావర్కర్ సహకారంతో దళిత జాతుల సేవా సంఘం స్థాపించాడు. ఆ సమయంలోనే హిందూ మత సంస్కరణ కొరకు బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం ఏర్పడి దళితుల ఆత్మగౌరవ చైతన్యానికి అభివృద్ధికి కారణమయినాయి. 1917లో కలకత్తా కాంగ్రెస్ సమావేశం దళితుల అభివృద్ధిని కోరుతూ అస్పృశ్యతను నిరసిస్తూ తీర్మానాలు చేసింది. 1920 నుండి జాతీయోద్యమ రాజకీయాలలో అస్పృశ్యతా నివారణ ప్రధాన అంశమయింది. 1923 తరువాత హరిజనోద్యమ నిర్మాణం ప్రముఖంగా ముందుకు వచ్చింది. 1924లో డా. బి.ఆర్ అంబేడ్కర్ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని ప్రారంభించాడు.

ఈ తరుణంలో భిన్న కులాల సమూహాల అనుభవాల వ్యక్తీకరణకు వాతావరణం సిద్ధమై తెలుగు సాహిత్యం దళిత చైతన్యాన్ని ప్రతిఫలింప చేయడం అత్యంత సహజంగా ప్రారంభమైంది. అగ్రకులాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, తిరస్కరిస్తూ స్వీయ జీవితానుభవాలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న వాళ్లు దళిత బహుజనులే కాక ఇతర వర్గాల నుండి అనేకమంది ఉన్నారు. 1934 నుంచి 1968 వరకు గల కాలాన్ని దళిత కథల ప్రాథమిక దశగా విమర్శకులు గుర్తించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిని ఈ విభాగంలో మొదటి కథకుడిగా భావిస్తున్నాం.

ఈ దశలోనే అభ్యుదయ దృక్పథంతో దళితుల పక్షం వహించి కథలను రచించిన వారు కరుణకుమార. వీరి అసలు పేరు కందుకూరి అనంతం. అరసం గుంటూరు శాఖ ఈమధ్య కథా స్రవంతి పేరుతో పదిమంది ప్రసిద్ధ రచయితల కథా సంపుటాలను విడుదల చేసింది. అందులో ఒకటైన 'కరుణకుమార కథలు' సంపుటి దళిత బహుజన వాదాన్ని బలంగా వినిపించి ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కథలు 1934-1956 మధ్యకాలంలో రచింపబడినాయి.

'పోలయ్య' కథ అస్పృశ్యతకు సంబంధించినది. రాత్రిపూట రైలు దిగిన బ్రాహ్మణుడు పోలయ్య బండి తీయడానికి సుముఖంగా లేకపోయి నప్పటికీ ఎక్కువ డబ్బును ఇస్తానని నానారకాలుగా ఒప్పించి ఊర్లోకి వెళ్లడానికి బండి ఎక్కుతాడు. దారి మధ్యలో జరిగిన సంభాషణలో పోలయ్య దళితుడని తెలుసుకొని గ్రామానికి చేరిన తరువాత గ్రామ పెద్దలతో కలిసి అతన్ని హింసిస్తాడు. కానీ పోలయ్య ప్రాణాపాయ పరిస్థితులలో తన పేరు పౌలయ్య అని తాను క్రైస్తవుడనని చెప్పి ప్రమాదం నుండి తప్పించుకుంటాడు. అది బ్రిటిష్ పాలనా కాలం గనుక ఫాదర్‌లకి సర్కారు వారికి చాలా స్నేహం ఉంటుందని గ్రామ పెద్ద నాయుడు శిక్షించడానికి వెనుకంజ వేస్తాడు. ప్రభువుల మతం క్రైస్తవం కనుక ఆ మతాన్ని నిందిస్తే ప్రభువును నిందించినట్లేనని బ్రాహ్మణుడు తప్పుకుంటాడు. దళిత స్త్రీ శ్రమను ఆమె కుటుంబపోషణ బాధ్యతను ఎలా తీసుకుంటుందో యంత్రాలు మనుషుల ఉపాధిని ఎలా పోగొడతాయో పోలయ్య పాత్ర సంభాషణ ద్వారా రచయిత తెలియజేస్తాడు. రాజ్యాధికారం ప్రభావం ఎలా ఉంటుందో సంప్రదాయాలు కట్టుబాట్లు ఎలా విడిపోతాయో విశదపరుస్తుందీ కథ. కుల వ్యవస్థ చేత తిరస్కరించబడి బహిష్కరించబడిన దళితులకు క్రైస్తవ మిషనరీలు మతమార్పిడి ద్వారా సామాజిక గౌరవాన్ని కల్పించడాన్ని ఈ కథ స్పష్టపరుస్తుంది.



> **కుల వివక్షతలు, వర్గ వైరుధ్యాలు, అధికార ఆర్థిక ఆధిపత్యాలు పోయి సాంఘిక సమానతా సంస్కృతి పరిపూర్ణంగా వికసించాలని దళిత సాహిత్యపు తొలినాళ్లలోనే మనసులని కదిలించేలా చిత్రించినవి కరుణ కుమార కథలు.**

దళిత స్త్రీల దుస్థితిని చిత్రించిన కథ 'పశువుల కొఠం'. అంటరాని వాళ్ళుగా పరిగణిస్తూనే హీనంగా చూస్తూనే దళిత మహిళలని చెరపట్టే అగ్రకుల ఆధిపత్య పురుషాహంకారాన్ని, అందుకు వారి ప్రయత్నాలను పన్నే కుట్రలను కళ్ళముందు ఉంచుతుందీ కథ. పెంచలి, రొబ్బడు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. పెళ్లి చేసుకోవాలనుకుంటారు. రాయుడు పెంచలిని లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తాడు. ఆమె తిరస్కరిస్తుంది. రొబ్బడు పోలీసు సూపరిండెంట్ వద్ద గుర్రాన్ని చూసుకుంటూ ఉంటాడు. సూపరిండెంట్ అనుమతితో తన పెళ్లిలో ఆ గుర్రం మీద ఊరేగాలనుకుంటాడు. దీనిని అడ్డుకోవడం కోసం రాయుడు బహుజనుల ఐక్యతను దెబ్బతీసేలా రెచ్చగొట్టి ప్రేరేపిస్తాడు. పెంచలి రొబ్బడుల పెళ్లి విషయం తెలుసుకున్న రాయుడు పన్నిన కుట్రతో రొబ్బడి చేతిలోనే పెంచలి ప్రాణాలు పోయేంతగా దెబ్బలు తిని మతిభ్రమణకు చేరువై పడిపోతుంది.

'కయ్యు - కాలువ' ఒక దళిత రైతు కథ. వంద ఎకరాల భూమికి యజమానురాలైన లక్ష్మమ్మ ఆమె పొలం పక్కన కొండడు అనే దళితునికి అర్ధ ఎకరం పొలం ఉండడాన్ని భరించలేక దాన్ని తన పొలంలో కలిపేసుకోవడానికి కొండడిని అనేక విధాల పీడిస్తుంది. ఆ పొలాన్ని కాపాడుకోవాలని పట్టుదలతో మంచి పంట పండిస్తాడు. లక్ష్మమ్మ బంధువులతో కలిసి కుట్ర చేసి దొంగతనం నింద మోపి కేసు పెట్టి అపరాధం వేయిస్తుంది. చివరకు పంటకు అగ్గి పెట్టిస్తుంది. కాలిపోతున్న పంటను చూసి కుప్పకూలిపోతాడు కొండడు.

ఆధిపత్య కుల పీడన మీద దళితుల తిరుగుబాటు కథ 'కొత్త చెప్పులు'. కొత్త చెప్పులు కుట్టి తీసుకురావడంలో ఒకరోజు ఆలస్యమైందని నరిసి అనే దళిత మహిళను చిన్నపరెడ్డి కొడతాడు. ఆమె చనిపోవడంతో బావిలో పడవేయిస్తాడు. విషయం తెలుసుకున్న దళితులు అతని ఎద్దు చనిపోతే తీసుకుపోవడానికి రారు. చివరికి అగ్రకులాల వారు గ్రామంలోని వారు కలిసి ఎద్దును పూడ్చవలసి వస్తుంది. నరసి కుట్టించిన కొత్త చెప్పుల వల్ల కాళ్లు పుండుపడి ఆసుపత్రిపాలై చిన్నపరెడ్డి ప్రాణం వదులుతాడు.

విద్యావంతులైన దళితులు కూడా కులవివక్షతను వర్గ వైరుధ్యాలను ఎదుర్కొనక తప్పలేదని తెలిపే కథ 'టార్చిలైట్'. జకరయ్య అనే దళిత ఉపాధ్యాయుడు ఉత్తర్వులను అనుసరించి తప్పని స్థితిలో సంపన్నుల దగ్గర విరాళాలు సేకరించి ఆటల పోటీలు నిర్వహిస్తాడు. బహుజనుల పిల్లలే బహుమతులన్నీ గెలుచుకుంటారు. అగ్రకులాల వారి ఒత్తిడితో పిల్లల బహుమానాలను తిరిగి తీసుకుంటాడు. వాటిని గ్రామపెద్ద పెద్దిరెడ్డి స్వాధీనంలో పెట్టుకుంటాడు. కానీ టార్చ్‌లైట్‌ను బహుమతిగా పొందిన విద్యార్థి తిరిగి ఇవ్వడు. కథ మలుపులు తిరిగి చివరికి జకరయ్య విధులకు అనర్హుడిగా తీర్మానించబడి ఉద్యోగం నుండి తొలగించబడతాడు.

దళిత కథల్లో తొలి తరానికి సంబంధించినవి కాబట్టి చాలా కథల్లో ధిక్కారం లేకపోవడం, కేవలం కారుణ్యం మాత్రమే చిత్రించగలిగిన పరిస్థితి ఈ కాలపు పాఠకులను కలచి వేస్తుంది. కుల వివక్షతలు, వర్గ వైరుధ్యాలు, అధికార ఆర్థిక ఆధిపత్యాలు పోయి సాంఘిక సమానతా సంస్కృతి పరిపూర్ణంగా వికసించాలని దళిత సాహిత్యపు తొలినాళ్లలోనే మనసులని కదిలించేలా చిత్రించినవి కరుణ కుమార కథలు.

కాచాపురం దుర్గాదేవి
78930 93495

'విభజిత' కథా సంపుటి

విజయ భండారు కథా సంపుటి 'విభజిత' ఆవిష్కరణ సభ జనవరి 18 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఓల్గా, శీలా సుభద్రాదేవి, మామిడి హరికృష్ణ, వి. సంధ్య, మానస ఎండ్లూరి, నందిగాం నిర్మల పాల్గొంటారు.

హస్మిత ప్రచురణలు

బాలల కథా సంకలనాలకు ఆహ్వానం

తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న 'బాల సారస్వతం' పరంపరలో ప్రచురించే బాల కథా సంకలనాల కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. బాలల మూర్తిమత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ బాంధవ్యాలు తదితర అంశాలను స్వీకరించి ఏ4 సైజులో ఒకటిన్నర పేజీకి మించకుండా టైప్ చేసి పంపాలి. కథలను జనవరి 20లోగా ఈమెయిల్: telanganasaraswathaparishath@gmail.com కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 88852 45234.

జె. చెన్నయ్య

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలను పంపాలి. బహుమతి పొందిన సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున ఏప్రిల్‌లో పదివేల రూపాయల నగదు, పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగును. మీ కథా సంపుటాలు మూడేసి ప్రతులను జనవరి 31లోగా చిరునామా: అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15-120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ - 509209, తెలంగాణకు పంపాలి. వివరాలకు: 94927 65358.

వనపట్ల సుబ్బయ్య

నవలలకు ఆహ్వానం


రజనీశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారానికి నవలలను ఆహ్వానిస్తున్నాం. ఈ పురస్కారం కింద ప్రశంసా పత్రం, శాలువాతో పాటు రూ.10,116/- నగదు ఉంటుంది. రచయితలు జనవరి 1, 2014 నుంచి డిసెంబర్ 31, 2023 మధ్య ముద్రితమైన వారి సొంత నవలలు నాలుగు ప్రతులను ఫిబ్రవరి 10లోగా చిరునామా: గాజుల రవీందర్, ఇం.నెం.: 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ - 505001కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 98482 55525.

గాజుల రవీందర్

దళిత ప్రేమ కథలకు ఆహ్వానం

గత ఏడాది మార్జిన్స్ ప్రచురణల నుంచి మేం తెచ్చిన దళిత కథల సంకలనం 'ముళ్ళ చినుకులు'కి వచ్చిన స్పందనతో చేస్తున్న మరో ప్రయత్నం దళిత ప్రేమ కథల సంకలనం. దళిత, దళితేతర రచయితలందరి నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. దళిత, ఇతర కులాల మధ్య చిగురించిన ప్రేమకథలే వస్తువు. చివరి తేదీ ఏప్రిల్ 30. డిటిపి చేసిన కథని ఓపెన్ ఫైల్లో ఈమెయిల్: dalitapremakathalu@gmail.com కు ఈమెయిల్ చెయ్యాలి.

మానస ఎండ్లూరి, అరుణ గోగులమండ





• సందడిగా సంక్రాంతి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజధాని అమరావతిలోని మందడంలో ఆదివారం నిర్వహించిన 'పల్లె పిలుస్తోంది రా.. కదలిరా' కార్యక్రమంలో టీడీపీ-జనసేన 'భోగి సంకల్పం' తీసుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాజధాని రైతులు, మహిళలు మంగళహారతులు పట్టారు. సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.

- అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో రెండు జిల్లాల్లో పందేలు..
- బరుల్లో వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు
- గుడివాడ కే కన్వెన్షన్‌లో జూద క్రీడలు
- అంపాపురం, పైపులరోడ్డు, యనమలకుదురులో భారీగా పందేలు
- జగ్గయ్యపేటలో దేవదాయ భూమిలో నిర్వహణ
- పనిలో పనిగా వైసీపీ అసంతృప్తులకు గేలం
- జూదాల్లో ఎమ్మెల్యేల అనుచరులకు వాటాలు
- నగరంలో లాడ్జీలు, హోటల్స్ ఫుల్

కోట్లాట..!

తొలిరోజు రూ.100 కోట్ల పైబడి పందేలు





అంబాపురంలో కోడి పందేలు

అనుకున్నదే అయ్యింది. సంక్రాంతి పండుగ మొదటి రోజు కోడి పందేలు జోరుగా సాగాయి. రెండు జిల్లాల్లో కలిపి ఆదివారం ఒక్కరోజే రూ.100 కోట్ల వరకూ చేతులు మారాయి. పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా.. ఎన్ని బైండోవర్లు చేసినా.. అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రతిచోటా కోడి పందేలు రూ.కోట్లకు పడగలెత్తాయి.

- 6లో..





అసమ్మతి సెగ



కంకిపాడులో వైసీపీ నేతల బ్యానర్

సిటింగ్‌లకు సీట్ల మార్పుపై స్థానిక నేతల ఆగ్రహం

పెనమలూరులో జోగి రమేశ్‌పై వెల్లువెత్తుతున్న నిరసనలు

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పదవికి పడమట స్నిగ్ధ రాజీనామా
- అదే బాటలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూడా..
- అధిష్ఠానం నిర్ణయాలు సరికాదంటూ ఫ్లెక్సీలు, ర్యాలీలు
- సెంట్రల్‌లో వెలంపల్లికి సీటుపై రచ్చ
- సరికాదంటున్న కార్పొరేటర్లు, బ్రాహ్మణ సంఘాలు
- ఎన్నికల నిధుల పేరిట భారీ వసూళ్లు

వైసీపీలో అసమ్మతి సెగలు రగులుతున్నాయి. ఎమ్మెల్యేలను ఇతర నియోజకవర్గాలకు మారుస్తుండటంపై స్థానిక నేతల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సెంట్రల్ నియోజకవర్గంలో మల్లాది విష్ణును కాదని స్థానికేతరుడైన వెలంపల్లికి సీటు ఇవ్వడంపై స్థానిక నేతలు రగిలిపోతుండగా, ఎమ్మెల్యే పార్థసారథిని కాదని మంత్రి జోగి రమేశ్‌కు సీటు ఇవ్వడంపై పెనమలూరు నియోజకవర్గంలో ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి, ర్యాలీలు నిర్వహించారు. అసమ్మతి సెగలు ఎంతలా రాజుకుంటున్నా.. తమకెందుకులే.. అన్నట్టుగా ఈ రెండు నియోజకవర్గాల్లో కొత్త నాయకులు అప్పుడే ఎన్నికల వసూళ్ల దందాకు తెరలేపడం కొసమెరుపు.

- 6లో..









తుమ్మల బుడ్డికి పెనమలూరు సీటు కేటాయించాలంటూ కంకిపాడులో బైక్ ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

అసమ్మతి సెగ!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా జోగి రమేశ్‌ను నియమించడంపై వైసీపీ స్థానిక నేతలు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుడికే వైసీపీ టికెట్ ఇవ్వాలంటూ ఆందోళనలకు దిగుతున్నారు. డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ తుమ్మల చంద్ర శేఖర్ ఈ నినాదాన్ని తెరపైకి తెచ్చారు. జోగికి టికెట్ ఇచ్చినందుకు నిరసనగా స్నిగ్ధ ఇప్పటికే పదవికి రాజీనామా చేయగా, తుమ్మల చంద్రశేఖర్ సైతం అదే ఆలోచన చేస్తున్నారు. కాగా, జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమించడం సరైన చర్య కాదంటూ కంకిపాడు బస్టాండ్‌లో ఫ్లెక్సీలు వెలిశాయి. మరోవైపు సెంట్రల్ నియోజకవర్గంలోనూ వెలంపల్లికి కార్పొరేటర్లు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు రోజుకో డివిజన్‌లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తాను పోటీలో ఉంటా నని, తనకే సహకరించాలని సందేశాలు పంపుతున్నారు. స్థానికేతరులకు అవకాశం కల్పించవద్దని ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. విష్ణుకు టికెట్ నిరాకరిం చడంపై బ్రాహ్మణ సామాజికవర్గం ఆగ్రహంతో ఉంది.

ఎన్నికల కోసం వసూళ్లు

నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమితులై రోజులు కూడా గడవక ముందే వెలంపల్లి, జోగి రమేశ్‌లు తమ కొత్త నియోజకవర్గాల్లో అప్పుడే వసూళ్ల దందాకు తెరలేపారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధిష్ఠానం ఆదేశాల మేరకు సెంట్రల్‌కు వచ్చిన వెలంపల్లి శ్రీనివాసరావు తన సామాజికవర్గానికి చెందిన వ్యాపారులకు ఫోన్లు చేసి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. అదే సమయంలో ఎన్నికల నిధుల పేరుతో వసూలు మొదలుపెట్టారు. వ్యాపారుల స్థోమతను బట్టి ఎన్నికల వ్యయమంటూ ఆఫర్ ఇస్తున్నారు. మళ్లీ తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుం దంటూ డబ్బు ఇవ్వని వారిని బెదిరిస్తున్నారు. ఒక్కో వ్యాపారి నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం.

జోగి చెంతకు వీరభక్త హనుమాన్

పెనమలూరు నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథిని అపఖ్యాతి పాలు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఓ వీరభక్త హనుమాన్ ప్రస్తుతం జోగి రమేశ్ చెంతకు చేరారు. సారథి పేరు చెప్పి పెనమలూరులో భారీగా వసూళ్లు చేసి గట్టిగా సొమ్ము చేసుకున్న ఈయన తాజాగా జోగి రమేశ్ పేరుతో వసూళ్లకు తెర దీశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే పార్థసారధికి వీరభక్తుడిగా ఉన్న ఈ హనుమంతుడు ఓ బార్ మార్పు విషయంలో ఎమ్మెల్యేతో విభేదించాడు. ఆయనకు దూరమయ్యాడు. ఈ బార్ వివాదంలో తనకు సహకరించలేదంటూ నియోజకవర్గంలోని ఓ మున్సిపల్ ఉన్నతాధికారిపై కక్షకట్టిన ఈయన జోగి రమే శ్‌కు సదరు అధికారిపై ఉన్నవి లేనివి నూరిపోసి బదిలీ చేయించేందుకు ప్రయత్ని స్తున్నాడు. భవన నిర్మాణదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఫోన్లు చేసి పెనమ లూరులో గెలిచేది జోగి రమేశ్ అని, ఆయనకు సహకరించకపోతే ముస్ముందు ఇబ్బందులు పడతారని బెదిరిస్తున్నాడు. జోగి రమేశ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నికల నిధులు సమర్పించుకోవాలని సూచిస్తున్నాడు. పార్థసారథిపై అవినీతి ఆరోపణలు రావడానికి కీలకమైన ఈ వీరభక్త హనుమాన్‌ను దూరం పెట్టకపోతే జోగి రమేశ్ ఎన్నికల్లో గెలవడం అసాధ్యమని సొంత పార్టీ నాయకులే వ్యాఖ్యాని స్తున్నారు. మరోవైపు నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు జోగి రమేశ్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. సారథి హయాంలో పెనమలూరు, కంకిపాడుకు తన సామాజికవర్గానికి చెందినవారిని సీఐలుగా నియమింపజేసుకున్నారు. జోగి రమేశ్ వారిని బదిలీ చేయించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

పెనమలూరు టికెట్ స్థానికులకే కేటాయించాలి

కంకిపాడు: వైసీపీ పెనమలూరు అభ్యర్థిగా అధిష్ఠానం మంత్రి జోగి రమేశ్ పేరును ప్రకటించటంతో ఆ పార్టీ శ్రేణుల నుంచి కంకిపాడులో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పెనమలూరు టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని బైక్ ర్యాలీలు చేస్తున్నారు. ఫ్లెక్సీలు కట్టి నిరసనలు తెలుపుతున్నారు. కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి)కి సీటు కేటాయించాలంటూ ఆయన అభిమా నులు, అనుచరులు, శనివారం భారీ నిరసన ప్రదర్శన, రాస్తారోకో చేశారు. ఆది వారం కంకిపాడులో బైక్ ర్యాలీ నిర్వహించి నిరనసన తెలిపారు. పెనమలూరు టికెట్‌ను మహిళకు కేటాయించాలని పెనమలూరు నియోజకవర్గ వైసీపీ నాయ కులు, కార్యకర్తల పేరుతో కంకిపాడు సెంటర్‌లో భారీ ఫ్లెక్సీని రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. "జోగి రమేశ్‌కు టికెట్ కేటాయించడం సరైన నిర్ణయం కాదు. నియోజక వర్గంలో పరిచయాలు లేని జోగిని ఎలా నియమిస్తారు. జగన్ పునరాలో చించుకోవాలి." అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

భోగితో పాటే జగన్ పీడ పోతుంది

▸▸ కొనకళ్ల నారాయణ విమర్శ

మచిలీపట్నం టౌన్, జనవరి 14: భోగితో పాటే రాష్ట్రా నికి పట్టిన జగన్ పీడ త్వరలోనే వదిలిపోతుందని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన అక్రమ, చీకటి జీవోల ప్రతులను తన ఇంటి వద్ద ఆది వారం వేసిన భోగిమంటల్లో ఆయన వేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వ చీకటి జీవోల ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న కొనకళ్ల నారాయణ



దీక్షా శిబిరం వద్ద చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న అంగన్వాడీలు

ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రబంద్

▸▸ అంగన్వాడీల హెచ్చరిక.. 34వ రోజుకు సమ్మె

మచిలీపట్నం టౌన్, జనవరి 14: అంగన్వాడీల డిమాండ్లు ఆమోదిం చకపోతే రాష్ట్ర బంద్‌కు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. అంగన్వాడీల సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరు కుంది. శిబిరంలో పిల్లలకు భోగిపండ్లు పోశారు. భోగిమంటలు వేశారు. సంతకాల ఉద్యమం చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి రెజీనారాణి మాట్లాడారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. లక్ష సంతకాలతో సీఎంకు మహజర్ సమర్పిస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు ఉమామహేశ్వరరావు, లెనిన్‌బాబు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయ కుడు టి.చంద్రపాల్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘ నాయకుడు యూనస్, సీఐటీ యూ నాయకుడు సీహెచ్ జయరావు, బి.సుబ్రహ్మణ్యం, నాంచారమ్మ పాల్గొన్నారు.

18న చంద్రబాబు నిమ్మకూరు రాక

పామర్రు, జనవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కృష్ణాజిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు నిమ్మకూరు వస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర ఆది వారం తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు వర్థంతిని పురస్కరించుకుని గ్రామంలోని ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పిస్తారని, అనంతరం హెలికాప్టర్‌లో గుడివాడలో రా..కదలిరా కార్యక్ర మానికి హాజరవుతారని తెలిపారు. హెలీప్యాడ్ స్థలాన్ని టీడీపీ రాష్ట్ర నాయుకుడు, పెందుర్తి వెంకటేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా తదితరులు నిమ్మకూరులో పరిశీలించారు.



అంపాపురంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న కోడి పందేలు

కోట్లాట..!

తొలిరోజు రూ.100 కోట్ల పైబడి పందేలు ● అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో రెండు జిల్లాల్లో జోరుగా..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): ఉమ్మడి జిల్లాలో తొలిరోజు రూ.100 కోట్ల పైబడి కోడి పందేలు జరిగాయి. తెరవెనుక ఉండి కొందరు, ముందుండి మరికొందరు కోడిపందేలు, పేకాట, గుం డాటలను నిర్వహించారు. పశ్చిమ కృష్ణా నుంచి తూర్పు కృష్ణా వరకు వైసీపీ నేతల కనుసన్నల్లో జూద క్రీడలు జోరుగా సాగాయి. గుడివాడలో మాజీ మంత్రి కొడాలి నానీకి చెందిన కే కన్వెన్షన్ సెంటర్‌లో పేకాట, గుండాట, లోపల-బయట ఆటలు సాగాయి. యనమలకుదురులో మంత్రి జోగి రమేశ్ ఫ్లెక్సీలు పెట్టుకుని మరీ పందేలు, పేకాట నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ నాయకులు కొత్త ట్రిక్ అమలు చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టిం చుకోకపోవడంతో అసంతృప్తిగా ఉన్న మండల, గ్రామస్థాయి నాయకులను బుజ్జగించే పనిలో పడ్డారు. పేకాట, గుండాట, కోడిపందేల నిర్వహణలో వారికి వాటాలు ఇచ్చి సంతృప్తి పరుస్తున్నారు.

బరికో లెక్క

బాపులపాడు మండలం అంపాపురంలో భారీగా బరులు ఏర్పాటు చేశారు. ఒక్కో బరికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పందేలు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్కో పందెం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ జరుగుతున్నాయి. బరుల్లో ఉన్న వారి కంటే, బయట ఉన్నవారు ఎక్కువ పందేలు కడుతున్నారు. ఇక్కడ తొలిరోజు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల పం దేలు నడిచినట్టు తెలుస్తోంది. యనమలకుదురులో యార్లగడ్డ రమేశ్, మహేశ్ టీమ్ ఆధ్వర్యంలో మంత్రి జోగి రమేశ్ ఫ్లెక్సీ లను బరుల వద్ద ఏర్పాటు చేశారు. గుండాట, నంబర్లాట, లోపల-బయట ఆటల్లో టేబుళ్లపై మద్యం సీసాలు పెట్టుకుని మరీ జూదాలు నిర్వహించారు. కంకిపాడు మండలంలోని ఉప్పు లూరు, ఈడుపుగల్లు, గుడవల్లులో భారీగా బరులు ఏర్పాటు చేశారు. పెనుగంచిప్రోలులో ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జూదం నిర్వహించారు. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, విజయ వాడ రూరల్ మండలంలో ఆదివారం ఉదయం నుంచే కోడి పందేలు మొదలయ్యాయి. జగ్గయ్యపేట నియోజకవర్గం తిరుమలగిరిలోని దేవదాయ శాఖ భూమిలో, గరికపాడులో ప్రభుత్వ భూమిలో పందేల బరులను ఏర్పాటు చేశారు. తెలం గాణ సరిహద్దు ప్రాంతం కావడంతో ఖమ్మం, నల్లగొండ, సూర్యా పేట, కోదాడ ప్రాంతాల నుంచి పందెపురాయుళ్లు అధిక సంఖ్య లో వచ్చారు. కొత్తూరు తాడేపల్లి, పాములకాల్వ, అంబాపురంలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పందేలు, పేకాట జరిగాయి. కొన్నిచోట్ల నిర్వాహకులను పోలీసులు బైండోవర్ చేశారు. వారు స్టేషన్లలో ఉన్నా అనుచరులు మాత్రం ఆటలను ఆగనివ్వలేదు.

నేటి నుంచి పొట్టేళ్ల యుద్ధం

అంపాపురంలో ఈసారి కోడిపందేలతో పాటు పొట్టేళ్ల పం దేలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను సోమవారం నుంచి మొద లుపెడతారు. ఆదివారం కోడిపందేలు, పేకాట, గుండాట జోరుగా జరిగాయి. హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి 280 పొట్టేళ్లు అంపాపురం చేరుకున్నాయి. ఈ పోటీలకు ప్రత్యే కంగా బరులను ఏర్పాటు చేశారు. ఒక్కో పొట్టేలు వద్ద ముగ్గురు, నలుగురిని కాపలా ఉంచుతున్నారు. ప్రత్యర్థి పొట్టేలును బలంగా ఢీకొట్టడానికి ప్రత్యేక ఆహారాన్ని అందజేస్తున్నారు.



పందేల కోసం తెచ్చిన పొట్టేళ్లు



అంపాపురంలో గోవా వారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కేసినో

అంపాపురంలో జోరుగా
కోడిపందేలు, కేసినో

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అంపాపురం కోడిపందేల బరిలో పోలీసుల పహారా కార ణంగా కోడిపందేలు, కేసినో మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రధానబరిలో రూ.5 లక్షలకు పైనే కోడిపందేలు నిర్వహిస్తు న్నారు. పక్కన 8 చిన్నబరుల్లో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ కోడిపందేలు నిర్వహిస్తున్నారు. మూడు శిబిరాల్లో ఏర్పాటు చేసిన కేసినోలో నగదు లెక్కపెట్టేందుకు యంత్రాలు వి నియోగిస్తున్నారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నారు. వాకీటాకీలతో కూడిన బౌన్సర్లతో అనుమతి లేనివారిని లోనికి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేశారు. పందేలను చూసేందుకు వచ్చిన వారి కార్లతో అంపాపురం వద్ద జాతీయ రహదారి పక్కనేగల సర్వీస్ రోడ్డు నిండిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొంతమంది తమ కార్లను రహదారి పక్కనేగల ఖాళీ స్థలాల్లో నిలిపి పందేలను తిలకించేందుకు వెళ్లిపోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కేవలం నగదు చెల్లింపులే ఉండగా, అంపాపురం బరిలో ప్రజల సౌకర్యార్థం ఫోన్‌పే సౌకర్యంతో లిక్కర్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఇందులో అన్నిరకాల మద్యం అమ్మ కాలు సాగుతున్నాయి. ఆరుబయట రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన వారు తమతో పాటే మద్యం తెచ్చుకుంటున్నారు. కేసినోలో పాల్గొనే వారికి మందు, విందు టేబుళ్ల వద్దకే సమకూర్చేలా వ్యక్తులను నియమించారు. గోవాకు చెందిన సంస్థ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత మధ్య మూడు కేసినో శిబిరాలను ఏర్పాటు చేశారు. నగదు లెక్కించి కాయిన్స్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా యంత్రాలను వినియోగిస్తున్నారు. మూడు శిబిరాలకు వేర్వేరుగా పాస్‌లు, పాల్గొనేవారికి ప్రత్యేకంగా చేతి కంకణాలు ఇస్తున్నారు



ఆరుబయట బార్ అండ్ రెస్టారెంట్



లిక్కర్ దుకాణం



చేతులు మారుతున్న నోట్ల కట్టలు

బరిపై పోలీసుల దాడి

▸▸ తాత్కాలికంగా మూసివేత

హనుమాన్‌జంక్షన్ సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో వీరవల్లి ఎస్సై చిరంజీవి, హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్ధన్, తిరుమల రావులతో కూడిన బృందం ఆదివారం రాత్రి 8గంటలకు అంపాపురం బరిపై ఆకస్మికంగా దాడి చేసింది. అనుమతి తీసుకున్న సమయం మీరి కోడిపందేల నిర్వహణ చేయడం నేరమని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సాయంత్రం 6గంటల తర్వాత కోడిపందేలు నిర్వహించరాదని, హద్దు మీరితే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. బరి వద్దకు ఎవరూ రాకుండా వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ ఎస్సైల పర్యవేక్షణలో సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు.



అంపాపురం బరిని మూసేసి, పహారా కాస్తున్న వీరవల్లి ఎస్సై చిరంజీవి

దుర్గగుడిలో సంక్రాంతి సంబరాలు

వన్‌టౌన్, జనవరి 14: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సంక్రాంతి పం డుగను పురస్కరించుకుని ఆదివారం భోగి పండుగతో సంప్రదాయబద్ధంగా వేడు కలు ప్రారంభమయ్యాయి. ధాన్యగారం, ఎడ్లబండి, వివిధ రకాల బొమ్మలు, అంద మైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, అయోధ్య రామమందిర నమూనాతో ముగ్గు, పల్లె జీవనాన్ని ప్రతిబింబించేలా పూరి గుడిసెలు, కోళ్లు, రోళ్లు, కుండలు తయారు చేసే కుమ్మరులు, ఇసురు రాళ్లను ప్రదర్శనలో ఉంచారు. ఉదయం ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారుల సమక్షంలో భోగి మంట లను వేశారు. భోగి పండుగ, ఆదివారం నాడు రావడంతో అమ్మవారిని దర్శించు కునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొందరు పొంగళ్లను సమర్పిం చారు. సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు పోశారు.



దుర్గగుడిలో భోగిమంట వెలిగిస్తున్న ఈవో రామారావు తదితరులు

కలెక్టర్ ఇంట సంక్రాంతి సందడి



భోగిమంటలు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు దంపతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు ఇంట సంక్రాంతి సంబరాలు అంబ రాన్నంటాయి. ఏటా శ్రీకాకుళం జిల్లాలోని తన స్వగ్రామంలో భార్య, పిల్లలు, కుటుంబసభ్యులతో కలిసి జరుపుకొనేవారు. ఈసారి ఎన్నికల విధుల రీత్యా ఆదివారం విజయవాడలోని తమ నివాసంలో కుటుంబంతో కలిసి పండుగ జరుపుకొన్నారు. దిల్లీరావు సతీమణి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి తమ ఇంట రం గుల ముగ్గులు వేసి, బంతిపూలతో అలంకరించారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రశాంతి పట్టు చీర, దిల్లీరావు లాల్చీపైజమా, పిల్లలు సంప్రదాయ దుస్తులు ధరించారు. హరిదాసు కీర్తనలు, కోడి పుం జులు, గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గంగిరెద్దులతో కలెక్టర్ దంపతులు, వారి పిల్లలు ఆడుకున్నారు. ఉదయం ఇంటి వద్ద భోగి మంటలు వేశారు. పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు వచ్చి వారికి అభినందనలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రతి లోగిలి సంతో షంగా సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.



ఘంటసాలలో ఎన్టీఆర్ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, కొనకళ్ల నారాయణ, గొర్రెపాటి రంగనాథ్‌బాబు

ఘనంగా ఎన్టీఆర్ శతజయంత్యుత్సవం

ఘంటసాల, జనవరి 14: టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామా రావు శత జయంత్యుత్సవాన్ని ఆదివారం ఘంటసాలలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద నందమూరి తారక రామారావు ప్రాం గణ పైలాన్‌ను, ఎన్టీఆర్ విగ్రహాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎన్ఆర్ఐ రంగనాథబాబు ఆవిష్కరించారు. జలధీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన సభలో మండలి మాట్లా డారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అధికారానికి దూరంగా ఉన్న కొన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగ స్వామ్యాన్ని ఎన్టీఆర్ కల్పించారని కొనకళ్ల పేర్కొన్నారు. గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఎన్ఆర్ఐ డాక్టర్ దండమూడి రాజేంద్రప్రసాద్, బాణావత్ వెంకటేశ్వరమ్మ, మండలి వెంకట్రామ్, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, అత్తలూరి గోపీచంద్, కాకుమాని రంగారావు పాల్గొన్నారు.



స్వచ్ఛ కార్యకర్తలతో విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

స్వచ్ఛ చల్లపల్లి దేశానికే స్ఫూర్తిదాయకం

▸▸ 3వేల రోజుల పాటు కొనసాగిన స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం

చల్లపల్లి, జనవరి 14: 3000 రోజులపాటు నిర్విరామంగా కొనసాగిన స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం దేశానికే స్ఫూర్తిదాయకమని విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతృత్వంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం 3000 రోజు లకు చేరిన సందర్భంగా ఆదివారం గంగులవారిపాలెం రోడ్డులోని సన్‌ఫ్లవర్ స్ప్లెండర్ సిటీవద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఆర్కే దంపతుల అంకితభావం, సేవాతత్వం, త్యాగం కారణంగానే ఇన్ని రోజులు కార్యక్రమాన్ని కొనసాగించగలిగారన్నారు. సర్పం చ్ కృష్ణకుమారి, అధికారులు, గ్రామస్థుల సహకారం అభినంద నీయమ న్నారు. స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమానికి స్వచ్ఛాంధ్ర మిషన్ సహకారం లభించేలా కృషిచేస్తానని తెలిపారు. స్వచ్ఛ కార్యకర్తల నిస్వార్థ శ్రమతో స్వచ్ఛ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు డీఆర్కే ప్రసాద్ తెలిపారు. తొలుత గంగులవారిపాలెం రోడ్‌లో విశ్రాంత సీఎస్ మొక్కను నాటి నీరుపోశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

పామర్రు, జనవరి 14: మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారిపై కురుమద్దాలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కురుమద్దాలికి చెందిన తానేటి హరీష్(22), పంది గోవి ంద్(22) ఆదివారం ఉదయం స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకుని గ్రామంలోకి వస్తుండగా, మంచులో ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌కు దారి కనిపించక ఆకస్మాత్తుగా బ్రేక్‌వేశాడు. దాంతో వెనుకనుంచి వస్తున్న యువకుల బైక్ ఆట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడిక క్కడే దుర్మరణం చెందారు. ఇద్దరిలో ఒకరు వేరే రాష్ట్రంలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. పండగ సందర్భంగా గ్రామానికి వచ్చాడు. మరో యువ కుడు విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. ఇద్దరు యువకులు పండుగ రోజున దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి పోస్టు మార్టంనిమిత్తం గుడివాడ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..

వన్‌టౌన్, జనవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, ఆయన అల్లుడు కాండ్రేగుల రవీంద్ర, కుమారుడు వరుణ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వరుణ్ బాబు పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబుకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీస్సులు అందుకున్నారు. చంద్రబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రబాబుతో బుద్దా వెంకన్న, కుటుంబసభ్యులు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న దేవినేని ఉమా

అనధికార మైనింగ్ వెనుక
వైసీపీ నేతల అనుచరులు

▸▸ కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ నిలుపుదల చేసే వరకు దీక్షలు కొనసాగిస్తాం: దేవినేని ఉమా

విజయవాడ రూరల్, జనవరి 14: "మండలంలోని కొత్తూరు తాడేపల్లి గ్రామంలో యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఇందులో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ రఘురాం అనుచరుల హస్తం ఉంది. మట్టి తవ్వకాలు చేస్తూ వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తు తున్నారు. ప్రభుత్వ సంపద విచ్చలవిడిగా దోచుకుతిం టున్నారు. గ్రామంలో అనధికార మైనింగ్‌ను నిలుపుదల చేసే వరకు దీక్షా శిబిరం కొనసాగుతుంది" అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టంచేశారు. కొత్తూరు తాడే పల్లిలో అక్రమ మైనింగ్ నిలిపివేయాలని మూడు రోజులుగా గ్రామ రైతులు నిరసన తెలుపుతున్నారు. దీక్షా శిబిరానికి ఆది వారం ఉమా వచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో అక్రమ మైనింగ్ అడ్డుకోవాలని అధికారులకు ఎన్ని ఫిర్యా దులు చేసినా చర్యలు శూన్యమన్నారు. హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యు నల్ కోర్టులు మైనింగ్ ఆపాలని ఆదేశాలు ఇచ్చినా అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తున్నారన్నారు. మైనింగ్‌ను అడ్డుకు నేందుకు వచ్చిన సబ్ కలెక్టర్ వెళ్లకుండా రోడ్లు తవ్వేశార న్నారు. సబ్ కలెక్టర్‌కే దిక్కు లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మాఫియాకు మైనింగ్, పోలీసు, ఫారె స్ట్, రెవెన్యూ అధికారులు అండగా నిలవడం సిగ్గుచేటన్నారు.

వైసీపీ ఎంపీ బీ-ఫాం కోసం
అమరావతిపై విషం చిమ్ముతున్నారు

▸▸ ఎంపీ కేశినేని నానీపై దేవినేని ఉమా ఆగ్రహం

ఇబ్రహీంపట్నం: వైసీపీ ఎంపీ బీ-ఫాం కోసం కేశినేని నాని అమరావతిపై విషం చిమ్ముతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇబ్రహీంపట్నంలో ఉమా విలేకరులతో మాట్లా డారు. మైలవరం వీరప్పన్‌తో చెట్టాపట్టాలేసుకుని శంకుస్థా పనలు ప్రారంభోత్సవాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపల్లి మున్సిపల్ ఫలితాలు వచ్చినప్పుడు కుర్చీలు కౌన్సి లర్ల మీద ఎగిరిపడుతుంటే ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వసంతలు చెరో పక్క చిద్విలాసం చిందిస్తూ కూర్చున్నారని అది రాజకీయ వ్యభిచారం కాదా అని ప్రశ్నించారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

అంగన్వాడీలకు మద్దతుగా సంతకాల సేకరణ

గవర్నర్‌పేట, జనవరి 14 : అంగన్వాడీలకు జీతాలు పెంచాలని 34 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బీసెంట్ రోడ్డులో నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు డీవీ కృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుప్రజ ప్రసంగించారు.

16న మల్లఖంబ్ క్రీడాకారుల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు : చెన్నైలో ఈ నెల 19 నుంచి 31 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2024 నిర్వహణలో భాగంగా రాష్ట్రం నుంచి ప్రతిభావంతులైన మల్లఖంబ్ క్రీడాకారులను గుర్తించడానికి ఈ నెల 16న ఉదయం 9 గంటలకు భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్ అండర్-19 బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు శాప్ వీసీఎండీ ధ్యాన్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 1న లేదా తర్వాత జన్మించిన వారు ఆధార్ లేదా పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు.



భోగి మంటల్లో జీవోల నకళ్లు వేస్తున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

భోగి మంటల్లో జీవో నకళ్ల దహనం

విద్యాధరపురం : జగన్ పాలన ప్రజల కోసం ఏర్పడింది కాదని, ఇబ్బందులు పెట్టడానికి వచ్చిన ప్రభుత్వమని జనంలో ముద్రపడిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం భోగి మంటలు వేశారు. వైసీపీ పాలనలో అమలు కాని జీవో 1, జీవో 2 నకళ్లను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో దహనం చేశారు.

టీడీపీ పశ్చిమ కార్యాలయంలో

పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జగన్ పాలనలో నెరవేరని హామీ పత్రాలను టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో టీం టీడీపీ సభ్యులు భోగి మంటలలో వేసి తగులబెట్టారు.

పల్లెకు చలో

ప్రయాణికులతో బస్టాండ్, రైల్వేస్టేషన్ కిటకిట

బస్టేషన్, జనవరి 14 : సంక్రాంతి పండుగకు నగరం నుంచి స్వగ్రామాలకు వెళ్లేవారితో బస్సులు కిటకిటలాడాయి. రెండవ శనివారం, ఆదివారం, పండుగ సెలవు కలిసిరావడంతో 3 రోజుల వరుస సెలవులను వినియోగించుకునేందుకు ఉద్యోగస్తులు వారి కుటుంబాలతో సహా తమ సొంతూర్లకు బయలుదేరి వెళ్లారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేసినప్పటికీ జనం రద్దీ కనిపించింది. మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, రాజమండ్రి, తెనాలి తదితర ప్రాంతాలకు విజయవాడ నుంచి వెళ్లేవారికి బస్సుల కొరత ఏర్పడింది. పల్లెవెలుగు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా ప్రైవేట్ బస్సుల వాళ్లు అత్యధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ రావడానికి టికెట్టు రూ.1500 నుంచి రూ.2వేల వరకు డిమాండ్‌ను బట్టి వసూల్ చేశారు. వరుస సెలవులు రావడంతో కొంతమంది పుణ్యక్షేత్రాలకు అప్పటికప్పుడు అనుకుని వెళ్లడంతో సీట్ రిజర్వేషన్ దొరకని పరిస్థితి ఏర్పడింది.



స్వగ్రామాలకు బయలుదేరిన ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

ఆంధ్రరత్న భవన్ వద్ద భోగి వేడుకలు

గవర్నర్‌పేట : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ వద్ద భోగిమంటలు వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భోగి మంటల చుట్టూ తిరుగుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పాటించారు.

బెల్టు షాపులపై దాడులు

● 110 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం
● నలుగురిపై కేసు నమోదు

పాయకాపురం, జనవరి 14 : నున్న, పాతపాడు, వాంబేకాలనీల్లో గ్రామాల్లో మద్యం బెల్టు షాపులపై నున్న రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఆదివారం కేసు నమోదు చేసిన పోలీసులు 110 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి మూడు చోట్ల దాడులు నిర్వహించి పాతపాడు గ్రామంలో మద్యం అమ్మకాలు జరుపుతున్న కొడేంటి బాబురావు, కరంకి సాంబశివరావు, బోడపాడులో అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతున్న మరీదు దుర్గారావు, కండ్రికలో మద్యం అమ్ముతున్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని 110 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాయకాపురం, జనవరి 14 : పక్కింటి మహిళ వద్ద బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం బెవర కల్యాణీ వాంబేకాలనీలో నివాసం ఉంటుంది. సమీపంలో నివాసం ఉంటున్న ఆర్.శివ శంకర్ అనే వ్యక్తితో పరిచయం ఉంది. వారం రోజుల క్రితం తనకు డబ్బు అవసరమని బంగారు ఆభరణాలు ఇస్తే తాకట్టు పెట్టి అప్పు తీర్చుకుంటానని నమ్మబలికాడు. రెండు రోజుల్లో ఆభరణాలు తిరిగి ఇచ్చేస్తానని చెప్పడంతో మహిళ 20 గ్రాముల బంగారపు వస్తువులను శివశంకర్‌కు ఇచ్చింది. అయితే వారం రోజులైన ఆభరణాలు ఇవ్వకపోవడం సమాధానం చెప్పకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ విజేతగా సుప్రీత

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 14: నగరంలోని ఫన్‌టైమ్స్ వీఎంసీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన ఉమెన్ ఫిడేమాస్టర్ పొట్లూరి సుప్రీత 6.5 పాయింట్లతో విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సత్యసాయి జిల్లాకు చెందిన బఫ్రీద్ టి.ఖాన్, మూడో స్థానంలో విశాఖ జిల్లాకు చెందిన గంప ఆదిత్య వరుణ్ నిలిచారు.

పోతిన మహేష్‌పై పాట విడుదల

వన్‌టౌన్, జనవరి 14 : యశ్వంత్ రచించిన మహేషన్న గెలిస్తే మనం గెలిచినట్టేరా.... అంటూ సాగిన గేయాన్ని 50వ డివిజన్ పరిధిలో పాటల రచయిత గాయకుడు కొక్కిలిగడ్డ యశ్వంత్ ఆదివారం విడుదల చేశారు. జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేష్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్షిస్తూ ఈ పాటను విడుదల చేశారు.

ముగ్గుల పోటీలు

కృష్ణలంక : ఆదివారం కృష్ణలంక గుండుకోటయ్య వీధిలో జనసేన రాష్ట్ర నాయకురాలు పోతిరెడ్డి అనిత అధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకి, కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

లబ్బీపేట, జనవరి 14 : రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ సంక్రాంతి సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో మొదటి రోజు వేకువజామునే స్వామి వారికి మంగళ ఆరతి పూజ కార్యక్రమాలతో ప్రారంభించారు. జగన్నాథస్వామి రథోత్సవం నిర్వహించారు. భోగి మంటలు వేసి మంటల చుట్టూ హరినామా సంకీర్తనలు, నృత్యలతో భక్తులు ప్రదక్షిణలు చేశారు. మందిరం అలయ ప్రాంగణాన్ని అత్యంత వైభవంగా అలంకరించారు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, గంగిరెద్దుల ఉత్సహం, హరిదాసుల కీర్తనలతో ఘనంగా పండుగ ఉత్సవాలు నిర్వహించారు. ● లబ్బీపేటలో ముస్లిం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో లబ్బీపేటలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో పాల్గొన్న కృష్ణలంక సీఐ కె.దుర్గారావు దుర్గారావు మాట్లాడారు.



జగన్నాథస్వామి రథోత్సవం

ఘనంగా గోదాదేవి కల్యాణం

భవానీపురం, జనవరి 14 : ధనుర్మాసంలో భాగంలో వైష్ణవాలయాల్లో భోగి పండుగ సందర్భంగా గోదా కల్యాణాలు కన్నుల పండువగా ఆదివారం సాగాయి. విద్యాధరపురంలోని టెంపుల్‌స్ట్రీట్‌లో పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు సుంకు శ్రీరాములు ఆధ్వర్యంలోనూ, స్థానికచెరువు సెంటర్‌లోని సీతాలక్ష్మణ సమేత కోదండ రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగమల్లు జనార్ధనరావుల ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణమహోత్సవం వైభోవోపేతంగా సాగాయి.

జంధ్యాలకు నివాళి

విజయవాడ కల్చరల్, జనవరి 14 : సినీ రచయి, దర్శకులు 'హాస్యబ్రహ్మ' జంధ్యాల జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కళామంజరి సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు పీవీఎల్ నరసింహం, చివుకుల హరగోపాల్ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ



భారతదేశపు తొలి సోలార్ అబ్జర్వేటరీ ఉపగ్రహం 'ఆదిత్య ఎల్ 1' నాలుగు నెలల ప్రయాణానంతరం విజయవంతంగా తన గమ్యస్థానమైన లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్ 1) వద్ద గల హాలో ఆర్బిట్‌లో ప్రవేశించింది. ఈ విజయంతో సూర్యుడిని అధ్యయనం చేసేందుకు అబ్జర్వేటరీని పంపిన అయిదో దేశంగా భారత్ నిలిచింది.

గతంలో అమెరికా, బ్రిటన్, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ, జపాన్ తమ అబ్జర్వేటరీ ఉపగ్రహాలను సూర్యుని అధ్యయనానికి పంపాయి.

ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ అంటే?

'ఆదిత్య' అంటే సంస్కృతంలో 'సూర్యుడు' అనీ; ఎల్ 1 అంటే 'లాంగ్రేజ్ పాయింట్ 1' అనీ అర్థం. భూమికి సూర్యునికి మధ్య ఉన్న లాంగ్రేజ్ పాయింట్ 1 వద్ద గల హాలో ఆర్బిట్‌లో ఈ అబ్జర్వేటరీని ప్రవేశపెడతారు. అందుకే దీనికి 'ఆదిత్య ఎల్ 1' అని నామకరణం చేశారు.

సౌర వాతావరణాన్ని, ఖగోళంలో సౌర ప్రభావాలను (సోలార్ డైనమిక్స్) అధ్యయనం చేసేందుకు ఏడు పేలోడ్లతో రూపొందించిన అంతరిక్ష అబ్జర్వేటరీ ఉపగ్రహమే 'ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ'. దీని మొత్తం బరువు 1475 కేజీలు.

లాంగ్రేజ్ పాయింట్ 1 అంటే?

లాంగ్రేజ్ పాయింట్స్ అంటే రెండు ఖగోళ వస్తువుల గురుత్వాకర్షణ బలాలు సమానంగా పనిచేసే ప్రదేశాలు. ఇలా రెండు గురుత్వాకర్షణ బలాలు సమంగా ఆ ప్రదేశాల్లో ఉండడం వల్ల ఏదైనా చిన్న వస్తువు అక్కడ పరిభ్రమించేందుకు కావాల్సిన అభికేంద్ర బలం (సెంట్రిపెటల్ ఫోర్స్) సమకూరుతుంది. అందుకే ఈ లాంగ్రేజ్ పాయింట్స్ వద్ద ఉపగ్రహాలు అతి తక్కువ ఇంధన వినియోగంతో స్థిరంగా పరిభ్రమిస్తాయి.

సూర్యునికి భూమికి మధ్య అయిదు లాంగ్రేజ్ పాయింట్స్ ఉన్నాయి. వీటిలో ఎల్ 1 పాయింట్ నుంచి సూర్యుడిని నిరంతరాయంగా ఎటువంటి అడ్డంకులు(గ్రహణాలు/ఛాయలు) లేకుండా పరిశీలించవచ్చు. ఎల్ 4, ఎల్ 5 పాయింట్లు భూమికి సూర్యునికి మధ్యలో కాక వాటితో త్రిభుజ కోణాకృతితో ఉంటాయి. ఎల్ 2 పాయింట్ భూమికి వెనక, ఎల్ 3 పాయింట్ సూర్యుని వెనక ఉంటాయి. కాబట్టి సూర్యుడి నుంచి భూమి వైపుగా వచ్చే సౌర తుఫాన్‌లను అధ్యయనం చేయాలంటే ఈ రెంటి మధ్య గల ఎల్ 1 పాయింట్ మాత్రమే సరైన ఎంపిక. అందుకే సోలార్ అబ్జర్వేటరీని భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ 1 పాయింట్ ప్రాంతపు హాలో ఆర్బిట్‌లో దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టారు.

ఆదిత్య ఎల్ 1 ప్రయోగం

ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీని 2023 సెప్టెంబరు 2న శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్‌వీ-ఎక్స్‌ఎల్(సీ 57) రాకెట్ ద్వారా ప్రయోగించారు. 127 రోజుల ప్రయాణం తరవాత ఇది 2024 జనవరి 6న గమ్యస్థానాన్ని చేరింది. భూమి నుంచి 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుడిని పరిశీలించేందుకు, భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ 1 పా యింట్ వద్ద ఒక స్థిర దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఈ అబ్జర్వేటరీ పరిభ్రమిస్తూ ఉంటుంది. అంతేతప్ప ఈ అబ్జర్వేటరీ గానీ అందులోని పేలోడ్లు కానీ సూర్యుని పైకి/సమీపానికి వెళ్లవు. అంటే భూమికి సూర్యునికి మధ్య గల దూరంలో కేవలం ఒక శాతం దూరం వరకు మాత్రమే ఇది ప్రయాణిస్తుంది.

ఆదిత్య ఎల్ 1 విజయవంతంగా పూర్తిచేసిన దశలు

ఈ ప్రయోగంలో ఆదిత్య ఎల్ 1 మొత్తం మూడు దశలను పూర్తిచేసి నిర్దేశిత కక్ష్యను చేరింది.

తొలిదశ: ఎల్ 1 వైపు సుదీర్ఘ ప్రయాణం సాగించేందుకు కావాల్సిన వేగాన్ని(వెలాసిటీ) సంపాదించేందుకు 16 రోజులపాటు భూ నిమ్న కక్ష్య(లో ఎర్త్ ఆర్బిట్)లో దీర్ఘవృత్తాకారంలో తన పరిధిని ప్రతి ఆవృత్తానికీ క్రమంగా పెంచుకుంటూ భూమి చుట్టూ అయిదు పరిభ్రమణలు పూర్తిచేసింది. ఒక రాయికి తాడు చుట్టి తిప్పుతూ కావాల్సిన వేగం సాధించినట్లుగా దీనిని నిర్వహించారు. భూమి నుంచి ఎల్ 1కు నేరుగా చేరేందుకు పీఎస్ఎల్‌వీ-ఎక్స్‌ఎల్ సామర్థ్యం సరిపోదు కనుక అదనపు సామర్థ్యం కోసం ఇస్రో ఈ వ్యూహాన్ని అనుసరించింది.

రెండో దశ: ఎల్ 1 వైపు ప్రయాణించేందుకు కావాల్సిన వేగం సాధించిన తరవాత 'ఆన్ బోర్డ్ ప్రొపల్షన్'ను వినియోగించి శాస్త్రవేత్తలు దీనిని సంధించారు. ఈ క్రమంలో ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని దాటి ఎల్ 1 వైపు 110 రోజులు ప్రయాణించింది. దీనిని 'క్రూయిడ్ ఫేజ్' అంటారు.

మూడో దశ: ఉపగ్రహం ఎల్ 1 సమీపానికి చేరాక ఒక పరిభ్రమణం చేసి భూమి, సూర్యుల మధ్య ఎల్ 1 చుట్టూ సమాంతర(దీర్ఘవృత్తాకార) కక్ష్యను ఏర్పరచి అయిదేళ్లపాటు ఆ కక్ష్యలో పరిభ్రమిస్తూ సూర్యుడిని నిరంతరం పరిశీలిస్తూ ఉంటుంది.

ఆదిత్య ఎల్ 1లోని పరికరాలు-వాటి పరిశోధనలు

ఈ అబ్జర్వేటరీ ఉపగ్రహంలో దేశీయంగా తయారు చేసిన ఏడు పేలోడ్స్ ఉన్నాయి. వీటిలో అయిదింటిని ఇస్రో తయారుచేయగా రెంటిని ఇస్రో సహకారంతో దేశంలోని విద్యా సంస్థలు తయారు చేశాయి.

ఈ పేలోడ్లలో నాలుగు రిమోట్ సెన్సింగ్ తరహా పేలోడ్లను సూర్యుని వైపుగా కేంద్రీకరించి నిరంతరం సూర్యుడిని పరిశీలించేందుకు ఉద్దేశించారు. మూడు ఇన్ సిటూ తరహా పేలోడ్లు ఉపగ్రహం వెనక భాగంలో ఉండి ఎల్ 1 ప్రాంతంలో సౌర ప్రభావాలను(ఖగోళంలో సోలార్ డైనమిక్స్) అధ్యయనం చేస్తాయి.

ఆదిత్య ఎల్ 1 ప్రయోగ లక్ష్యాలు-ఉపయోగాలు

- సూర్యుని ఉపరితలంలో సంభవించే భారీ పేలుళ్లు, సౌర తుఫాన్‌ల తీరును అధ్యయనం చేసేందుకు వాటిని వెంటనే పసిగట్టి అంతరిక్ష శాటిలైట్లను, భూమి మీద ఉన్న సమాచార వ్యవస్థలను రక్షించేందుకు ఈ అబ్జర్వేటరీ ఉపగ్రహం సహకరిస్తుంది.
- సౌరకుటుంబంలో శక్తికి కేంద్రంగా గ్రహాలకు మూలాధారంగా ఉన్న సూర్యుని అధ్యయనం చేయడం ద్వారా విశ్వం, సౌర కుటుంబం పుట్టుక-అంతాల సమాచారాన్ని సేకరించవచ్చు.
- మనకు అతి దగ్గరగా ఉన్న సూర్యుని అధ్యయనం ద్వారా కేంద్రక సంలీన చర్యలను పరిశీలించి తద్వారా నేటి క్లీన్ ఎనర్జీ పరిశోధనల్లో మరింత పురోగతి సాధించవచ్చు.
- సౌర తుఫాన్‌లు, సౌర జ్వాలలు, అయస్కాంత క్షేత్రాలు, ఎనర్జిటిక్ అయాన్లు, కరోనల్ మాస్ ఎజెక్షన్స్, అత్యధిక ఉష్ణోగ్రతల ఆవిర్భావం, ప్రసరణ, సౌర వాతావరణంలోని వైవిధ్యాల సమాచారాన్ని నిర్దిష్టంగా తెలుసుకోవచ్చు.

పేలోడ్స్ వివరాలు

రిమోట్ సెన్సింగ్ పేలోడ్స్

విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్: ఇది సూర్యుని బాహ్య వాతావరణానికి చెందిన కరోనా ప్రాంతాన్ని అధ్యయనం చేస్తుంది. సూర్యుని ఉపరితలంలో సంభవించే భారీ పేలుళ్లు, సౌర తుఫాన్‌ల తీరును పరిశీలిస్తుంది.

సోలార్ అల్ట్రా వయొలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్: అతినీలలోహిత కాంతి ప్రాంతంలో ఫొటోస్పియర్, క్రోమో స్పియర్‌ల చిత్రాలను తీయడంతోపాటు సూర్యకిరణాలు/కాం తిపుంజాల్లోని వ్యత్యాసాలను పరిశీలిస్తుంది. దీనిని ఇస్రో సహకారంతో ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్(పుణె) అభివృద్ధి చేసింది.

సోలార్ లో ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హై ఎనర్జీ ఎల్ 1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్: ఈ రెండు పేలోడ్లు సూర్యుడి నుంచి ఉద్భవించే ఎక్స్‌రే జ్వాలలను అధ్యయనం చేస్తాయి. వీటిని ఇస్రోకు చెందిన యూఆర్.రావు శాటిలైట్ సెంటర్(బెంగళూరు) తయారు చేసింది.

ఇన్ సిటు పేలోడ్స్

ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య: ఈ పేలోడ్లు సోలార్ పవనాలను, ఎనర్జిటిక్ అయాన్లను ఖగోళంలో వాటి శక్తి వ్యాప్తిని అధ్యయనం చేస్తాయి. ఏఎస్‌పీఈఎక్స్‌ను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ సంస్థ, పీఏపీఏని తిరువనంతపురంలోని స్పేస్ ఫిజిక్స్ ల్యాబొ రేటరీ విక్రం సారాభాయి స్పేస్ సెంటర్ తయారు చేశాయి. ఈ రెండు సంస్థలు ఇస్రోకు చెందినవి.

మాగ్నటోమీటర్: ఎల్ 1 వద్దగల అంతర్‌గ్రహ అయస్కాంత క్షేత్రాలను కొలిచే సామర్థ్యం దీనికి ఉంది. దీనిని ఇస్రోకు చెందిన ల్యాబొరేటరీ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్(బెంగళూరు) అభివృద్ధి చేసింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

హైదరాబాద్ నార్మ్‌లో పీజీడీఎం

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)- 'పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 66 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం, క్యాట్/సీమ్యాట్ స్కోర్, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల డిగ్రీ(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/కమర్షియల్ అగ్రికల్చర్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/డెయిరీ సైన్స్/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరికల్చర్/వెటర్నరీ సైన్సెస్/హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకూ ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి.

- క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్‌కు 30 శాతం, స్కిల్ టెస్ట్ స్కోర్‌కు 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 10 శాతం, అనుభవానికి 5 శాతం, డైవర్సిటీ ఫాక్టర్‌కు 5 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in

ప్రతి ఏడాది తొలినాళ్లకు కాంతి తెచ్చే పండుగ సంక్రాంతి. రంగుల ముగ్గులు, బసవన్నలు, గాలిపటాలు, పందేలు.. ఇలా ఆనందాలు అంబరాన్నంటే అందమైన పండగ సంక్రాంతి. ఇకపోతే ఈ పొంగల్‌డేస్‌లో కాస్త ప్రత్యేకంగా వండుకోండిలా..

ఈ సారి పండక్కి ఈ వంటలు అదుర్స్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 15 జనవరి 2024



ముక్కల పులుసు

కావాల్సిన పదార్థాలు

బెండకాయ- 75 గ్రాములు, మంచి గుమ్మడికాయ- 150 గ్రాములు, సొరకాయ- 75 గ్రాములు, ములక్కాయ- 100 గ్రాములు, వంకాయలు- 75 గ్రాములు, చిలగడదుంప- 75 గ్రాములు, ఆలుగడ్డ- 75 గ్రాములు, క్యారెట్- 50 గ్రాములు, టమోటాలు- 50 గ్రాములు, ఉల్లిగడ్డ- 2 (మీడియం సైజ్), పచ్చిమిర్చి- 10, చింతపండు- 100 గ్రాములు, బెల్లం- 50 గ్రాములు, కరివేపాకు- 4 లేదా 5 రెబ్బలు, పోపు గింజలు- 6 టీస్పూన్లు, ఇంగువ- 2 టీస్పూన్లు, నూనె- 50 మి.లీ., నెయ్యి- 50 మి.లీ., కందిపప్పు- 75 గ్రాములు, మెంతిపిండి- ఒకటిన్నర టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, ఎండుమిర్చి- 4, కొత్తిమీర- 1 కట్ట, ఉప్పు- 4 టీస్పూన్లు, కారం- 2 టీస్పూన్లు, పసుపు- ఒకటిన్నర టీస్పూన్, వెల్లుల్లిపాయ- 1

తయారీ విధానం

కుక్కర్‌లో కందిపప్పు, టమాటాలు వేశాక కొద్దిగా పసుపు వేసి మెత్తగా ఉడికించాలి. పప్పుగుత్తితో మెదిపి, జావ లాగా చేసి పక్కనబెట్టుకోవాలి. చింతపండు నాన బెట్టి గుజ్జుతీసి కలిపి పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు పులుసు జారుగా ఉండటానికి అనువైన పెద్ద గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేసి పోపు గింజలన్నీ వేసి, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, దంచిన వెల్లుల్లి వేసి కుక్ చేయాలి. ఘుమఘుమలాడుతుండగా పెద్ద రెబ్బలుగా ఉల్లి పాయ పోపులో వేసి, ముప్పయ్ సెకన్లు వేయించి (బెండకాయ, వంకాయలను మినహాయించి మిగతా ముక్కలన్నింటినీ కొంచెం పెద్ద సైజ్ కటింగ్) పోపులో వేసి.. ఉప్పు, కారం, పసుపు వరుసగా వేసుకుంటూ కలుపుతూ మీడియం ఫ్లేమ్‌లో మూతపెట్టి ఇరవైఐదు నిముషాల పాటు మగ్గనివ్వాలి. ముక్కలు డెబ్బయ్ శాతం ఉడికినవి అని నిర్ధారించుకున్న తర్వాత బెండకాయలు, వంకాయలు, పచ్చిమిర్చి వేసి కలిపి మనం సిద్ధంగా ఉంచుకున్న పప్పు, చింతపండు నీళ్లకి గరిట జారుగా ఉండేట్లు నీళ్ల కలిపి ముక్కల్లో పోసి అన్నింటినీ కలిపి మూతపెట్టాలి. పదినిముషాల పాటు ఉడికిన తర్వాత కలియబెట్టి మెంతిపొడి, జీలకర్ర పొడి, సరిపడ ఉప్పు, సరిపడ కారం, బెల్లం, కొద్దిగా ఇంగువ, అల్లం తరుగు, కొత్తిమీర వేసి నిముషం పాటు మరగనిచ్చి పప్పుచారు జారులా ఉండగా స్టవ్‌ను కట్టేయాలి. ముక్కల పులుసు రెడీ.



కనుమపండగ ప్రత్యేకం

పాలకూర చికెన్ బిర్యానీ

కావాల్సిన పదార్థాలు

లేత పాలకూర- 10 కట్టలు, బిర్యానీ రైస్- 4 గ్లాసులు, చికెన్ బ్రెస్ట్‌పీసెస్- 10 (ప్రతిదీ వంద గ్రాములుండాలి), అల్లం-వెల్లుల్లి పేస్ట్- 3 టీస్పూన్లు, ఉల్లిపాయ-1 (పెద్దది), పచ్చిమిర్చి- 20, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా- 2 టీస్పూన్లు, పెరుగు- కప్పు, ఉప్పు- 3 టీస్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, భగారా ఆకు- 4, లవంగాలు-8, చెక్క-2, యాలకులు-4, షాజీరా- 1 టీస్పూన్, మిరియాలు-2 టీస్పూన్లు, మరాఠీ మొగ్గ- 2, అనాసపువ్వు-2, జాపత్రి-4

తయారీ విధానం

ముందుగా తగినంత ఉప్పు, పది పచ్చి విరపకాయల పేస్ట్, కొద్దిగా పసుపు, 2 టీస్పూన్లు అల్లం వెల్లుల్లి పేస్ట్, పెరుగు, ధనియాల పొడి, గరం మసాలాను పేస్ట్‌లా తయారు చేసి పది చికెన్ బ్రెస్ట్ పీస్‌లకు బాగా పట్టించి గంటపాటే నానబెట్టాలి. ఒక పెద్దగిన్నెలో మరిన్ని నీళ్లు తీసుకుని వేడిచేయాలి. నీళ్లు మరిగిన వెంటనే అందులో బిర్యానీ దినుసులన్నీ వేసి టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి తగినంత ఉప్పు వేసి, ఆ నీళ్లను మూడు నిముషాల పాటు మరగనివ్వాలి. అందులో కడిగి అరగంట పాటు నాని ఉన్న బాసుమతి రైస్‌ను పది మిర్చిల చీలికలను వేసి బియ్యం డెబ్బయ్‌శాతం ఉడికేలోపల పులుసు తగులుతుండగా వార్చేసి, పక్కకు పెట్టాలి. ఇప్పుడు కడాయ్‌లో నూనె, నెయ్యి వేసి ఉల్లిపాయలను వేసి వేయించి, తరిగి పెట్టుకున్న పాలకూర కూడా వేసి రెండు నిముషాల పాటు వేయించి కొద్దిగా ఉప్పు వేయాలి. నానబెట్టి ఉన్న చికెన్ ముక్కలను కడాయ్ అడుగున వరసగా పేర్చి వేడివేడి అన్నాన్ని ముక్కలపై పరిచి, ఆవిరి బయటకు రాని మూతపెట్టి మూతపై బరువు ఉంచి ముప్పయ్ నిముషాల పాటు సిమ్‌లో బిర్యానీ ఉడకనివ్వాలి. కింద నుండి సన్నని సెగ పైనుండే రైస్ బరువుతో చికెన్ ఉడికిపోతుంది. మిగతా నెయ్యి కూడా పైనుంచి వేసి కొత్తిమీర చల్లి దించేయవచ్చు. అద్భుతమైన హైప్రొటీన్ డైట్ చికెన్ బిర్యానీ సిద్ధం.

ఓట్స్ పాయసం

కావాల్సిన పదార్థాలు

పుచ్చ గింజలు- 3 టీస్పూన్, గుమ్మడి గింజలు- 3 టీస్పూన్లు, జీడిపప్పు- 30 గ్రాములు, కిస్‌మిస్- 30 గ్రాములు, రోల్డ్ ఓట్స్- 200 గ్రాములు, సారపప్పు- 2 టీస్పూన్లు, పిస్తాపప్పు- 2 టీస్పూన్లు, ఎండు కొబ్బరి- సగం చెక్క, బియ్యం- 2 టీస్పూన్లు, పాలు- 2 లీటర్లు, నీళ్లు- అరలీటరు

తయారీ విధానం



ముందుగా పుచ్చగింజలు, గుమ్మడి గింజలు, సగం జీడిపప్పు, పిస్తాపప్పును అరటీస్పూన్ నేతిలో దోరగా వేయించి బరకగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. రెండు టేబుల్ స్పూన్ల బియ్యం కడిగి నానబెట్టుకోవాలి. మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఓట్స్‌ను కడిగి పది నిముషాలు నానబెట్టాలి. మిగతా నెయ్యిలో వి ఎగిలిన జీడిపప్పు, కిస్‌మిస్, సారపప్పు, సన్నని ఎండుకొబ్బరి ముక్కలు వేయించి మిశ్రమాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి.

ఒక పెద్ద గిన్నెలో పాలు , అరలీటరు నీళ్లు పోసి స్టవ్ మీద ఉంచి పొంగురాగానే సిమ్‌లో ఉంచి అందులో ముందుగా పేస్ట్ చేసిన బియ్యం, గ్రైండ్ చేసిన గింజల పొడి వేసి రెండు నిముషాల పాటు ఉడకనివ్వాలి. అటుపై నానిన రోల్డ్ ఓట్స్‌ను వేసి కలుపుతూ మూడు నిముషాల పాటు ఉడకనివ్వాలి. గరిటె జారుగా వస్తోంటే.. ఈ పాయసంలో డ్రై చేసి పెట్టుకున్న డ్రై నట్స్ వి శ్రమం, యాలకుల పొడి, చక్కెర వేసి కలిపిన తర్వాత దించేయాలి. ఇది వేడిగా కాకుండా చల్లారాక తింటే బావుంటుంది.



శైలజ
సైలాస్ కిచెన్,
యూట్యూబ్ ఛానల్
asksailaw@gmail.com



యూట్యూబర్స్‌లో ఈమె తీరే వేరు. కంటెంట్ క్రియేటరే కాదు.. సింగర్, క్యాంపెయినర్, యాక్టర్. పేరు.. ప్రజక్త కోలి. 'మోస్ట్‌లీశాన్' పేరుతో ఆమె నడిపే యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య ఏడు మిలియన్లు. దేశంలోనే గొప్ప ఇన్‌ఫ్లూయన్సర్‌గా పేరుగాంచిన ప్రజక్త కోలిని క్లైమేట్ సమ్మిట్‌కు ఆహ్వానించారు. ఈ క్రేజీ యూట్యూబ్‌స్టార్ మనోగతం మీకోసం.

దమ్మున్న కంటెంట్..
దుమ్మురేపే యూట్యూబర్!

"నాకు ఇన్‌ఫ్లూయన్సర్ అంటే ఇష్టం ఉండదు. కంటెంట్ క్రియేటర్ అనటంలోనే కిక్ ఉంటుంద"ంటుంది ఈ యూట్యూబర్. ఆమె వయసు ముప్ఫయేళ్లు. క్రికెట్ స్టేడియంలో విధ్వంసకరమైన ఆటగాడు ఆడినట్లు.. కెమెరా ముందు పర్ఫెక్ట్‌గా మాట్లాడగలదు. సునిశితమైన హాస్యం, అప్‌డేటెడ్ రెట్రో జోక్స్, పేరడీలు, పాత్రల్లో జీవించటం.. ఇలా ఈమెకు కెమెరాతో పెట్టిన విద్య. అందుకే ప్రజక్త దేశంలోనే పేరున్న యూట్యూబర్స్‌లో ఒక్కరయ్యారు.

అలా కెమెరా ముందుకు..



'స్కూల్‌డేస్‌లో స్టేజ్‌మీద నటించే దాన్ని. నేర్చుకునేతత్వం నాలో మెండు. పదమూడేళ్ల కిందటే ఓ మరాఠీ చిత్రంలో నటించి రెండువందల రూపాయల చెక్ అందుకున్నా. రేడియో జాకీ అవ్వాలని కలలు కనేదాన్ని. పదకొండేళ్ల వయసులోనే ఆర్జే అవకాశం వచ్చింది. అయితే రేటింగ్స్ లేకపోవటం వల్ల షో ఆగిపోయింది. ఇలా అయ్యిందేనని.. బాధపడుతున్న సమయంలో లహరి అనే కంటెంట్ క్రియేటర్ 'యూట్యూబ్‌లో ప్రయత్నించు' అని సలహా ఇచ్చింది. నాన్న దగ్గర కెమెరా తీసుకుని, ట్రైపాడ్ కొనుక్కొని మొదట ఇంట్లోనే వీడియోలు తీశా. ఛానెల్ పేరు 'మోస్ట్‌లీశాన్'. అసలు వీడియోలు ఎలా తీయాలో తెలీదు.. ఎలా ఎడిటింగ్ చేయాలో తెలీదు. కేవలం ఐదు నిముషాల వీడియో కోసం కొన్ని గంటల పాటు పిచ్చిగా పని చేసేదాన్ని. డైరక్షన్, యాక్టింగ్ రెండూ నావే.

అలా పాపులర్ యూట్యూబర్..


రొడ్డకొట్టుడులా కాకుండా.. పదేళ్ల కిందటే మంచి కంటెంట్ క్రియేట్ చేసేది. ట్రావెల్ వ్లాగ్స్, పేరడీలు, సమాజంలో చూసిన విషయాలపై కామెడీషోలు చేసేది. దమ్మున్న కంటెంట్ ఉండటంతో.. 2015 సంవత్సరంలో లైమ్‌లైట్‌లోకి వచ్చిందీమె. 2017లో బాడీషేమింగ్ మీద 'షేమ్‌లెస్' అనే ర్యాప్ సాంగ్ చేసింది. ఆ తర్వాత పేరున్న యంగ్ తరంగ్స్‌తో బాడీ షేమింగ్ మీద కొన్ని కొలాబరేషన్స్ చేసింది. 2019 సెప్టెంబర్‌లో డెలిగేట్‌గా 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ టోలరెన్స్' కార్యక్రమంకోసం ఏకంగా అమెరికా వెళ్లింది. అలాగే బాలీవుడ్‌లో అజయ్ దేవగణ్, హృతిక్ రోషన్, ఆయుష్మాన్ ఖురానా.. ఇలా ప్రముఖ స్టార్స్‌తో ఇంటర్వ్యూలు చేసే స్థాయికి ఎదిగింది. 2021లో యూత్ క్లైమేట్ సమ్మిట్ కోసం అమెరికా ఆహ్వానించింది. గూగుల్ సంస్థ నిర్వహించిన ఇంపాక్ట్ ఛాలెంజ్ ఫర్ ఉమన్ అండ్ గర్ల్స్ కార్యక్రమం కోసం అంతర్జాతీయ మహిళలను ఇంటర్వ్యూ చేసింది. బరాక్ ఒబామా భార్య మిచెల్లే, బిల్‌గేట్స్ లాంటి ప్రముఖులు మెచ్చిన 'ప్రజక్త కోలి' యూట్యూబర్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.

బాలీవుడ్ కలలు..

ఆ తర్వాత బిగ్‌స్క్రీన్‌మీద కూడా కనపడాలనుకుంది. ముంబైలో ఉండటం.. బాలీవుడ్ సెలబ్రిటీలతో పరిచయం.. ఇంట్లో వారి సహకారం కలిసొచ్చాయి. దీంతోపాటు నటిగా కూడా ప్రతిభ ఉండటంతో 'జగ్‌జగ్ జియో' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అనిల్ కపూర్, నీతా కపూర్, వరుణ్ ధావన్.. నటించారీ చిత్రంలో. 'ప్రస్తుతం ఓ రొమాంటిక్ నావెల్ రాస్తున్నా. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కూ ఓకే అయ్యింది. నటనతో పాటు దర్శకత్వం చేయటమూ వచ్చు. ఏదేమైనా ఒక యూట్యూబర్‌గా మొదలెట్టి.. బాలీవుడ్ వరకూ రావటం ఓ అద్భుతమే. అందరికీ బాలీవుడ్ అంటే కల.. అయితే త్వరలోనే మంచి నటిగా కనిపిస్తా' అంటుంది ప్రజక్త కోలి. బాలీవుడ్‌లో నటించినా.. కంటెంట్ క్రియేటర్ జీవితం మర్చిపోను. ఈ ప్రవాహం ఆగదంటుందీమె.

సాత్విక్ జోడీకి రన్నరప్ ట్రోఫీ

చైనా జంటదే మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: కెరీర్‌లో రెండో సూపర్ 1000 టైటిల్‌తో రికార్డు సృష్టిద్దామనుకున్న భారత బ్యాడ్మింటన్ సూపర్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఆశలు ఫలించలేదు. మలేసియా ఓపెన్‌లో టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సాత్విక్-చిరాగ్ జోడీ తుది మెట్టుపై బోల్తా పడింది. అయితే, ప్రపంచ టాప్ ర్యాంకరైన ప్రత్యర్థి జంటకు చివరిదాకా గట్టి పోటీ ఇచ్చి వెనుదిరిగింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రెండోసీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-9, 18-21, 17-21తో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ జోడీ లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ చేతిలో పోరాడి ఓడింది. ఈ చైనా జోడీతో ఇప్పటిదాకా ఐదుసార్లు తలపడ్డ సాత్విక్ జంటకు ఇది నాలుగో ఓటమి. ఒకే ఒక్కసారి నిరుడు కొరియా ఓపెన్‌లో సాత్విక్ ద్వయం గెలిచింది.

క్రికెట్‌కు షాన్ మార్ష్ వీడ్కోలు



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెటర్ షాన్ మార్ష్ ప్రొఫెషనల్ క్రికెట్‌కు ఆదివారం గుడ్‌బై చెప్పాడు. బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 40 ఏళ్ల మార్ష్..బుధవారం సిడ్నీ థండర్‌తో జరిగే మ్యాచే తన కెరీర్‌లో చివరిదని ప్రకటించాడు. మూడు ఫార్మాట్లలో ఆసీస్‌కు ఆడిన అతడు 13 సెంచరీలతో 5,200లకుపైగా పరుగులు చేశాడు. అయితే 2019 నుంచి టెస్టులు, వన్డేలు, 2016 నుంచి టీ20లకు మార్ష్ ఆస్ట్రేలియా జట్టుకు ఎంపిక కాలేదు.

న్యూజిలాండ్‌దే రెండో టీ20

హామిల్టన్: పాకిస్థాన్‌తో ఆదివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ 21 పరుగులతో నెగ్గింది. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 194/8 స్కోరు చేసింది. ఫిన్ అలెన్ (74) హాఫ్ సెంచరీతో కదం తొక్కాడు. రౌఫ్ 3, అబ్బాస్ అఫ్రీది 2 వికెట్లు తీశారు. ఛేదనలో పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. బాబర్ (66), ఫఖర్ జమాన్ (50) అర్ధ శతకాలతో మెరిశారు. మిల్నే 4, బెన్ సియర్స్, సోధి, సౌథీ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

కుర్రాళ్లు కుమ్మేశారు

అదరగొట్టిన జైస్వాల్, దూబే


శివమ్ దూబే (63 నాటౌట్)

రెండో టీ20లో భారత్ విజయం

అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్ కైవసం


యశస్వి జైస్వాల్ (68)

ఇండోర్: యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సలతో 68), శివమ్ దూబే (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సలతో 63 నాటౌట్) దుమ్మురేపే అర్ధ శతకాలతో.. అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా 6 వికెట్లతో అఫ్ఘాన్‌ను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ 20 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. గుల్బదిన్ నైబ్ (57) పోరాటం వృథా అయింది. అర్ష్‌దీప్ 3 వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో భారత్ 15.4 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసి గెలిచింది. కోహ్లీ (16 బంతుల్లో 29) వేగంగా ఆడాడు. కరీమ్ 2 వికెట్లు పడగొట్టాడు. అక్షర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

రోహిత్ విఫలం: ఛేదనలో జైస్వాల్, దూబే మూడో వికెట్‌కు 42 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో టీమిండియా అలవోకగా నెగ్గింది. రోహిత్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. కానీ, జైస్వాల్, కోహ్లీ రెండో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఏడాది తర్వాత టీ20ల్లోకి వచ్చిన విరాట్.. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడితో అలరించారు. కోహ్లీ రెండు ఫోర్లతో జోరు చూపగా.. ఫరూఖీ బౌలింగ్‌లో జైస్వాల్ రెండు సిక్సలు బాదాడు. ముజీబుర్ వేసిన 5వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడిన యశస్వి 19 పరుగులు రాబట్టాడు. అయితే, నవీనుల్ బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుట్ కావడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 69/2తో నిలిచింది. ఈ దశలో జైస్వాల్‌కు జత కలిసిన దూబే ఎడాపెడా షాట్లతో పరుగుల వరద పారించాడు. 10వ ఓవర్‌లో నబీ బౌలింగ్‌లో జైస్వాల్ సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. దూబే హ్యాట్రిక్ సిక్సలతో 21 పరుగులు పిండుకొన్నాడు. అయితే, గెలుపునకు 19 పరుగులు కావాల్సి ఉండగా.. జైస్వాల్, జితేష్ (0)ను కరీమ్ అవుట్ చేశాడు. కానీ, దూబే, రింకూ (9 నాటౌట్) మరో 26 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు.

గుల్బదిన్ ఎదురుదాడి: గుల్బదిన్‌తోపాటు లోయరార్డర్ బ్యాటర్లు చెలరేగడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ పోరాడగలిగే స్కోరు చేసింది. గుర్బాజ్ (14)ను బిష్ణోయ్ స్వల్ప స్కోరుకే అవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన గుల్బదిన్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ ఇబ్రహీం (8)తో కలసి రెండో వికెట్‌కు 33 పరుగులు జోడించిన నైబ్.. నబీ (14)తో 4వ వికెట్‌కు 31 రన్స్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నాడు. కానీ, నైబ్‌ను బోల్తా కొట్టించిన అక్షర్.. జట్టుకు కీలక బ్రేక్ అందించాడు. డెత్‌ఓవర్లలో నజీబుల్లా (23), కరీమ్ (20), ముజీబుర్ (21) బ్యాట్‌లు ఝుళిపించడంతో అఫ్ఘాన్ 170 మార్క్ దాటింది.

1 టీ20ల్లో భారత్‌పై అఫ్ఘాన్‌కిదే అత్యధిక స్కోరు.

టీ20 ఫార్మాట్‌లో 150 మ్యాచ్‌లు (పురుషుల క్రికెట్‌లో) ఆడిన తొలి క్రికెటర్‌గా రోహిత్. మహిళల్లో 161 మ్యాచ్‌లతో హర్మన్‌ప్రీత్ కౌర్‌ది అగ్రస్థానం.

స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) దూబే (బి) బిష్ణోయ్ 14, ఇబ్రహీం (బి) అక్షర్ 8, గుల్బదిన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 57, ఒమర్జాయ్ (బి) దూబే 2, నబీ (సి) అర్ష్‌దీప్ (బి) బిష్ణోయ్ 14, నజీబుల్లా (బి) అర్ష్‌దీప్ 23, కరీమ్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 20, ముజీబుర్ (రనౌట్/అర్ష్‌దీప్) 21, నూర్ (సి) కోహ్లీ (బి) అర్ష్‌దీప్ 1, నవీనుల్ (నాటౌట్) 1, ఫరూఖీ (రనౌట్/జైస్వాల్) 0; ఎక్స్‌ట్రాలు: 11; **మొత్తం: 20 ఓవర్లలో 172 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-20, 2-53, 3-60, 4-91, 5-104, 6-134, 7-164, 8-170, 9-171; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-32-3, ముకేష్ 2-0-21-0, బిష్ణోయ్ 4-0-39-2, అక్షర్ 4-0-17-2, దూబే 3-0-36-1, సుందర్ 3-0-23-0.

భారత్: జైస్వాల్ (సి) గుర్బాజ్ (బి) కరీమ్ 68, రోహిత్ (బి) ఫరూఖీ 0, కోహ్లీ (సి) ఇబ్రహీం (బి) నవీనుల్ 29, దూబే (నాటౌట్) 63, జితేష్ (సి) నబీ (బి) కరీమ్ 0, రింకూ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు: 4; **మొత్తం: 15.4 ఓవర్లలో 173/4; వికెట్ల పతనం:** 1-5, 2-62, 3-154, 4-156; **బౌలింగ్:** ఫరూఖీ 3.4-0-28-1, ముజీబుర్ 2-0-32-0, నవీనుల్ 3-0-33-1, నూర్ 3-0-35-0, నబీ 2-0-30-0, కరీమ్ 2-0-13-2.

11 ఓవరాల్‌గా టీ20ల్లో 200 వికెట్ల క్లబ్‌లో చేరిన అక్షర్.. ఈ ఘనత సాధించిన 11వ భారత బౌలర్‌గా నిలిచాడు.


అక్షర్ పటేల్ (2/17)

కష్టాల్లో ఆంధ్ర

ముంబైతో రంజీ

ముంబై: బ్యాటర్ల వైఫల్యంతో.. గ్రూప్-బిలో ముంబైతో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. షామ్స్ ములానీ (6/65, 3/63) తిప్పేయడంతో ఫాలో ఆన్‌లో పడిన ఆంధ్ర.. రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆట ముగిసేసరికి 164/5 స్కోరు చేసింది. రషీద్ (52), నితీష్ కుమార్ (22) క్రీజులో ఉన్నారు. విహారి (46)ని దయాస్, రికీ భుయ్ (28)ను ములానీ పెవిలియన్ చేర్చారు. ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరు 395కు ఆంధ్ర ఇంకా 47 పరుగులు వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 98/3తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 184 పరుగులకే కుప్పకూలింది. ప్రశాంత్ కుమార్ (73), గిరినాథ్ (34 నాటౌట్), కెప్టెన్ రికీ భుయ్ (20) కాసేపు బౌలర్లను ప్రతిఘటించారు.

ఆట మారె..విజయం దక్కె!

న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు

మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్



రాంచీ: ఒలింపిక్ క్వాలిఫయర్స్ తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన మన హాకీ అమ్మాయిలు..రెండో పోరులో జూలు విదిల్చారు. ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 3-1తో న్యూజిలాండ్‌ను మనోళ్లు చిత్తు చేశారు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలను సజీవంగా ఉంచుకున్నారు. సంగీత కుమారి (ఒకటో నిమిషం), నేహ (12వ), డుంగ్ డుంగ్ బ్యూటీ (14వ) భారత్‌కు గోల్స్ అందించారు. హల్ మేగన్ (9వ) కివీస్ తరఫున ఏకైక గోల్ సాధించింది. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో ఇటలీతో భారత్ తలపడుతుంది. మరో మ్యాచ్‌లో అమెరికా 2-0తో ఇటలీపై గెలిచింది.

చెమటోడ్చిన జొకో

- రెండోరౌండ్‌కు నొవాక్
- సబలెంకా, వోజ్నియాకి ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: క్రొయేషియాకు చెందిన 18 ఏళ్ల డినో ప్రిజ్మిక్ డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో ముచ్చెమటలు పట్టించాడు. 2005లో నొవాక్ గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసిన సమయంలో ఇంకా పుట్టని డినో..దిగ్గజ ఆటగాడైన ప్రత్యర్థిని మూడు చెరువుల నీళ్లు తాగించాడు. అయితే తన అనుభవాన్నంతా రంగరించిన 36 ఏళ్ల జొకో ఆదివారం జరిగిన సింగిల్స్ తొలిరౌండ్లో 6-2, 6-7 (5), 6-3, 6-4 స్కోరుతో ప్రిజ్మిక్‌పై నెగ్గి ఊపిరి పీల్చుకున్నాడు. మిగతా ఆటగాళ్లలో ఐదో సీడ్ రుబ్లేవ్ ఐదు సెట్లు పోరాడి 7-5 6-4, 3-6, 4-6, 7-6 (6) థియాగో సెబోత్‌పై గెలిచాడు. నాలుగో సీడ్ జానిక్ సిన్నర్ 6-4, 7-5, 6-3తో బోటిక్‌ని, 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 4-6, 6-3, 3-6, 6-2, 6-4తో ఫకుండో డియాజ్‌ని, మునార్ 6-3, 6-3, 6-1తో షెవచంకోని ఓడించి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో డిఫెండింగ్ చాంప్ సబలెంకా 6-0, 6-1తో సీడిల్‌పై, 8వ సీడ్ సకారి 6-4, 6-1తో హిబినోపై, 9వ సీడ్ క్రెజికోవా 2-6, 6-4, 6-2తో హొంటామాపై నెగ్గారు. తల్లయ్యాక తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడుతున్న 2018 విజేత వోజ్నియాకి 6-2, 2-0తో 20వ సీడ్ మగ్దలినాపై నెగ్గి రెండో రౌండ్ చేరింది. గాయంతో మగ్దలినా రెండో సెట్‌నుంచి వైదొలగింది. అమండా 6-3, 6-4తో 13వ సీడ్ లుడ్మిలాకు షాకిచ్చింది.

18 నుంచి ఉప్పల్ టెస్టు టిక్కెట్ల అమ్మకం

హైదరాబాద్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 25న ఉప్పల్ స్టేడియంలో మొదలయ్యే తొలి టెస్టు మ్యాచ్‌కు టిక్కెట్ల అమ్మకం ఈనెల 18 నుంచి జరగనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ఆదివారం ప్రకటించారు. 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా పేటీఎం ఇన్‌సైడర్ యాప్‌లో, మిగిలిన టిక్కెట్లను 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌తో పాటు జింఖానాలోని హెచ్‌సీఏ స్టేడియంలో ఆఫ్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచనున్నారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఉప్పల్‌లో జరగనుంది.

సాయుధ దళాల సిబ్బందికి ఉచిత ప్రవేశం..: రిపబ్లిక్ డే (26వ తేదీ)ను పురస్కరించుకొని ఆరోజు తెలంగాణలో పనిచేస్తున్న భారత సాయుధ దళాల (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) సిబ్బంది, వారి కుటుంబాలతో కలిసి ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తున్నట్టు హెచ్‌సీఏ తెలిపింది. ఆసక్తిగల వారు తమ విభాగాధిపతితో సంతకం చేయించిన లేఖ, కుటుంబసభ్యుల వివరాలను ఈనెల 18లోపు హెచ్‌సీఏ సీఈవోకి ఈ-మెయిల్ చేయాలి. కాగా, పాఠశాల విద్యార్థులకు రోజుకు ఐదువేలు చొప్పున మొత్తం ఐదురోజులకు గాను 25వేల కాంప్లిమెంటరీ పాసులు కేటాయించినట్టు హెచ్‌సీఏ తెలిపింది.

ఇవీ ధరలు

టెస్టు మ్యాచ్‌కు ప్రారంభ ధర కనిష్ఠంగా రూ. 200 కాగా, గరిష్ఠంగా రూ. 4వేలుగా నిర్ణయించారు. స్టాండ్‌ల వారీగా టిక్కెట్ల ధరలు రూ. 200, రూ. 499, రూ. 750, రూ. 1250.. కార్పొరేట్ బాక్స్‌ల టిక్కెట్ల ధరలు రూ. 3వేలు, రూ. 4వేలుగా ఉన్నాయి. రోజువారీ గాకుండా, ఐదురోజుల సీజన్ టిక్కెట్ల ధరలు రూ. 1500, రూ. 2250, రూ. 3750 కాగా.. కార్పొరేట్ బాక్స్‌ల ధరలు రూ. 12వేలు, రూ. 16వేలు.

సెంట్రల్ బ్యాంక్ ఫెస్టివల్ ఆఫర్

మార్చి 31వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: రిటైల్ రుణాలకు డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఫెస్టివల్ ఆఫర్‌ను మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఫెస్టివల్ ఆఫర్ కింద వివిధ రుణాలపై కస్టమర్లకు తక్కువ వడ్డీరేటు, ప్రాసెసింగ్ ఫీజు ఎత్తివేత, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్టు బ్యాంకు జనరల్ మేనేజర్ వివేక్ కుమార్ ప్రకటించారు. సెంట్ గృహలక్ష్మి, సెంట్ బిజినెస్ స్కీమ్‌ల కింద 8.35 శాతం నుంచి ప్రారంభించి తక్కువ వడ్డీకే రుణాలందిస్తున్నట్టు తెలిపారు.

లుపిన్ ఔషధానికి ఎఫ్‌డీఏ అనుమతి

న్యూఢిల్లీ: లుపిన్ కంపెనీ తయారుచేసే రక్తపోటుకు వాడే జనరిక్ ఔషధం ప్రొప్రానొలాల్ హైడ్రోక్లోరైడ్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ కాప్సూల్స్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ అనుమతి లభించింది. ఈ ఔషధాన్ని పిథంపూర్ ప్లాంట్‌లో వివిధ పరిమాణాల్లో తయారుచేస్తారు.

బీ న్యూలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్: ఎలక్ట్రానిక్ రిటైలింగ్‌లోని బీ న్యూ సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రతీ స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.9999 క్యాష్‌బాక్‌తో పాటు రూ.7999 వరకు కచ్చితమైన బహుమతి అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ వై బాలాజీ తెలిపారు. అలాగే బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసిన కొనుగోళ్లకు రూ.9000 క్యాష్‌బాక్, రూ.3000 వరకు ఆర్‌బీఎల్ రివార్డ్ పాయింట్లు, ఎస్‌బీఐ కార్డుపై కొనుగోళ్లకు రూ.5000 వరకు క్యాష్‌బాక్ అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపిక చేసిన టీవీ, ల్యాప్‌టాప్‌లపై రూ.17,999 విలువ గల 120డబ్ల్యూ సౌండ్‌బార్ ఉచితంగా అందిస్తున్నామని, బ్రాండెడ్ యాక్సెసరీలపై 80 శాతం రాయితీ ఇస్తున్నామని వెల్లడించారు. బీన్యూ యాపిల్ డేస్ కింద జనవరి 13 నుంచి 18 వరకు కస్టమర్లకు ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరకే ప్రైస్ గ్యారంటీ ఇస్తున్నామన్నారు.

వినియోగం పెంచడం పైనే గురి

ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్



న్యూఢిల్లీ: వచ్చే నెల ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోతున్న మధ్యంతర బడ్జెట్లో వినియోగ డిమాండు పెంపునకే పెద్ద పీట వేయవచ్చు. అలాగే ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీరసించిన వ్యవసాయ రంగానికి చేయూత ఇచ్చే చర్యలు కూడా ప్రకటించే ఆస్కారం ఉంది. ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1వ తేదీన మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నారు. ఆమెకి ఇది వరుసగా ఆరో బడ్జెట్. పేరుకి ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ వినియోగ, వ్యవసాయ రంగాల ఉత్తేజానికి కొన్ని కీలక చర్యలు ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. సాధారణంగా మధ్యంతర బడ్జెట్ అంటే లోక్‌సభ ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్ర ప్రభుత్వ దైనందిక ఖర్చులకు అవసరమైన కేటాయింపులు మాత్రమే ఉంటాయి. అయితే కొన్ని అత్యవసర సమస్యల పరిష్కారానికి ఆర్థికమంత్రి మధ్యంతర బడ్జెట్‌లో చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

వ్యవసాయ రంగం

ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతంపైనే ఉన్నా, వ్యవసాయ వృద్ధిరేటు మాత్రం 1.8 శాతం మించదని సర్వేలు తెలుపుతున్నాయి. వర్షాభావంతో ఖరీఫ్ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటడంతో రబీ సీజన్ కూడా అంత ఆశాజనకంగా కనిపించడంలేదు. దీంతో వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థికమంత్రి సీతారామన్ వ్యవసాయ రంగానికి ప్రత్యేక కేటాయింపులు జరిపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వినియోగ డిమాండ్ అంతంతే

గత ఆర్థిక సంవత్సరం దేశంలో వినియోగ వస్తువుల ఉత్పత్తి 5.3 శాతం పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో అది 0.6 శాతానికి పడిపోయింది. ధరల సెగతో వినియోగం తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ప్రభావంతో ప్రజల ఆదాయాలకు కూడా గండి పడింది. ఏది కొనాలన్నా ఒకటికి నాలుగు సార్లు ఆలోచించాల్సి వస్తోంది. దీంతో వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచడంతో పాటు, పట్టణ పేదల కోసం కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వీటికి తోడు మధ్య తరగతి వేతన జీవుల చేతుల్లో మిగులు నిధులు పెంచేందుకు కూడా ఆర్థిక మంత్రి ప్రస్తుత పన్ను శ్లాబుల్ని మరింత కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఫార్మాని ఆదుకోండి

వం ్రలో వై పు

ఫార్మా రంగం కూడా తన బడ్జెట్ కోరికల చిట్టా విప్పింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను మరింత ప్రోత్సహించడంతో పాటు, 2047 నాటికి 40,000 నుంచి 45,000 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేందుకు అవసరమైన దీర్ఘకాలిక విధానాలు మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించాలని కోరింది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకోసం ప్రత్యక్ష-పరోక్ష పన్నుల రాయితీలతో పాటు, సులభతర వ్యాపార విధానం ప్రకటించాలని కోరారు.

22300 పైన బుల్లిష్

(జనవరి 15-19 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ అనాలసిస్

గత వారం నిఫ్టీ : 21894 (+183)

నిఫ్టీ గత వారం 21928-21449 పాయింట్ల మధ్యన కదలాడి 183 పాయింట్ల లాభంతో 21894 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21269, 20591, 19819, 19353 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 22300 బ్రేక్‌డౌన్ స్థాయి : 21500

నిరోధ స్థాయిలు : 22100, 22200, 22300 (22000 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 21700, 21600, 21500 (21800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ		విజయవాడ	550
హైదరాబాద్	540	విశాఖపట్నం	599
15 జనవరి		వరంగల్	542
చిత్తూరు	563	డజను గుడ్లు రూ.72	
గోదావరి	550		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	106
వరంగల్	107	విజయవాడ	106
కరీంనగర్	107	గుంటూరు	107
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	107
కర్నూలు	107	చిత్తూరు	108
విశాఖపట్నం	101		

22,000 వద్ద ప్రధాన అడ్డంకి!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు అంచనాలను మించి రాణిస్తున్నాయి. కరెక్షన్ ఏర్పడుతుందని ఎప్పటికప్పుడు అనుకుంటున్నా సూచీలు జీవిత కాల గరిష్ఠాలకు చేరుతున్నాయి. ఈ వారంలోనూ అదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది. అయితే నిఫ్టీకి 22,000 వద్ద ప్రధాన అడ్డంకి ఉంది. దీన్ని బ్రేక్ చేస్తే 22,440-22,500 స్థాయికి చేరవచ్చు. ఒకవేళ పరిస్థితులు అనుకూలించకపోయినా 21,800 వద్ద కీలక మద్దతు కనిపిస్తోంది. అది కూడా బ్రేక్ చేస్తే నిఫ్టీ 50 మరింత పతనమై 21,650-21,500 స్థాయిలను తాకే అవకాశం ఉంది. అయితే ఇదంతా అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణం, కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. లేదా కొన్నాళ్ల పాటు ప్రస్తుత స్థాయిలోనే స్తబ్దుగా కొనసాగవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్స్

మహానగర్ గ్యాస్: ప్రస్తుతం ఈ కౌంటర్ కన్సాలిడేషన్ దశలో ఉంది. జెఫరీస్ రేటింగ్ తర్వాత డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ భారీగా పెరిగాయి. గత వారం ఎన్ఎస్ఈలో మహానగర్ గ్యాస్ కంపెనీ షేర్లు రూ.1,264.20 వద్ద ముగిశాయి. రూ.1,320/1,400 టార్గెట్‌తో రూ.1,250 శ్రేణిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,210ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అలెంబిక్ ఫార్మా: రూ.700-800 మధ్య ఈ కౌంటర్లో చక్కని బేస్ ఏర్పడింది. చివరి రెండు సెషన్స్‌లోనే ఈ కంపెనీ షేర్లు 11 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఈలో శుక్రవారం అలెంబిక్ ఫార్మా కంపెనీ షేర్లు రూ.880.55 వద్ద ముగిశాయి. రూ.1,050 టార్గెట్‌తో రూ.850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.815ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ: కొన్నేళ్ల పాటు రూ.20-30 మధ్య ట్రేడైన ఐఆర్ఎఫ్‌సీ కౌంటర్లో గత ఏడాది ఆగస్టు నుంచి అప్‌ట్రెండ్ ప్రారంభమైంది. నెల రోజుల్లోనే రూ.90కు చేరుకుంది. మళ్లీ కరెక్షన్‌కు లోనై రూ.80 వద్ద కన్సాలిడేట్ అయింది. శుక్రవారం రూ.114 వద్ద ముగిసింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ కూడా పెరిగాయి. రూ.125/155 లక్ష్యంతో రూ.100/110 వద్ద మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.92ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీటీకే ప్రెస్టిజ్ : ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేషన్‌లో ఉన్నాయి. కొత్త ఏడాది ప్రారంభం నుంచి మూమెంటమ్ పుంజుకుంది. శుక్రవారం రూ.769 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.825-880 టార్గెట్‌తో మదుపరులు రూ.740-760 మధ్య పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.725ను గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్ట్ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

ప్రధాన నిరోధం 22000


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన రియాక్షన్‌లో ప్రారంభమైనా ప్రధాన నిరోధం 21500 కన్నా పైన రికవరీ సాధించి మరింత పురోగమించింది. చివరి రెండు రోజుల్లో మరింత బలమైన రికవరీతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 21830ని కూడా ఛేదించి చివరికి 21900 సమీపంలో ముగిసింది. ప్రధాన ట్రెండ్ సానుకూలంగానే ఉన్నా కీలక మానసిక అవధి 22000కు సమీపంలో నిలిచి ఉండడం గమనించాల్సిన అంశం. నిఫ్టీ గత 12 వారాల్లో అప్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ 2300 పాయింట్ల వరకు లాభపడింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాల మద్దతుతో గత వారం రికార్డు స్థాయిలకు దూసుకుపోయినా ద్రవ్యోల్బణం ఆశించిన స్థాయి కన్నా పైనే ఉండడంపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ఇప్పుడు మానసిక అవధి 22000 వద్ద పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరింత పై శిఖరాలకు నూతన గరిష్ఠ స్థాయిలకు పరుగులు తీస్తుంది.

బేరిష్ స్థాయిలు : 22000 వద్ద విఫలమైతే స్వల్ప అప్రమత్తతను సూచిస్తుంది. రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 21800 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 21500.

బ్యాంక్ నిఫ్టీ : గత నాలుగు వారాలుగా ఈ సూచీ మైనర్ కరెక్షన్‌లో ఉంది. గత వారం కీలక స్థాయి 47000 వద్ద రికవరీ సాధించినా 450 పాయింట్ల నష్టంతో 47700 సమీపంలో ముగిసింది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 48200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శిస్తే దిగువన 47300, 47000 వద్ద మద్దతు ఉంది.

పాటర్న్ : 21800 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్ ఉండవచ్చు. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి. 21800 వద్ద రెండు టాప్‌లను కలుపుతూ "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే అప్రమత్తం కాక తప్పదు.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం :	22000, 22080
మద్దతు :	21860, 21800

www.sundartrends.in

విషాదం మిగిల్చిన సంక్రాంతి ముగ్గు


తేజశ్రీ(ఫైల్)

- ఏలూరులో అక్కచెల్లెళ్లను ఢీకొన్న లారీ
- చెల్లెలు మృతి.. అక్కకు తీవ్ర గాయాలు
- మృతదేహంతో బంధువుల రాస్తారోకో

మండవల్లి, జనవరి 14: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న బాలికను లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన పగిళ్ల నాగబాబుకు ఇద్దరు కుమార్తెలు తేజశ్రీ(15), దుర్గ. 165 జాతీయ రహదారి పక్కనే ఉన్న తమ ఇంటి ముందు శనివారం రాత్రి ముగ్గులు వేస్తుండగా ముదినేపల్లి నుంచి కైకలూరు వెళ్తున్న లోడ్ లారీ వీరిని ఢీకొంది. తేజశ్రీ అక్కడికక్కడే దుర్మరణం పాలవగా తీవ్ర గాయాలపాలైన దుర్గను 108లో గుడివాడ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహించిన కానుకొల్లు గ్రామస్థులు తేజశ్రీ మృతదేహంతో ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. మండవల్లి పోలీసులతో పాటు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనయుడు వినయ్ న్యాయం జరిగేలా చూస్తామని బాధితులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. లారీ డ్రైవర్ కాగితాల ప్రకాశరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ముగ్గురి ప్రాణాలు తీసిన అతివేగం

దొరవారిసత్రం, జనవరి 14: అతి వేగం ముగ్గురు స్నేహితుల ప్రాణాలు బలిగొంది. తిరుపతి జిల్లా దొరవారిసత్రం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన కన్నలి గౌతమ్(23), పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన కోగిలి రాంకీ(23), నాయుడుపేట పట్టణం లోతువానిగుంట ప్రాంతానికి చెందిన కురుగొండ మునిరాజ(28) స్నేహితులు. శనివారం అర్ధరాత్రి వరకు నాయుడుపేటలో భోగి సంబరాల్లో గడిపిన వీరు తెల్లవారుజామున 3 గంటలకు బైకుపై సూళ్లూరు పేటకు వెళ్తూ కలగుంట వంతెన వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. తలకు బలమైన గాయాలై ముగ్గురూ మరణించారు. అతివేగం, మద్యం మత్తు, దట్టమైన పొగమంచు వల్ల ప్రమాదం పాలైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

రాష్ట్ర ప్రజలకు పవన్ సంక్రాంతి శుభాకాంక్షలు

అమరావతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలు పరిమళించే వేడుక సంక్రాంతి అని, రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, పిండి వంటల సమ్మేళనంతో తెలుగు వారికి సకల శుభాలు కలుగజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త క్రాంతిని నింపాలని, భోగభాగ్యాలను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండగ ప్రజలందరి జీవితాల్లో భోగ భాగ్యాలతో పాటు సుఖ సంతోషాలు అందించాలని ఆకాంక్షించారు.

అయ్యప్ప స్వాములపై సర్కార్ నిర్లక్ష్యం: అనగాని

అమరావతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సభలకు ప్రత్యేక బస్సులు పెట్టి, జనాన్ని బలవంతంగా తరలించడంపై ఉన్న శ్రద్ధ.. అయ్యప్పదీక్షాధారుల పట్ల ప్రభుత్వానికి లేదని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. 'ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అయ్యప్పస్వామి దర్శన భాగ్యం లేక దీక్షాధారులు, భక్తులు నిరాశలో ఉన్నారు. దీక్ష విరమణ సమయంలోనూ ప్రత్యేక బస్సులు కేటాయించకపోవడంతో శబరిమల వెళ్లేందుకు స్వాములు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, దేవదాయశాఖ మంత్రి కనీసం సమీక్ష చేయట్లేదు. ప్రత్యేక బస్సులు లేక వేలాది మంది స్వాములు, భక్తులు, దర్శనం కాకుండానే వెను దిరిగి వస్తున్నారు. శబరిమలైలో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది ఏపీ భక్తులు గాయపడినా జగన్ ప్రభుత్వం మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు' అని విమర్శించారు.

అగ్రరాజ్య మహిళకు బాసట

- సౌదీలో మానవత చాటుకున్న ఏపీ మహిళలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


కోలుకుంటున్న మేరీతో విశాఖకు చెందిన సంధ్య, ప్రవీణ

అగ్రరాజ్యం అమెరికాకు చెందిన మహిళ ఒకరు అరబ్బు నేలపై అత్యంత దయనీయ పరిస్థితుల్లో విలవిల్లాడుతుంటే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఆమెకు అండగా నిలిచి మానవత చాటారు. అమెరికా పౌరురాలైన మేరీ ఫాల్ అనే 44 ఏళ్ల మహిళ సౌదీ అరేబియాలో ఈశాన్య ప్రాంతానికి పర్యాటక వీసాపై వచ్చి అనూహ్యంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. జ్ఞాపక శక్తి కోల్పోవడం, వీసా గడువు కూడా ముగిసిపోవడంతో పాటు.. చివరకు తినడానికి తిండి కూడా లేని దురవస్థ ఎర్కొంది. ఆమె పరిస్థితిని చూసి విశాఖ గాజువాకకు చెందిన అంకాబతుల సంధ్య, బగ్గం ప్రవీణ రాకేశ్ చలించిపోయారు. ఆమెకు ఆపన్న హస్తం అందించి ఆశ్రయం కల్పించారు. తెలుగు ప్రవాసీ సంఘం 'సాటా' సభ్యులైన వీరిద్దరూ మేరీని ఎంతో ఆప్యాయతతో ఆదరించడంతో ఆమె ఆరోగ్యం కుదుటపడి క్రమేణా జ్ఞాపక శక్తి కూడా తిరిగి వస్తోంది.

రేపు రాష్ట్రానికి ప్రధాని

- లేపాక్షి ఆలయాన్ని సందర్శించనున్న మోదీ
- పాలసముద్రం వద్ద 'నాసిన్' ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, హిందూపురం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి శ్రీ దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని మోదీ తొలుత దర్శించుకుంటారని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అనంతరం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నిర్మించిన కస్టమ్స్, ప్రత్యక్ష పన్నులు, నార్కోటిక్స్‌కు చెందిన జాతీయ అకాడమీ కొత్త క్యాంపస్(నాసిన్)ను ప్రారంభిస్తారు. అక్కడే ఆయన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ 74, 75 బ్యాచ్‌లకు చెందిన ఐఆర్ఎస్ ట్రైనీలు, భూటాన్ రాయల్ సర్వీస్ ఆఫీసర్ ట్రైనీలతో సంభాషిస్తారు. పర్యటన ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

పేరులో రాముడు.. తీరులో రాక్షసుడు

- కర్ణాటక సీఎంపై 'అయోధ్య' ఆలయ పూజారి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 14: కర్ణాటక సీఎం సిద్దరామయ్య అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి హాజరుకానంటూ ప్రకటించడంపై బీజేపీ, హిందూ సంస్థల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 'రాముడితో అనుబంధమైన సిద్ధరామయ్య పేరు చాలా మంచిది. కాని ఆయన(కర్ణాటక సీఎం) చర్యలే రాక్షసుడిని తలపిస్తున్నాయి' అని ఉత్తరప్రదేశ్‌లోని హనుమాన్‌గఢీ ఆలయ పూజారి మహంతరాజు దాస్ అన్నారు.

ఖర్గే కింద పనిచేయాలా? : నితీశ్ గుర్రు

న్యూఢిల్లీ, జనవరి 14: ప్రతిపక్షాల 'ఇండియా' కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూటమి చైర్మన్‌గా నియమించి.. తనకు కన్వీనర్ పోస్టు ఇవ్వచూపడాన్ని బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ సహించలేకపోయారు. అందుకే కన్వీనర్ పదవి తనకు వద్దని, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు ఇవ్వాలని సూచించారు.

భారత సైన్యాన్ని ఉపసంహరించుకోండి

- మార్చి 15 వరకు గడువు: మాల్దీవ్స్ సర్కారు

న్యూఢిల్లీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తమ దేశం నుంచి భారత సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని మాల్దీవ్స్ సర్కారు స్పష్టం చేసింది. ప్రస్తుతం తమ దేశంలో 88 బెటాలియన్ల భారత సైనికులున్నారని, వారిని మార్చి 15లోపు వెనక్కి రప్పించుకోవాలని భారత్‌ను దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కోరినట్లు అధ్యక్ష కార్యాలయ పౌర విధాన కార్యదర్శి అబ్దుల్లా నజీమ్ ఇబ్రహీం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయంలో ఆదివారం ఉదయం ఉన్నతస్థాయి సమావేశం జరిగిందని, భారత హైకమిషనర్ మనూ మహావర్ కూడా హాజరయ్యారని వివరించారు. భారత ప్రధాని మోదీపై మాల్దీవ్స్ మంత్రులు నోరుపారేసుకోవడంతో ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే.

పోదాం పదా.. పందేలకు!

- కోడి పందేల కోసం ఏపీకి క్యూ కట్టిన తెలంగాణవాసులు


ఎన్టీఆర్‌జిల్లా నెమలికొణిజర్లలో బిర్రు వద్ద జనం

అశ్వారావుపేట/ బూర్గంపాడు/ఎర్రుపాలెం, జనవరి 14: కోడి పందేల కోసం తెలంగాణ సరిహద్దు జిల్లాలకు చెందిన కొందరు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దు ప్రాంతాలైన ఏపీలోని ఉభయగోదావరి జిల్లాలు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరుల వద్ద భోగి సందర్భంగా ఆదివారం ఒక్కరోజే రూ.కోట్లలో చేతులు మారాయి. కొన్ని బరుల వద్ద నిర్వాహకులు విఎనీ ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేయడం గమనార్హం..! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సరిహద్దులోని ఏపీ గ్రామాలైన కామయ్యపాలెం, తాటాకులగూడెం, శ్రీనివాసపురం, పాలచెర్ల, జంగారెడ్డిగూడెం, దెందులూరు, తాడేపల్లిగూడెం, పేరంపేట, భీమవరం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి తదితర ప్రాంతాలతో పాటు ఏపీలో విలీనమైన వరరామచంద్రాపురం, చింతూరు, కూనవరం, ఎన్టీఆర్ జిల్లాలోని ఊటుకూరు, నెమలికొణిజర్ల, మైలవరం, మురుసుమిల్లి, గంగినేని, వీరులపాడు, పెనుగొలను, రుద్రారం, పొందుగుల, రెడ్డిగూడెం గ్రామాల్లో కోడిపందాల బరులు ఏర్పాటయ్యాయి. తెలంగాణ పోలీసులు కోడిపందేలపై గట్టి నిఘా పెట్టడంతో.. ఉమ్మడి ఖమ్మంలోని జూదగాళ్లు ఏపీకి వెళ్తున్నారు. మరికొందరు పందెంకోళ్లను తీసుకెళ్తున్నారు. కొన్ని బరుల్లో కోడిపందేలతోపాటు.. పేకాట, లోనబయట(అందర్-బాహర్), గుండాట లాంటి జూదాలు, మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. భోగిరోజు కోట్ల రూపాయల్లో జూదాలు నడిచాయని అంచనా. తెలంగాణ నుంచి బరులు ఏర్పాటు చేసిన గ్రామాలకు దారి తీసే మార్గాల్లో ఆదివారం ట్రాఫిక్ జామ్ నెలకొంది.

అంచనాలు 'బైపాస్'!

- నూజివీడు బైపాస్‌రోడ్డు అంచనాలో గందరగోళం
- పొంతనలేని ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు
- అంచనాలు మారితే బడ్జెట్ పెరగాలి
- కానీ,స్టేజ్-2 పనుల ఖర్చు తగ్గించిన వైనం
- కారణం అడక్కుండానే సర్కారు సమ్మతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రహదారి నిర్మాణం కోసం రోడ్లు భవనాల శాఖ రూపొందించిన అంచనాలు తప్పాయి. భూ సేకరణ భారం ఎక్కువయితే వర్క్ మొత్తం అంచనా పెరగాలి. ఆపై బడ్జెట్ పెరగాలి. కానీ ఇదేమి చిత్రమో.. వర్క్ అంచనా పెంచకుండా ఉన్నదాంట్లోనే సర్దుబాటుచేసి, పెంపుదలను మాత్రం వెరైటీగా చూపిస్తున్నారు. ఆ లెక్కను నిశితంగా పరిశీలన చేస్తే అసలు అంచనాలు బైపాస్ అయ్యాయన్న అనుమానం కలుగుతోంది. వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లా నూజివీడుకు 5 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి నిర్మించాలని 2021లో నిర్ణయించారు. 25కోట్లతో రెండు దశల్లో నిర్మించేలా ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 280) జారీ చేసింది. ఇందులో స్టేజ్-1కు 7.58 కోట్లు, స్టేజ్-2కు 17.42 కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. 2021 సెప్టెంబరు 16 నాటి అంచనాలివి. ఇప్పుడు వీటిని సవరిస్తూ మరోసారి ప్రతిపాదనలు ఇచ్చారు. స్టేజ్-1 పరిధిలో 21.32 ఎకరాల భూమి సేకరించాల్సి వస్తోందని, ప్రతిపాదనల్లో పేర్కొన్నట్లుగా భూ సేకరణ ఖర్చు 7.58 కోట్లు సరిపోదని నిర్ధారణ చేశారు. మొత్తం భూ సేకరణకే (గతేడాది నవంబరు నాటి లెక్క ప్రకారం)13.40 కోట్లు కానుందని పేర్కొన్నారు. అప్పుడు సవరించిన అంచనాల ప్రకారం బైపాస్ నిర్మాణ వ్యయం స్టేజ్-1లో 13.40 కోట్లు కావాలి. ఇంతకుముందే నిర్ధారించినట్లుగా స్టేజ్-2 అంచనా 17.42 కోట్లు. ఈ రెండు కలిపితే 30.82 కోట్లు. అయితే ఆర్అండ్‌బీ అధికారులు స్టేజ్-1 వ్యయాన్ని 13.42 కోట్లుగా ప్రతిపాదించి, స్టేజ్-2గా ఉన్న బడ్జెట్‌ను 17.42 కోట్ల నుంచి 11.60 కోట్లకు కుదించారు. అంటే 5.82 కోట్లు ఇందులో కోతపెట్టారు. అంటే రెండున్నరేళ్ల తర్వాత ఇప్పుడు నింపాదిగా భూసేకరణ భారం పెరిగిందని స్టేజ్-1లో 5.84 కోట్ల మేర పెంపుదల చూపి, ఏ కారణం చూపకుండానే స్టేజ్-2లో 5.82 కోట్లు కోతపెట్టారు. స్టేజ్-2 పనుల్లో 5.82 కోట్ల మేర కోత పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్‌కు మేలుచేసేలా ముందుగానే వర్క్ అంచనాలను ఇష్టానుసారంగా పెంచి చూపించారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. "ఆ రోడ్డు బడ్జెట్ రూ.25 కోట్లే. అంతకుమించి ఇవ్వరు. ఏంచేసినా దానికి కట్టుబడే ఉండాలి" అని ఓ ఉన్నతాధికారి సూచించినట్లు తెలిసింది. దీంతో అంచనాలను తలకిందులు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించినట్లు సమాచారం. ప్రభుత్వం కూడా అవే ప్రతిపాదనలను ఆమోదించింది. స్టేజ్-2 బడ్జెట్ ముందు ఎందుకు పెంచారు? తర్వాత ఎందుకు తగ్గించారన్న కోణంలో ఆరా తీయలేదు.

ఆర్అండ్‌బీ పెండింగ్ బిల్లులకు 23 కోట్లు

ఎన్నికల వేళ ప్రభుత్వం తాయిలాలు ప్రకటిస్తోంది. అందులో ఆర్అండ్‌బీ కాంట్రాక్టర్లకు ఇచ్చే పెండింగ్ బిల్లులు కూడా ఉన్నాయి. జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణం, నిర్వహణ, మరమ్మతు పనులు చేసి బిల్లులు రాక అల్లాడిపోతున్న కాంట్రాక్టర్లకు పాక్షికంగానైనా బిల్లులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా పెండింగ్ బిల్లులకోసం 23.84 కోట్ల విడుదలకు ఆమోదం తెలుపుతూ ఆర్అండ్‌బీ ఉత్తర్వులు (జీవో 25) జారీచేసింది. ఈనెల 8న ఆర్థికశాఖ అనుమతి ఇవ్వగా, తాజాగా ఆర్అండ్‌బీ ఉత్తర్వులు ఇచ్చింది. కాంట్రాక్టర్లలో కొద్దిమందికి సగటున 20 నుంచి 50 శాతం మేర బిల్లులు చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

కష్టాల నుంచి కచ్చితత్వం దిశగా..!

- వాతావరణంలో.. విజ్ఞానంలో తిరుగులేని శక్తిగా భారత్
- అడ్డంకులు దాటుకుని అంచెలంచెలుగా ఎదిగిన ఐఎండీ
- 150 ఏళ్ల వాతావరణ శాఖ ప్రస్థానంలో ఎన్నెన్నో మైలురాళ్లు
- వాతావరణ బులెటిన్ల విడుదలపై గ్రామస్థాయికి విజ్ఞానం
- రుతుపవన వర్షాలు, తుఫాన్ల గమనంపై పెరిగిన కచ్చితత్వం
- గ్లోబల్ దిశగా వాతావరణ శాఖ అడుగులు.. నేడు 150 ఏళ్ల ఉత్సవం



విశాఖలోని కైలాసగిరిపై డాప్లర్ వాతావరణ రాడార్ కేంద్రం

విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అత్యంత తీవ్రమైన రెండు తుఫాన్లు బెంగాల్, ఉమ్మడి మద్రాస్‌లోని కోస్తా తీరాన్ని 1864లో కుదిపేశాయి. ఈ తుఫాన్లతో లక్షల మంది చనిపోయారని ఒక అంచనా. దాని తర్వాత 1866లో భారతదేశం అత్యంత తీవ్రమైన కరువు, కాటకాలను ఎదుర్కొంది. వేలాది మంది ఆకలితో చనిపోయారు. ఈ రెండు ఘటనలతో వాతావరణ విజ్ఞానంపై పరిశోధనలు, కార్యకలాపాలు నిర్వహణకు భారత్‌లో అంకురార్పణ జరిగింది. అప్పటికే బెంగాల్ కేంద్రంగా ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్ అనే సంస్థ ఏర్పడి వాతావరణం, ప్రజారోగ్యం వంటి సమస్యలపై పరిశోధనలు చేయాలని నిర్ణయించింది. అయితే అంటువ్యాధులు, ప్రజారోగ్యంపై పరిశోధనలు వైపు అడుగులు పడినా.. వాతావరణం కోసం తొలుత కొన్ని అడ్డంకులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అప్పటి బ్రిటిష్ పాలకులు భారత్‌లో వాతావరణ సంస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 1875లో మొట్టమొదటి వాతావరణ సంస్థ కలకత్తాలో ఏర్పడింది. ఆ తర్వాత 1877లో కలకత్తాలోని ఆలీపూర్‌లో తొలి అబ్జర్వేటర్ ఏర్పడింది. అప్పటి నుంచి అనేక మైలురాళ్లు దాటి నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సంస్థలలో ఒకటిగా భారత్ నిలిచింది. ఒకప్పుడు ఒక రాష్ట్రం లేదా రెండు, మూడు రాష్ట్రాలకు సంబంధించి వాతావరణ సూచనలు చేసే సంస్థ.. నేడు గ్రామ పంచాయతీ స్థాయిలో కూడా వాతావరణ బులిటెన్లు ఇచ్చే స్థాయికి ఎదిగింది. ఒకప్పుడు వాతావరణ శాఖ వర్షం పడుతుంది అని చెబితే రాదులే.. అనుకునే స్థాయి నుంచి.. నేడు కచ్చితంగా వాన కురుస్తుంది అనుకునే స్థాయికి ఐఎండీ ఎదిగింది. సోమవారం 150 ఏళ్ల ఉత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమైంది.

అనేక పరిశోధనలు.. పెను మార్పులు

గత 150 ఏళ్లలో వాతావరణ విభాగంలో అనేక పరిశోధనలు జరిగాయి. 1878లోనే తొలిసారిగా రోజువారీగా వాతావరణ నివేదిక ఇవ్వడం మొదలుపెట్టారని పాత రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత తొలి ప్రపంచ యుద్ధం సమయంలో వాతావరణ విశేషాలు అందించేందుకు ట్రోపో ఆవరణం (భూమి నుంచి పది కిలో మీటర్లు ఎత్తులో)లో జరిగిన వాతావరణ మార్పులపై కూడా నివేదిక ఇవ్వడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే 1921లో తొలిసారిగా విమాన రాకపోకలకు బులెటిన్లు విడుదల చేశారు. అనంతరం 1925లో తుఫాన్ల గమనాన్ని కనుగొనే దిశగా నివేదికలు విడుదల చేసేవారు. మొదటిసారిగా కలకత్తాలో ఏర్పడిన వాతావరణ సంస్థ ఆ తర్వాత సిమ్లా, అక్కడి నుంచి పుణె, చివరిగా 1944లో ఢిల్లీకి మారింది.

రైతులకు అవసరమైన సమాచారం..

స్వాతంత్ర్యం అనంతరం వ్యవసాయానికి మరింత ప్రాధాన్యం పెరగడంతో రైతులకు అవసరమైన బులెటిన్లు ఇవ్వడం ప్రారంభించారు. ఈ క్రమంలో అమెరికా శాటిలైట్ సంస్థ నుంచి ఛాయాచిత్రాలు తెప్పించి అటు రైతులకు, ఇటు ప్రజలకు వాతావరణ సూచనలు చేసేవారు. తుఫాన్ల గమనంలో మెరుగైన ఫలితాల కోసం 1970లో తొలి రాడార్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా 1970లో బంగ్లాదేశ్‌లో బోలా తుఫాన్, అదే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో, 1971లో ఒడిసాలో వరుసగా వచ్చిన మూడు తుఫాన్ల ప్రభావంతో వేలాది మంది చనిపోయారు. దీంతో దేశంలోని అన్ని తీర ప్రాంతాల్లోనూ రాడార్లు ఏర్పాటు చేశారు. 1999లో పారాదీప్‌ను సూపర్ సైక్లోన్ తాకే సమయంలో కొంత మేరకు కచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని ఇవ్వడంలో వాతావరణశాఖ విజయవంతమైంది. 2002లో చెన్నైలో వెదర్ డాప్లర్ రాడార్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత్‌లో 39 వెదర్ డాప్లర్ రాడార్‌లు ఉన్నాయి. ఇంకా 200 ఆగ్రో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, 800కుపైగా ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, 1,382 ఆటోమేటిక్ రెయిన్ గేజ్‌లు, 83 మెరుపు సెన్సర్లు, 63 పైలట్ బెలూన్ అబ్జర్వేటర్లు ఉన్నాయి. వీటి సాయంతో మల్టీ మోడల్ బులెటిన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ సమాచారాన్ని 15 రోజుల వరకు అంచనా వేస్తున్నారు. కచ్చితత్వంలో 50 శాతానికిపైగా విజయం సాధించారు.

హిందూ మహాసముద్ర పరిధిలో పెద్దన్న..

ఇదిలా ఉండగా ఉత్తర హిందూ మహాసముద్రం పరిధిలోని 13 దేశాలకు సంబంధించి తుఫాన్లపై విశ్లేషణకు భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం తుఫాన్లు, ఆకస్మిక వరదలు, ఎండలు, మంచు ఉపద్రవాలు వంటి విపత్తులపై అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూ ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించే ప్రయత్నంలో ఐఎండీ సఫలమవుతోంది. అయితే భవిష్యత్‌లో వాతావరణం వల్ల ఎదురయ్యే మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని ఐఎండీ గుర్తించినట్లు అంచనా వేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆకస్మిక వరదలు, కుంభవృష్టిగా వర్షాలు, తుఫాన్ల తీవ్రతను అంచనా వేయడానికి మరిన్ని పరిశోధనలు అవసరమవుతాయని రిటైర్డ్ వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంటలు, ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపిస్తాయనే దిశగా పరిశోధనలు చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఐఎండీపై ఉన్నాయని వారు అభిప్రాయపడుతున్నారు.

కొత్త చేరికలతో ఉత్కంఠ!

టీడీపీ-జనసేనల్లోకి వస్తున్న ఆశావహులు

- ఇప్పటికే ఉన్న నేతల్లో ఆందోళన
- టికెట్ల కోసం పెరుగుతున్న పోటీ
- పెనమలూరే కోరుతున్న పార్థసారథి
- నూజివీడును పరిశీలిస్తున్న టీడీపీ
- బాలశౌరికి మచిలీపట్నం లోక్‌సభ!
- జనసేన నాయకత్వం యోచన
- పెడన అసెంబ్లీకీ పరిశీలన!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొత్తగా చేరుతున్న వారితో టీడీపీ, జనసేన పార్టీల్లో ఉత్కంఠ పెరుగుతోంది. వారికి ఎక్కడ చోటు కల్పించే వీలుందన్న అంశంపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. మరోవైపు గతం నుంచి ఆ సీట్లపై ఆశ పెట్టుకున్న నేతలు గందరగోళంలో పడుతున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీలో చేరడం ఖరారైంది. ఆయన కొద్ది రోజుల్లో చేరబోతున్నారు. ఆయనకు సీటు ఇవ్వాలని కూడా టీడీపీ నాయకత్వం నిర్ణయించింది. తనకు పెనమలూరే ఇవ్వాలని ఆయన కోరుతుండగా.. నూజివీడులో నిలిపే అంశాన్ని పరిశీలిస్తోంది. ఆయన పేరును ఒకట్రెండు నియోజకవర్గాల్లో సర్వేలో పెట్టి ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారు. పార్థసారథి చేరిక ఇటు పెనమలూరు, అటు నూజివీడు టికెట్లు ఆశిస్తున్న టీడీపీ నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. మచిలీపట్నం వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయనకు ఆ సీటే ఇవ్వడంపై ఆ పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పేరు పరిశీలనలో ఉండడం గమనార్హం. ఇప్పుడు బాలశౌరి చేరిక కొత్త సమీకరణలకు అవకాశం కల్పిస్తోంది. నిజానికి ఆయన గుంటూరు జిల్లాలో ఎంపీ సీటును ఆశిస్తున్నప్పటికీ అక్కడ జనసేనకు అవకాశం ఉండకపోవచ్చని అంటున్నారు. పెడన అసెంబ్లీ సీటుకు కూడా ఆయన పేరును పరిశీలించే అవకాశం లేకపోలేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. విశాఖ జిల్లాలో జనసేనలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ చేరారు. ఈ ఇద్దరూ విశాఖ, దాని చుట్టు పక్కల సీట్లు ఆశిస్తున్నారు. గతం నుంచి ఆ పార్టీలో పని చేస్తున్న నేతలు కూడా రేసులో ఉన్నారు. ఇంత మందికి ఆ పార్టీ చోటు కల్పించగలదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఉన్న సంకేతాలను బట్టి విశాఖ జిల్లాలో యలమంచిలి సీటు జనసేన నేత సుందరపు విజయ్‌కుమార్‌కు లభించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. మిగిలిన సీట్లపై స్పష్టత రాలేదని అంటున్నారు. వైసీపీ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఆయనను ఒంగోలు లేదా నెల్లూరు ఎంపీ సీట్లకు పరిశీలనలోకి తీసుకోవచ్చని అంటున్నారు.

వేమిరెడ్డిపై ఉత్కంఠ

నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ ప్రముఖ నేత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఇటీవల టీడీపీ నేతలు కొందరు భేటీ అయ్యారు. సీఎం జగన్ ఆయన్ను నెల్లూరు లోక్‌సభకు పోటీచేయాలని సూచించారు. అయితే ఆ స్థానం పరిధిలో తాను కోరిన మార్పుచేర్పులను నిరాకరించడంతో వేమిరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ నేతలు కలిశారని తెలిశాక ముఖ్యమంత్రి ఆయన్ను పిలిపించి మాట్లాడారు. ఆ తర్వాత నెల్లూరు ఎంపీ స్థానం నుంచి వైసీపీ తరఫున పోటీకి ఆయన అంగీకరించారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కానీ వేమిరెడ్డి తనకు తానుగా ఇంతవరకు ఏ ప్రకటనా చేయలేదు. దీంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది.

గుంటూరుకు చాలా మంది..

గుంటూరు, నరసరావుపేట ఎంపీ స్థానాలకు టీడీపీలో అనేక మంది పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. గుంటూరు టీడీపీ సిటింగ్ ఎంపీ గల్లా జయదేవ్ ఈ సారి బరిలో నుంచి వైదొలగుతున్నారని.. అక్కడ కొత్త వారి పేర్లు పరిశీలిస్తున్నారని అంటున్నారు. ఈ సీటుకు విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, ప్రవాసాంధ్రుడు పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య పరీక్షల రంగంలో ఉన్న కంచర్ల సుధాకర్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. నరసరావుపేట ఎంపీ సీటుకు రియల్ ఎస్టేట్ సంస్థ అధినేత భాష్యం ప్రవీణ్, కాంట్రాక్టర్ పుట్టా మహేశ్ యాదవ్, బీసీ సంఘ నేత పసుపులేటి సుధాకర్ మొదలైనవారి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. టీడీపీ తన అభ్యర్థుల తొలి జాబితాను సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నా.. అంతర్గత కసరత్తు పూర్తి కాకపోవడంతో వాయిదా పడింది. పండుగ తర్వాత ముహూర్తం చూసుకుని.. 25 మంది పేర్లతో జాబితా విడుదల చేయవచ్చని అంటున్నారు.


జగన్ సర్కారు చీకటి జీవోలను భోగిమంటల్లో వేసి దహనం చేస్తున్న అచ్చెన్న, రామ్మోహన్ తదితరులు

వైసీపీకి పాడె కడదాం: అచ్చెన్న

- భోగి మంటల్లో చీకటి జీవోల దహనం

టెక్కలి/కోటబొమ్మాళి, జనవరి 14: దేశ చరిత్రలోనే అత్యంత అవినీతి పరుడైన ముఖ్యమంత్రిగా జగన్ గుర్తింపు పొందారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ప్రజామోదం లేని రాష్ట్ర ప్రభుత్వ చీకటి జీవోలను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు భోగి మంటల్లో వేసి దహనం చేశాయి. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద అచ్చెన్న, ఎంపీ రామ్మోహన్ నాయుడు తదితరులు జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పాడెకట్టి.. బంగాళాఖాతంలో కలిపేద్దామని, జగన్‌రెడ్డికి ఈ ఎన్నికలతో ముగింపుకార్డు ఇద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కరువయ్యారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయమని, టీడీపీ అధినేతకు కుప్పంలో లక్ష ఓట్ల మెజారీ తథ్యమని తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల కారణంగా పండగపూట కూడా ఉద్యోగులు పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇసుక దందాతో పాటు లిక్కర్ మాఫియా, నాసిరకాల మద్యం అమ్మకాలతో కోట్లు కొల్లగొడుతూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. అలాగే, పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు భోగి మంటల్లో చీకటి జీవోల ప్రతులను దహనం చేశారు. ఏపీకి పట్టిన కీడు తొలగాలని ఆకాంక్షించారు. ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

అయోధ్యకు వెళ్లనున్న శృంగేరీ శంకరాచార్య

న్యూఢిల్లీ, జనవరి 14: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠకు దేశంలోని నలుగురు జగద్గురు శంకరాచార్యులు హాజరు కావడం లేదంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో విశ్వ హిందూ పరిషత్ కీలక ప్రకటన చేసింది. కర్ణాటకలోని శృంగేరీ శారదా పీఠం శంకరాచార్య ఈ నెల 22న జరిగే కార్యక్రమానికి వెళ్లనున్నారని తెలిపింది. ఈ సందర్భంగా శృంగేరీ పీఠం కూడా ఓ ప్రకటన విడుదల చేస్తూ రామ మందిర నిర్మాణం ద్వారా 500 ఏళ్ల వివాదానికి ముగింపు పలికినట్టయిందని పేర్కొంది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమం సనాతన ధర్మాన్ని పాటించేవారందరికీ సంతోషం కలిగించేదని తెలిపింది.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

- తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగ సందడి
- కుటుంబమంతా ఒక్కచోట కలిసి సంబురాలు
- పండుగ వేళ.. పట్నంవాసుల పల్లె'టూరు'

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి పెద్ద పండుగ.. సంక్రాంతి సంబరాలు జోరందుకున్నాయి. ఎంతసేపూ ఇల్లు.. ఆఫీసు.. అంటూ నాలుగు గోడల మధ్య బందీలైపోయి నగర జీవితానికి అలవాటు పడిపోయిన పట్నంవాసుల్లో చాలామంది.. అన్నదమ్ములు, బంధువులతో కలిసి పండుగ జరుపుకోవడానికి పల్లె బాట పట్టారు. నగరంలోనే ఉండిపోయిన గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్‌వాసులూ ఈసారి ఉమ్మడిగా వేడుకలు జరుపుకొని పండుగ స్ఫూర్తిని చాటుతున్నారు. ముఖ్యంగా.. హైదరాబాద్‌లో ఆదివారం తెల్లవారుజాము నుంచే వీధివీధినా.. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల ముందు పెద్ద ఎత్తున భోగిమంటలు వేసి పిన్నాపెద్దా అందరూ కలిసి సరదాగా గడిపారు. అలాగే రాత్రుళ్లు మహిళలంతా కలిసి కబుర్లు చెప్పుకొంటూ.. వీధి గుమ్మాల్లో అందమైన రంగవల్లులను ఆవిష్కరిస్తున్నారు. పిల్లలేమో అపార్ట్‌మెంట్లు, ఇళ్ల మేడలపైకెక్కి పతంగులు ఎగరేస్తూ రచ్చ రచ్చ చేస్తున్నారు. సామాన్యుల సందడి ఇలా ఉంటే.. సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, డబ్బున్నవారు ఇప్పటికే నగరశివార్లలోని తమ ఫామ్‌హౌజ్‌లకు చేరుకుని పల్లె వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. కుటుంబసభ్యులతో పాటు.. బంధువులను, తమకు కావాల్సినవారిని పిలిపించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసి మరీ సంబురాలు చేస్తున్నారు. ఉదాహరణకు.. నగర శివార్లలోని తన ఫామ్‌హౌజ్‌లో స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి గత కొన్నేళ్లుగా సంక్రాంతి వేడుకలు జరుపుకొంటున్న టాలీవుడ్ ప్రముఖుడు ఒకరు ఈసారి ఇంకాస్త భారీగా ఏర్పాట్లు చేశారు. పల్లె వాతావరణాన్ని రీ-క్రియేట్ చేసి అక్కడికి వస్తున్న తన స్నేహితులు, బంధువులకు కొత్త అనుభూతి పంచుతున్నారు. అలాగే.. కరోనా వల్ల గత మూడేళ్లుగా ఒకచోట కలవని ఉమ్మడి కుటుంబాలు కూడా ఈసారి ఒకమాట ముందే అనుకుని కుటుంబాల రీ-యూనియన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. తెలుగురాష్ట్రాల్లోని నగరాలు, పట్నాల నుంచే కాదు.. ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో స్థిరపడ్డ తెలుగువారిలో చాలా మంది ఈసారి పండగకి ఇక్కడికి.. రావడం విశేషం. ఏపీలోని ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని కలిగిన కుటుంబాలు.. తమ ఇంటి ప్రాంగణంలోనే కోడి పందేలు, పేకాట వంటివి ఏర్పాటు చేయడం గమనార్హం.

అపార్ట్‌మెంట్లలోనే ఆటాపాటా..

తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచీ ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని హైదరాబాద్‌కు వచ్చిన లక్షలాది మంది.. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లడంతో రాజధాని వీధులన్నీ శనివారం నుంచే బోసిపోయి కనిపించాయి. ముఖ్యంగా.. ఆంధ్ర, రాయలసీమవాసులు ఎక్కువగా ఉండే కూకట్‌పల్లి, ఎస్సార్‌నగర్, కల్యాణ్‌నగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రద్దీ తగ్గిపోయింది. భోగిమంటల సందడి మాత్రం అపార్ట్‌మెంట్ల వద్ద ఎక్కువగా కనిపించింది. కొన్ని అపార్ట్‌మెంట్లలో సోమవారంనాడు కలిసి భోజనాలు చేయడానికి ప్రణాళికలు వేసుకున్నారు. ఉదాహరణకు.. మూసాపేటలోని ఒక అపార్ట్‌మెంట్‌లో 20 ఫ్లాట్లు ఉండగా నాలుగు కుటుంబాలు ఊళ్లకు వెళ్లాయి. మిగతావారందరం కలిసి సోమవారం భోజనాలు చేద్దామనుకుంటున్నామని ఆ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సునీల్ అనే వ్యక్తి తెలిపారు. ఇలా కలవడం వల్ల ఒకరి సంస్కృతీ సంప్రదాయాలు, ఆనవాయితీల గురించి మరొకరు తెలుసుకునే వీలుంటుందని తాము భావించామని ఆయన వివరించారు. "కొన్ని కారణాల వల్ల ఈసారి సొంతూరికి వెళ్లలేదు. అయినా ఆ లోటు తెలియకుండా మా అపార్ట్‌మెంట్‌వాసులందరం కలిసి ఇక్కడే పండుగ చేసుకుంటున్నాం. కోడిపందేలు లేవుగానీ.. చతుర్ముఖపారాయణానికి (పేకాట) ఏర్పాట్లు చేసుకున్నాం" అని తణుకుకు చెందిన నాగేశ్వరరావు నవ్వుతూ చెప్పారు. అలాగే.. కొన్ని ఈవెంట్ కంపెనీలు నగరశివార్లలోని ఫామ్‌హౌజ్‌లలో టికెటింగ్ ఈవెంట్‌గా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నాయి. ఆ టికెట్ తీసుకుంటే చాలు.. నగరంలోనే పల్లె వాతావరణంలో సంక్రాంతి జరుపుకోవచ్చన్నమాట!!

తాడేపల్లిలో ఎన్నికల భక్తి!


సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో వేసిన సెట్టింగ్‌ల్లో ఇది ఒకటి

(మొదటి పేజీ తరువాయి)

పరిసరాలను కూడా అచ్చం పల్లెటూరు అందాలు, అద్భుతమైన కళాఖండాలు, ఆలయం, ఇంకా ప్రముఖమైన కళాకృతులతో నింపేశారు. మినీ పల్లెటూరును తలపించిన ఆ వాతావరణంలో జగన్ దంపతులు కలియదిరిగారు. అయితే.. భర్త సీఎం అయ్యాక ఏనాడూ ఏ హిందూ ఆలయానికీ వెళ్లని భారతిరెడ్డి జగన్‌తో కలిసి ఈ 'మినీ తిరుమల' ఆలయంలో పూజలు, దర్శనాలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి, ముఖ్యమంత్రి హోదాలో జగన్ తిరుమల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్నారు. సాధారణంగా ఈ కార్యక్రమంలో సతీమణితో కలిసి పాల్గొనడం రివాజు. అయినా, తిరుమల కొండపై జగన్ వెంట ఎప్పుడూ భారతీరెడ్డి కనిపించలేదు. రాష్ట్రంలోని హిందూ ఆలయాలను ఆమెగానీ, జగన్‌తో కలిసి జంటగాగానీ వెళ్లిందే లేదు. అలాంటిది.. తాడేపల్లి నివాసంలోనే తిరుమల ఆలయం సెట్టింగును రూ.కోట్ల ఖర్చుతో నిర్మింపజేయడం, సంక్రాంతి రోజు అక్కడ పూజాకార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనడం సొంత వైసీపీ పార్టీ వర్గాలనే ఆసక్తికి గురిచేస్తోంది. దీంతో రాజకీయ సంక్రాంతి పర్వంలో.. ఎన్నికల భక్తిని భారతీరెడ్డి ప్రదర్శించారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిజానికి, ఉగాది, సంక్రాంతులను తెలుగు సంప్రదాయాలను అనుసరించి జగన్ దంపతులు ఏటా జరుపుతున్నారు. అయితే, ఇంత అట్టహాసం గతంలో ప్రదర్శించలేదు. ముగ్గులు, రంగులతో నివాస పరిసరాలను ముస్తాబు చేసేవారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిర్వహించే గోశాలను సందర్శించి గోవులను తాకి వాటికి ఆహారం అందించేవారు. సాంస్కృతిక కార్యక్రమాలను కలిసి తిలకించేవారు. ఈసారి మాత్రం.. ఆలయ సెట్టింగులు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రతిబింబించేలా రైతు భరోసా కేంద్రం తదితర నమూనాలను జగన్ దంపతులు నడిచే దారి పక్కన ఏర్పాటుచేశారు. ప్రభుత్వ ప్రముఖులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమూనా ఆలయంలో జగన్ దంపతుల పూజలు, భార్యకు కుంకుమ దిద్దుతున్న జగన్

దర్శించాలంటే చెంతనే గుడులెన్నో..

జగన్ దంపతులు హిందూ ఆలయంలో పూజలు చేయాలనుకుంటే ఆయన నివాసానికి కూతవేటు దూరంలో వెంకటాయపాలెంలో టీటీడీ నిర్మించిన వెంకటేశ్వర ఆలయం ఉంది. ఆయన ఇంటి చుట్టుపక్కల కూడా అనేక ఆలయాలున్నాయి. కావాలంటే అక్కడ పూజలు చేయొచ్చు. కానీ, తన నివాసంలోనే పెద్ద గుడిని నిర్మించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందుకు ప్రభుత్వ సొమ్మునే వాడి ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో జగన్ తన నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా ప్రకటించాక 32 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ముతో సెక్యూరిటీ ఏర్పాట్లు చేశారు.

అసాంతం జగన్ గానమే..

ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన సంక్రాంతి సంబరాలు తెలుగువారి తొలి పండగను జరుపుకొన్నట్టు కాకుండా.. జగన్ సొంత డబ్బా కార్యక్రమంలా మారిపోయింది. సంక్రాంతి అంటేనే కళలు, రంగవల్లులు, సంప్రదాయ నృత్యాలు, తొలి పండగ విశిష్టతను తెలిపే సాహిత్య రూపాల ప్రదర్శన. కానీ, తాడేపల్లిప్యాలెస్‌లో సంబరాలు జగన్ భజన, వ్యక్తిగత కీర్తిగానాలతో నిండిపోయాయి. తెలంగాణ నుంచి మిట్టపల్లి సురేందర్, నల్లగొండ గద్దర్ వంటి కవులు, కళాకారులను ఈ కార్యక్రమం కోసం రప్పించారు. జగన్‌ను పొగడటంతోనే దాదాపుగా సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిపోయాయి.

ఆ.. ఖర్చెవరిది?

సంబరాలు సరే, ఈ ఏర్పాట్లకయిన కోట్లాది రూపాయల ఖర్చు ఎవరిది? ఇల్లు సీఎం జగన్‌ది. అక్కడ ఎలాంటి సెట్టింగ్‌లు, కళాఖండాలు ఏర్పాటు చేసినా ఖర్చు జగన్ సొంతంగా భరించాలి. కానీ ఆయన రూపాయి కూడా భరించే టైపుకాదని పదవిలోకి వచ్చిన తొలి రోజుల్లోనే తేలిపోయింది. అంటే, ప్రభుత్వ ఖర్చుతో ఆయన తన నివాసంలో సంక్రాంతి సంబరాలు జరిపారని భావించాల్సి వస్తోంది. సాధారణ పండుగ సంబరాలయితే పర్వాలేదు. కానీ కోట్లాది రూపాల ఖర్చుతో ఏర్పాటు చేసిన సంబరాలు కావడంతోనే ఈ ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రముఖ డిజైనర్లతో జగన్ ఇంటిలో ఓ ఆలయమే నిర్మించారు. ఇది నిజమైన ఆలయమా? లేక సంబరాల కోసం ఏర్పాటు చేసిన సెట్టింగ్‌నా అన్నది నిర్ధారణ కావాల్సి ఉన్నది. అయితే ఇందుకోసం కోటిన్నర రూపాయలపైనే ఖర్చుపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన డిజైనర్లతో అద్భుతమైన రీతిలో ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన మేకింగ్ వీడియో ఎక్స్, ఇన్‌స్టాల్లో చక్కర్లు కొడుతోంది. నేరుగా జగన్ నివాసంలోకి వెళ్లే సెక్యూరిటీ చెక్‌పాయింట్ నుంచి వర్క్ చేస్తోన్న విజువల్స్ ఆలయం రూపుదిద్దుకున్న తర్వాత చివరి స్టిల్స్ వరకు అందులో ఉన్నాయి. సంక్రాంతి సంబరాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోల్లోనూ కృత్రిక కళాఖండాలు, ఆలయ నమూనాలు కనిపిస్తున్నాయి.

జీవోలో 'తాడేపల్లి' మాయం

ఆర్అండ్ బీ శాఖ పరిధిలోని బిల్డింగ్స్ విభాగం ఇచ్చిన జీవోల వివరాలను 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. సీఎం క్యాంపు ఆఫీసు పేరిట ఖర్చును కాస్తా వివిపీ అరేంజ్‌మెంట్స్‌గా అందులో చూపిస్తున్నారు. ఎక్కడా తాడేపల్లి క్యాంప్ కార్యాలయం అన్న పదం వాడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పుడు గుడి నిర్మాణం కూడా ఇదే పద్ధతిలో చేసి ఉంటారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


తాడేపల్లిలో తిరుమల ఆలయ సెట్టింగ్

దేవుణ్ణే రప్పించారు..

ఎంతటి రాజు అయినా దర్శనం కోసం ఆలయానికి వెళతాడు. స్వామిని సేవించి తన కుటుంబానికి, రాజ్య ప్రజలకు శుభం కలగాలని పూజలు జరుపుతాడు. కానీ, జగన్ తీరే వేరు. దేవుని వద్దకు తాను వెళ్లడం కాదు.. దేవుడే తన దగ్గరకు రావాలి అన్నట్టు జగన్ వ్యవహార శైలి కనిపించింది. రాష్ట్రంలోని అన్నవరం సత్యనారాయణ స్వామి, బెజవాడ దుర్గమ్మ, విఘ్నేశ్వర విగ్రహ నమూనాలను తన నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేయించారు. సతీమణి భారతీరెడ్డితో కలిసి అక్కడ పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు, ఈవోలను ఈ సమయానికి అక్కడికే పిలిపించారు.

లోకం తీరు



హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం పెంపును పరిశీలించండి

» కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



న్యూఢిల్లీ, జనవరి 14: హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు చెల్లించే పరిహారాన్ని ప్రతియేటా పెంచే విషయాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మోటారు వెహికల్స్ చట్టం-1988 ప్రకారం హిట్ అండ్ రన్ సంఘటనల్లో మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ.2 లక్షలుగానీ, కేంద్రం నిర్ణయించిన మేరకు అంతకన్నా ఎక్కువ మొత్తాన్నిగానీ చెల్లించాల్సి ఉంటుంది. అదే గాయపడ్డ వారికి రూ.50 వేలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పరిహారాన్ని పెంచే ప్రతిపాదనను పరిశీలించాలని జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్‌ల ధర్మాసనం ఆదేశించింది. దీనిపై ఎనిమిది వారాల్లో సమాధానం ఇవ్వాలంటూ తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది.

సుప్రీంకోర్టుకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ అందించిన నివేదిక ప్రకారం 2016లో 55,942 హిట్ అండ్ రన్ కేసులు నమోదు కాగా, 2022లో 67,387 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఈ అయిదేళ్ల కాలంలో హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో మరణించిన వారిలో 660 మంది కుటుంబాలకు, 113 మంది గాయపడ్డ వారికి పరిహారం అందింది. రూ.1.84 కోట్లు మాత్రమే పరిహారం కింద చెల్లించారు. జరిగిన ప్రమాదాలకు తగ్గట్టుగా పరిహారం చెల్లించలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరిహారం లభిస్తుందన్న విషయమై బాధితులకు అవగాహన కలిగించాలని పోలీసులకు సూచించింది. కాలం గడిచే కొద్దీ రూపాయి విలువ తగ్గుతున్నందున ప్రతియేటా నష్ట పరిహారాన్ని పెంచే విషయాన్ని పరిశీలించాలని ప్రభుతాన్ని కోరింది. పరిహారం చెల్లింపు కోసం గతంలో సొలేషియం స్కీం-1989 ఉండేది. దానిలో మార్పులు చేసి 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్స్ స్కీం తీసుకొచ్చింది. దాని ప్రకారం ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీని నెల రోజుల్లో గుర్తించకుంటే ఆ విషయాన్ని పోలీసులు లిఖితపూర్వకంగా బాధితులకు తెలియజేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా బాధితులు ప్రభుత్వం నుంచి పరిహారం కోసం దరఖాస్తు చేసుకునే వీలుంది. దీని అమలు కోసం జిల్లా స్థాయి కమిటీలు, కేంద్రం స్థాయిలో స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ కమిటీలు సక్రమంగా సమీక్షలు నిర్వహించడం లేదని ధర్మాసనం గుర్తించింది. ఆ పథకం అమలుకు నిబంధనల్లో తగిన సవరణలు చేయాలని కూడా అభిప్రాయపడింది.


రాహుల్ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో షర్మిల, రఘువీరా, జేడీ శీలం

ఈ వారమే షర్మిలకు పీసీసీ పగ్గాలు!

న్యూఢిల్లీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తర్వాత ఏ రోజైనా షర్మిలకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. మణిపూర్‌లో ఆమెకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 17న పార్టీ నేత మధుసూదన్ మిస్త్రీ ఆధ్వర్యంలో అమరావతిలో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరుగుతున్నందువల్ల ఈ లోపే షర్మిలకు పీసీసీ పగ్గాల అప్పగింతపై పార్టీ నిర్ణయం ప్రకటించనుందని ఈ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో కనీసం 15 నుంచి 20 సీట్లు గెలవడం లక్ష్యంగా పెట్టుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయినా కింగ్‌మేకర్ పాత్ర పోషించేలా పనిచేయాలని పార్టీ రాష్ట్ర నేతలకు ఢిల్లీ పెద్దలు దిశానిర్దేశం చేశారు. రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏపీ నేతలు కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, జేడీ శీలం, షర్మిల తదితరులు మణిపూర్‌కు వెళ్లారు. సభ పూర్తి కాగానే రాహుల్ బస్సులో జోడో యాత్రను ప్రారంభించారు. థౌబాల్ ప్రాంతంలో స్థానికులతో టీ తాగుతూ ముచ్చటించారు. బీఎస్పీ నుంచి సస్పెండైన డానిష్ అలీ కూడా యాత్రలో పాల్గొనడం విశేషం.

పేరుకే రామ జపం.. లోపల కత్తులు

మతాన్ని రాజకీయాలతో కలిపి ప్రజల్ని రెచ్చగొట్టటమే బీజేపీ విధానం.. మోదీకి షికారుకు టైమ్ ఉంటుంది

» మణిపూర్ లో మళ్లీ శాంతిని నెలకొల్పుతాం: రాహుల్

» 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం

థౌబాల్, జనవరి 14: బీజేపీది పేరుకే రామ జపం అని లోపల మాత్రం ఆ పార్టీ నేతలు కత్తులు పెట్టుకుంటారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మతాన్ని రాజకీయంతో కలిపి ప్రజలను రెచ్చగొట్టటమే బీజేపీ విధానమన్నారు. మణిపూర్‌లోని థౌబాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగసభను ఉద్దేశించి ఖర్గే ప్రసంగించారు. 'మోదీకి సముద్రంపై షికారుకెళ్లే సమయం ఉంటుంది. రామ్ రామ్ అంటూ జపం చేయటానికి సమయం ఉంటుంది. కానీ, హింసాకాండతో అట్టుడికిన మణిపూర్‌కు వచ్చి బాధితుల కన్నీళ్లు తుడిచే సమయం మాత్రం ఉండదు' అని దుయ్యబట్టారు. అందరిలోనూ దైవభక్తి ఉంటుందని, కానీ, బీజేపీ మాత్రమే ఓట్ల కోసం దైవభక్తిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. సామాజిక న్యాయం, లౌకికవాదం, సమానత్వం అనే సిద్ధాంతాలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. ఫాసిస్టు శక్తులతో పోరాడి దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టారని తెలిపారు. నిరుద్యోగులు, రైతుల హక్కుల కోసం, అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరుస్తూ ఈ యాత్ర సాగుతుందన్నారు. శాంతి సందేశాన్ని ఇంటింటికీ వ్యాపింపజేసే పార్టీకి నాయకుడినైనందుకు గర్విస్తున్నానని ఖర్గే తెలిపారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. మణిపూర్ వాసుల బాధలు తనకు తెలుసని, రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను తిరిగి నెలకొల్పుతామని, అందుకే యాత్రను ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. 'హింసాకాండలో కొన్ని లక్షల మంది నష్టపోయారు. కానీ, మిమ్మల్ని ఓదార్చటానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇక్కడికి రాలేదు. బహుశా మోదీకి, బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు మణిపూర్ భారత్‌లో అంతర్భాగం కాదేమో. అందుకే మీ దుఃఖం వారికి దుఃఖం కలిగించలేదు. కానీ, మేం మణిపూర్ ప్రజలు ఎంతటి బాధలను, ఆవేదనను, విషాదాన్ని అనుభవించారో అర్థం చేసుకోగలం. మణిపూర్ అంటేనే శాంతి, సౌభ్రాతృత్వం, ఆప్యాయత.. వాటిని తిరిగి ఈ రాష్ట్రంలో నెలకొల్పుతాం' అని హామీ ఇచ్చారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర 67 రోజులపాటు కొనసాగనుంది. 15 రాష్ట్రాలకు చెందిన 110 జిల్లాల్లో 6,713 కి.మీ.ల మేర ఈ యాత్ర సాగుతుంది. మార్చి 20న ముంబైకి చేరటంతో యాత్ర ముగుస్తుంది.



యుద్ధ స్మారకానికి రాహుల్ నివాళి

ఆదివారం మధ్యాహ్నం రాహుల్ విమానంలో రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌కు చేరుకోగానే కాంగ్రెస్ మద్దతుదార్లు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రాహుల్ థౌబాల్ జిల్లాలోని ఖాంగ్జామ్ యుద్ధ స్మారకం వద్దకు వెళ్లి, 1891 నాటి ఆంగ్లో-మణిపూర్ యుద్ధ అమరులకు నివాళి అర్పించారు. బ్రిటిష్ సేనల్ని ఎదిరించి ప్రాణాలు విడిచిన ఒకప్పటి మణిపూర్ రాజ్య సైనికులకు నివాళిగా ఈ స్మారకాన్ని నిర్మించారు.

కాంగ్రెస్‌కు మిలింద్ దేవ్‌రా గుడ్‌బై

» షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిక
» అభివృద్ధి పథంలో నడిచేందుకేనని వెల్లడి
» పారిశ్రామిక వేత్తలను జాతి వ్యతిరేకులనే
» ముద్రవేసిందంటూ కాంగ్రెస్‌పై ఆరోపణ
» హస్తంతో 55 ఏళ్ల అనుబంధానికి కటీఫ్
» జోడో న్యాయ యాత్రకు ముందు రాజీనామా
» యాత్రపై మోదీ కుట్ర: కాంగ్రెస్ విమర్శ

ముంబై, జనవరి 14: సార్వత్రిక ఎన్నికలకు ముందు మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా(47) ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిపోయారు. అభివృద్ధి పథంలో నడిచేందుకే తాను కాంగ్రెస్‌ను వీడినట్టు దేవ్‌రా చెప్పారు. అయితే.. దేవ్‌రా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఏకంగా 55 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం అనుబంధం ఉండడం విశేషం. పైగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభానికి ముందు జరిగిన ఈ ఘటనను ప్రధాని మోదీ కుట్రగా ఆ పార్టీ అభివర్ణించింది. యాత్రకు సంబంధించిన వార్తలను కనుమరుగు చేసి, దేవ్‌రా రాజీనామా వార్తలు ప్రముఖంగా ప్రసారం కావాలనే కుట్ర పన్నారని ఆరోపించింది. అయితే, దేవ్‌రా రాజీనామా వ్యవహారం యాత్రపై ప్రభావం చూపదని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. ముంబై దక్షిణం లోక్‌సభ నియోజకవర్గం మాజీ ఎంపీ అయిన దేవ్‌రా ఆదివారం ఉదయమే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఎక్స్‌లో పేర్కొన్నారు. "ఈరోజు నా రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్య అధ్యాయం ముగిసింది. కాంగ్రెస్‌పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పించాను. ఈ పార్టీతో మా కుటుంబానికి ఉన్న 55 ఏళ్ల అనుబంధం ముగిసింది. నాకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకు కృతజ్ఞతలు" అని దేవ్‌రా పేర్కొన్నారు. అనంతరం ఆయన స్థానిక సిద్ధి వినాయకస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలుచేశారు. ఆదివారం మధ్యాహ్నం సీఎం ఏక్‌నాథ్ షిండే అధికారిక నివాసం 'వర్ష'లో జరిగిన కార్యక్రమంలో శివసేనలో చేరారు.

కాంగ్రెస్ మారింది: మిలింద్

శివసేన తీర్థం పుచ్చుకున్న తర్వాత సీఎం షిండేతో కలిసి మీడియాతో మాట్లాడిన మిలింద్ దేవ్‌రా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1968లో తన తండ్రి మురళీ దేవ్‌రా చేరిన కాంగ్రెస్‌కు, 2004 నుంచి తాను పనిచేస్తున్న కాంగ్రెస్‌కు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనలు అభివృద్ధి, నిర్మాణాత్మక అంశాలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అలా చేసి ఉంటే.. ఇప్పుడు సీఎం షిండే, తాను కూడా ఇలా బయటకు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. 30 ఏళ్ల కిందటే ఆర్థికసంస్కరణలు తీసుకువచ్చామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ పారిశ్రామివేత్తలపై జాతి వ్యతిరేక ముద్ర వేసిందని దుయ్యబట్టారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకువెళ్లాలో సూచనలు సలహాలు ఇవ్వడం మానేసి, ప్రధాని మోదీని అదేపనిగా తిట్టిపోస్తోందని, ఆయన చేసే ప్రతి పనినీ వ్యతిరేకిస్తోందని అన్నారు.

టికెట్ కోసమే!

దేవ్ రా కాంగ్రెస్‌ను వీడడానికి ముంబై దక్షిణ నియోజకవర్గం టికెట్ కారణంగా కనిపిస్తోంది. గతంలో ఈ నియోజకవర్గం నుంచే ఆయన విజయం దక్కించుకున్నారు. అయితే, ఈ టికెట్‌ను పొత్తులో భాగంగా మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన కేటాయించేందుకు కాంగ్రెస్ సిద్ధపడినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే దేవ్‌రాను కాంగ్రెస్ పార్టీ సంయుక్త కోశాధికారిగా నియమించిందని, వచ్చే ఎన్నికల్లో ఈ టికెట్ ఆయనకు ఇచ్చే ఉద్దేశం లేదని ప్రచారం జరిగింది. గతంలో అవిభక్త శివసేనకు చెందిన అరవింద్ సావంత్ 2014, 2019 ఎన్నికల్లో దేవ్‌రాను దక్షిణ నియోజకవర్గంలో ఓడించారు. ప్రస్తుతం అరవింద్ ఠాక్రే శివసేనలో ఉన్నారు. దీంతో ఈయనకు టికెట్ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కాగా, గతంలో కాంగ్రెస్ పార్టీ ముంబై శాఖకు దేవ్‌రా నేతృత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ కురువృద్ధ నాయకుడు మురళీ దేవ్‌రా తనయుడిగా మిలింద్ గుర్తింపు తెచ్చుకున్నారు.

బీజేపీ క్రీడ: కాంగ్రెస్

దేవ్‌రా రాజీనామాపై ముంబై కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు వర్షా గైక్వాడ్ స్పందిస్తూ.. ఇది దురదృష్ట ఘటన అని పేర్కొన్నారు. మణిపూర్ నుంచి భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభమవుతున్న సమయంలో ఇలా చేయడం తగదని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోల్ స్పందిస్తూ.. జోడో యాత్రకు ముందు బీజేపీ ఆడిస్తున్న రాజకీయ క్రీడగా విమర్శించారు. దేవ్‌రా రెండు సార్లు ఓడిపోయిన నేత అని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ ముక్కలైపోయిందని బీజేపీ ప్రచారం చేస్తోంది. కానీ, రెండు సార్లు ఓడిపోయిన నేతను చేర్చుకుని భారత్ జోడో న్యాయ యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ విన్యాసాలు విజయవంతం కావు" అని నానా పటోల్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం అశోక్ చవాన్ స్పందిస్తూ.. మిలింద్ దేవ్‌రా ముంబై దక్షిణం నుంచి పోటీ చేయాలని అనుకున్నారని, అయితే.. కూటమి మాత్రం సిట్టింగ్ ఎంపీ(అరవింద్ సావంత్)కి ఇబ్బంది కలగకూడదని భావిస్తోందని పేర్కొన్నారు.

3 పార్టీలు నా వెంట పడుతున్నాయి

» ప్రధానిని విమర్శిస్తున్నానని లోక్‌సభ సీటిస్తారట!

» కేరళలో సినీ నటుడు ప్రకాశ్ రాజ్



కోజికోడ్, జనవరి 14: ప్రధాని మోదీని విమర్శిస్తుంటాను గనుక.. రానున్న ఎన్నికల్లో తనకు లోక్‌సభ సీటు ఇస్తామని మూడు పార్టీలు తన వెంట పడుతున్నాయని సినీ నటుడు ప్రకాశ్ రాజ్ చెప్పారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాను ఆ ఉచ్చులో పడదలుచుకోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పార్టీలు తన వెంట పడ్డాయని.. దీంతో తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశానన్నారు. ఆ పార్టీలు ప్రజల కోసమో.. తన భావజాలం నచ్చో.. రాలేదని చెప్పారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలకు మాట్లాడే సత్తా, నిజాయితీ లేదన్నారు. అందుకే వాటికి అభ్యర్థులూ దొరకడం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీని తాను ద్వేషించనని.. ఆయనేమీ తన మామ కాదని, ఆయనతో తనకు ఆస్తి తగాదాలూ లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తానో పన్ను చెల్లింపుదారునని.. ఆయన జీతం తాను చెల్లించానని, ఆయన మాత్రం తనను సేవకుడిగా చూస్తున్నారనేదే తన వాదన అన్నారు. "అది కుదరదు.. ప్రధానిగా ఆయన తన బాధ్యత నెరవేర్చాలి" అని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరు, ప్రజల మనస్సుల్లో ఉన్నదే తాను పోస్టు చేస్తున్నానన్నారు. ఇది తన మన్ కీ బాత్ కాదని.. అందరి మన్ కీ బాత్.. అన్నారు.


పట్టు చీరపై జైశ్రీరామ్ పేరును చిత్రించిన దృశ్యం

అయోధ్య సీతమ్మకు ధర్మవరం పట్టుచీర

» చీర అంచుల్లో రామాయణ ఘట్టాలు

» చీరపై 13 భాషల్లో జైశ్రీరామ్

ధర్మవరం, జనవరి 14: అయోధ్య సీతమ్మకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ధర్మవరం పట్టు చీర ఇది. 180 అడుగుల పొడవు, 40 అంగుళాల వెడల్పుతో ఉన్న ఈ చీరపై 13 భాషల్లో జై శ్రీరామ్ నినాదం... చీర అంచుల్లో రామయాణంలోని 400 ఘట్టాల చిత్రీకరణ.... ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న ఈ పట్టు చీరను శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన నాగరాజు అనే చేనేత కార్మికుడు రూపొందించారు. చీర తయారీకి మల్బరీ దారంతోపాటు కాటన్, లెనిన్, గద్వాల్, సిలికాన్, కొర్నియా తదితర రకాల పట్టు పోగులను వినియోగించారు. రూ.5 లక్షల ఖర్చుతో నేసిన ఈ పట్టు చీర పూర్తి కావడానికి 4 నెలలు పట్టింది. సీతారాముల పట్ల ఉన్న భక్తితోనే పట్టుచీరను రూపొందించానని, ఈనెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అమ్మవారికి కానుకగా అందజాయాలనుకున్నానని నాగరాజు తెలిపారు. అయోధ్య రామజన్మభూమి కమిటీ పెద్దలను సంప్రదించి, వారి సూచన మేరకు చీరను రూపొందించానన్నారు.


సీతమ్మ కోసం రూపొందించిన పట్టు చీరను చూపుతున్న చేనేత నాగరాజు

విమానాలకు మంచు దెబ్బ!

పలు విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం.. ఢిల్లీలో 10 విమానాల దారి మళ్లింపు



బెంగళూరు, చెన్నై, శంషాబాద్, (ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ, జనవరి 14: దట్టమైన పొగమంచు ఆదివారం దేశవ్యాప్తంగా విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, వరాణసీ విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగించింది. పొగమంచు కారణంగా తక్కువ దృశ్యమాన పరిస్థితులు ఏర్పడి రన్‌వే కనిపించలేదు. దీంతో ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు అంతర్జాతీయ విమానాలు సహా.. మొత్తం పది విమానాలను జైపూర్‌కు దారి మళ్లించినట్టు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణం కారణంగా విదేశీ సర్వీసులతోపాటు దాదాపు 100 విమానాలు ఆలస్యమయ్యాయని, కొన్ని రద్దయ్యాయని తెలిపారు. ఆదివారం ఢిల్లీతోపాటు ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. అనేక చోట్ల విజిబులిటీ స్థాయి సున్నా మీటర్లకు పడిపోయింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి కెనడాలోని వాంకోవర్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం ఏఐ185ను ప్రయాణికులు ఎక్కిన తర్వాత రీషెడ్యూల్ చేశారు. దీంతో ప్రయాణికులు విమానం లోపలే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వరాణసీలో పొగమంచు కారణంగా నాలుగు విమానాలను రద్దు చేసినట్టు ఆకాశ ఎయిర్ ప్రకటించింది.

బెంగళూరులో 34 విమానాలు ఆలస్యం

బెంగళూరుకు అనుబంధంగా ఉండే దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా ఆదివారం విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. తెల్లవారుజామున పొగమంచు కప్పేయడంతో 2 గంటల నుంచి విమానాలు టేకాఫ్ కాలేదు. 34 విమానాలు ఎయిర్‌పోర్టులోనే గంటల తరబడి నిలిచిపోయాయి. సంక్రాంతి వేళ సొంతూళ్లకు వెళ్లేందుకు బయల్దేరిన ప్రయాణికులు విమానాశ్రయంలోనే పడిగాపులు పడ్డారు.

చెన్నై నుంచి హైదరాబాద్‌కు నాలుగు విమానాలు

చెన్నై మీనంబాక్కం ప్రాంతంలో భోగిమంటల కారణంగా వాయుకాలుష్యం ఏర్పడింది. భోగి మంటలలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, పాత టైర్లను కాల్చడంతో నగరంలో మునుపెన్నడూ లేనంతగా దట్టమైన పొగలు అన్ని వైపులా వ్యాపించాయి. ఆ పొగలకు మంచుకూడా తోడై.. మీనంబాక్కం విమానాశ్రయం రన్‌వేలను పొగమంచు దట్టంగా కప్పేసింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం వేకువజాము సింగపూర్ నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం, లండన్ నుంచి వచ్చిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం, శ్రీలంక నుంచి వచ్చిన మరో విమానం, ఢిల్లీ నుంచి వచ్చిన విమానం ఇక్కడ ల్యాండింగ్ కాలేకపోయాయి. చివరకు వాటిని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. అలాగే.. మస్కట్, దుబాయ్, కువైత్, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు నుంచి రావాల్సిన 20 విమానాలు, ఇక్కడి నుంచి ఇతర నగరాలకు వెళ్లాల్సిన విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి.



సత్తెనపల్లి గాంధీ బొమ్మ సెంటర్‌లో భోగి వేడుకల్లో నృత్యం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

మళ్లీ చిందేసిన సంబరాల రాంబాబు..!

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు మంత్రి అంబటి రాంబాబు... సంబరాల రాంబాబుగా మారిపోతారు. మంత్రి హోదాను సైతం పక్కనబెట్టి రోడ్డుపై డ్యాన్స్‌లు చేస్తూ కనిపిస్తారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. "అంబటి రాంబాబు... సంబరాల రాంబాబు... అంబటి రాంబాబు..." అనే ప్రత్యేక పాటకు స్టెప్పులు వేశారు. గతేడాది కూడా అంబటి ఇలాగే సంక్రాంతి సంబరాలలో చేసిన డాన్స్ వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే.

- సత్తెనపల్లి

టీడీపీ, జనసేన కూటమికి 155 సీట్లు!

▸▸ జగన్ స్వయంకృతాపరాధంతోనే ఓటమి: రఘురామరాజు

భీమవరం, జనవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన కూటమికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 155 సీట్లు లభిస్తాయని నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయంకృతాపరాధం వల్లే ఓడిపోతున్నారన్నారు. గతంలో తాను నిర్వహించిన సర్వేలో తెలుగుదేశం-జనసేన కూటమికి 135 సీట్లు లభిస్తాయని చెప్పానని, ఇప్పు డు షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల రాయలసీమలో వైసీపీకి అధికంగా నష్టం వాటిల్లనుందని పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో కొత్త సర్వే చేస్తామని, వాటి ఫలితాలు కూడా వెల్లడిస్తామని చెప్పారు.

స్కిల్ కేసులో రేపే సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనపై సీఐడీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో తీర్పును మంగళవారం కోర్టు విచారణాంశాల్లో చేర్చారు. నిరుడు సెప్టెంబరు 23న చంద్రబాబు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు విన్న జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం అక్టోబరు 17న తీర్పు రిజర్వు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తీసుకున్న నిర్ణయాలపై విచారణ 2021 డిసెంబరులో ప్రారంభించినందున అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ఆయనకు వర్తిస్తుందని ఆయన తరఫు సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. గవర్నర్ అనుమతి తీసుకోకుండా ఈ సెక్షన్‌ను ఉల్లంఘించి ఎఫ్ఐఆర్ నమోదుచేశారని, అందువల్ల చంద్రబాబు అరెస్టు అక్రమమని స్పష్టం చేశారు. ఆయన హయాంలో రూ.371 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలను తోసిపుచ్చారు. అయితే ఈ కేసులో సీబీఐ 2017లోనే విచారణ ప్రారంభించిందని.. అందుచేత అప్పట్లో అమల్లో లేని సెక్షన్ 17ఏ మాజీ సీఎంకు వర్తించదని ఏపీ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సర్వోన్నత న్యాయస్థానం ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తే చంద్రబాబుపై జగన్ సర్కారు పెట్టిన ఇతర కేసులూ రద్దవుతాయి.

ప్రాణాలు తీసిన గాలిపటం దారం..!

▸▸ పతంగి మాంజా మెడకు తగిలి ఆర్మీ ఉద్యోగి దుర్మరణం



కాగితాల కోటేశ్‌రెడ్డి (ఫైల్)

విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన ఆర్మీ ఉద్యోగి ఒకరు.. హైదరాబాద్‌లో ద్విచక్రవాహనంపై వెళుతుండగా గాలిపటం మాంజా దారం మెడకు చుట్టుకుని మృతిచెందారు. విశాఖలోని పెదవాల్తేరు ప్రాంతం కాగితాలవీధి (నాగమయ్యపుట్ట)కి చెందిన కాగితాల కోటేశ్‌రెడ్డి (30) ఆర్మీలో పనిచేస్తున్నారు. ఢిల్లీ నుంచి నెల క్రితం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. కేపీహెచ్‌బీ కాలనీలో తన సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం విధులు ముగిశాక ద్విచక్రవాహనంపై కేపీహెచ్‌బీ కాలనీకి వెళ్తున్న సమయంలో మెహదీపట్నం వద్ద లంగర్‌హౌస్ ఫ్లైఓవర్ దిగుతుండగా గాలిపటం మాంజా దారం మెడకు చుట్టుకుంది. దీంతో నరాలు తెగిపోయి తీవ్ర రక్తస్రావంతో అక్కడిక్కడే మృతిచెందారు. ఆయనకు రెండున్నరేళ్ల క్రితం విశాఖలోని మద్దిలపాలేనికి చెందిన ప్రత్యూషతో వివాహమైంది. వారికి ఏడాది వయస్సున్న కుమార్తె భువిక ఉంది. ఢిల్లీ నుంచి బదిలీ కావడంతో ఇల్లు తీసుకునే వరకూ భార్య, కుమార్తెను విశాఖలోనే ఉంచి, తాను హైదరాబాద్‌లోని సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. కోటేశ్‌రెడ్డి భౌతికకాయానికి సోమవారం ఇక్కడ సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన స్నేహితుడు శ్రీనివాస్ తెలిపారు.

'బరి' తెగింపు!



ఆకివీడులో పందేలు తిలకిస్తున్న మహిళలు

కోస్తాంధ్ర జిల్లాల్లో కోడి పందేలు, గుండాటల జోరు.. వైసీపీ నేతల కనుసన్నల్లోనే పందేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సంక్రాంతి ఉత్సవాల్లో పలు జిల్లాల్లో కోడి పందేల పోలీసుల సాక్షిగా జోరుగా హుషారుగా సాగుతున్నాయి. పందెం రాయుళ్లు జాతరలా తరలివస్తూనే ఉన్నారు. మెజారిటీ బరులు వైసీపీ నేతల అండతో ఏర్పాటు కావడంతో ఎలాంటి ఆంక్షలూ ఆటంకాల్లేకుండా పందేలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేసి కోట్లలో పందేలు కాస్తున్నారు. కొన్ని బరులు 50, 100 ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో.. భారీ టెంట్లతో.. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో జరుగుతున్నాయి. పందేలకు వచ్చే జనంతో బరుల వద్ద కార్లు, బైక్లు వందలాదిగా కనిపిస్తున్నాయి. పందెం డబ్బులు లెక్కబెట్టడానికి సమయం కూడా లేక.. ఏకంగా నోట్ల కౌంటింగ్ మిషన్లు పెట్టారు. సంక్రాంతి తొలిరోజు భోగినాడు అన్ని బరుల వద్ద కోడి పందేలతోపాటు గుండాట, పేకాటలు జోరుగా సాగి లక్షలు చేతులు మారాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్టులకు.. అక్కడి నుంచి బరుల వద్ద మద్యం ఏరులై పారింది. ముఖ్యంగా ఉమ్మడి గోదారి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో జరిగిన పందేలకు తెలంగాణ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఔత్సాహికులు వచ్చి లక్షల్లో పందేలు కాసి ఎంజాయ్ చేశారు. కొన్ని బరుల వద్ద ప్రవేశ రుసుముగా వెయ్యి పైనే టికెట్ పెట్టి లోనికి అనుమతిస్తున్నారు. పండగ మూడు రోజులూ పందేలు, గుండాటలు ఉంటాయి కనుక.. రేయింబవళ్లూ నిరాటంకంగా నిర్వహించేందుకు అన్ని చోట్లా ఫ్లడ్ లైట్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఓవైపు సంక్రాంతి ఉత్సవాల్లో కోడి పందేలు, ఇతర జూదాల నిర్వహణను అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశించినా అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు.

బరులను ప్రారంభించిన వైసీపీ ఎమ్మెల్యేలు

కోనసీమ జిల్లాలోని మలికిపురం, లక్కవరంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోడిపందేలను, గుండాటలను ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెం మండలం వెదిరేశ్వరం, రావులపాడుల్లో బరులను ప్రారంభించి పందేల్లో పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో కోడి పందేలను వైసీపీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆత్రేయపురం మండలం వసంతవాడ, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో జరిగిన కోడిపందేలను తిలకించారు. అల్లవరం మండలం గోడిలోని బరుల్లో కోడి పందేలను వైసీపీకి చెందిన అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు వీక్షించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ వైసీపీ ప్రజాప్రతినిధుల ఆదేశాలతో పోలీసులు షరా 'మూలాలు'గా స్టేషన్లకే పరిమితమయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా వందకు పైగానే కీలక బరులు ఏర్పాటయ్యాయి. తొలి రోజు సుమారు రూ.30 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు సమాచారం. బరుల వద్ద సీఎం జగన్‌తో పాటు ఆయా ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లి, చెయ్యేరుల్లో మెగా బరులు ఏర్పాటు చేశారు. తొలి రోజు 20కిపైగా పందేలు జరగగా, లక్షల రూపాయలు చేతులు మారాయి. అమలాపురం, రామచంద్రపురం, మండపేటలో ఐదేసి బరుల వరకు ఏర్పాటు చేశారు. కాట్రేనికోన మండలం వేట్లపాలెంలోను, అమలాపురం రూరల్ మండలం కామనగరువు శివారు ఢిల్లీ పబ్లిక్ స్కూలు వద్ద రెండు బరుల్లోను యువకుల మధ్య ఘర్షణ తలెత్తి ఉద్రిక్తతలకు దారితీసింది.



పందెం డబ్బులు లెక్కబెట్టడానికి కౌంటింగ్ మిషన్



బాపట్లలో పోలీసులకు సవాల్

బాపట్ల జిల్లాలో అధికారపార్టీ నేతలు ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేసి పోలీస్‌లకు సవాల్ విసిరారు. దీంతో కోడి పందేలను కట్టడి చేస్తామని సంక్రాంతి పండగకు పదిరోజుల ముందు నుంచే బాపట్ల జిల్లా పోలీసులు హడావుడి చేసినా తీరా ఆ సమయం వచ్చేసరికి చేతులెత్తేశారు. కొల్లూరు మండలం పెసర్లంక శివారులో వైసీపీ నేతల సారథ్యంలో కోడి పందేలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఏకంగా తాత్కాలిక టోల్ ఫీజు వసూలుకు తెర లేపారు. ప్రశ్నించిన వారిపై కూడా దాడికి తెగబడ్డారు. భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద జోరుగా కోడి పందేలు నిర్వహించారు. పల్లెకోన, ఇంటూరు, వరాహపల్లి ఇలా తీర ప్రాంత పరిధిలో పలు చోట్ల యథేచ్ఛగా కోడి పందేలు జరిగాయి. రేపల్లె నియోజకవర్గం పరిధిలోని నిజాంపట్నంలో పెద్ద ఎత్తున బరులు ఏర్పాటు చేయడం పొరుగు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు తరలివచ్చారు. వేమూరు నియోజకవర్గ పరిధిలో బరులు పెద్ద ఎత్తున రాత్రికి రాత్రే సిద్ధం చేసేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో ప్రధాన రోడ్డు పక్క భారీ బరి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఓ గేటు పెట్టి రూ.1,000 టికెట్ కొనుక్కున్నవారినే లోపలికి అనుమతిస్తున్నారు. కాకినాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో తొలిరోజు వందేసి కోట్లు పైబడి చేతులు మారినట్టు అంచనా. కాకినాడ రూరల్ మండలంలోని సర్పవరం వద్ద భారీ బరి ఏర్పాటు చేయగా, కోడి పందేలపై లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, పెదపాడు, గుడివాకలంక, పత్తికోళ్లలంక, పైడి చింతపాడు, కైకలూరు, కలిదిండి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చాటపర్రు, చాత్రాయి. ముదినేపల్లి మండలంలోని దేవపూడిలో జరిగిన పందేల నిర్వహణలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో పలువురు గాయపడ్డారు.

పశ్చిమలో 200 బరులు..

పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 200 బరుల్లో పందేలు నిర్వహించారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు సంప్రదాయ డింకీ కోడి పందేలను ప్రారంభించారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు పందేల్లో పాల్గొన్నారు. ఉండి నియోజకవర్గం పెదఅమిరంలో ఒక్కో పందానికి రూ.50 లక్షల వంతున కాశారు. ఆ ఒక్క బరిలోనే కోట్లు చేతులు మారాయి. సీసలిలోనూ బరిలోకి కోడి పుంజు తెచ్చుకోవాలంటే ఒక్క పందెంలోనే రూ.25 లక్షలు బెట్టింగ్ వేయాలి. పెదఅమిరంలో పందాల్లో పాల్గొనడానికి ప్రవేశ టికెట్‌ను నిర్ణయించారు.



నారావారిపల్లెలో లోకేశ్

నారావారిపల్లెలో చంద్రబాబు సంక్రాంతి వేడుకలు

చంద్రగిరి, జనవరి 14: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్ తమ స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల టీడీపీ నేతలు వారికి ఘనస్వాగతం పలికారు. బంధుమిత్రులను చంద్రబాబు ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం నారావారిపల్లెలో చంద్రబాబు ఇంటివద్ద భోగిమంటలు వేశారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాల ఉత్తర్వులను చంద్రబాబు మనవడు దేవాన్ష్‌తో పాటు నందమూరి రామకృష్ణ, స్థానిక నేతలు భోగి మంటల్లో వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర, దేవాన్ష్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల వద్ద పూజలు, కులదైవం నాగాలమ్మ, గ్రామదేవత దొడ్డి గంగమ్మకు మొక్కులు తీర్చుకొని, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. మంగళవారం మధ్యాహ్నం తిరుగుపయనం కానున్నారు.

87 రోజులే

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. వచ్చే ఏడాది ఇదే ప్రాంతంలో జనసేన-టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన సంక్రాంతి వేడుకలు నిర్వహించుకుంటామని.. బంగారంలాంటి రాజధానిని నిర్మించుకుంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజధాని అమరావతిలోని మందడం గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'పల్లె పిలుస్తోంది రా.. కదలిరా!' కార్యక్రమంలో టీడీపీ-జనసేన 'భోగి సంకల్పం' తీసుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన ఇరు పార్టీల అధినేతలకు రాజధాని రైతులు, మహిళలు మంగళహారతులు, జయజయధ్వానాలతో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు, పవన్ భోగి మంటల్లో చీకటి జీవోల ప్రతులను వేసి తగలబెట్టారు. ప్రభుత్వం సృష్టించిన అధిక ధరలు, కరెంటు చార్జీలు, నిరుద్యోగ సమస్యలను అగ్నికి ఆహుతిచ్చి భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. రాజధాని మహిళలు వేసిన సంక్రాంతి ముగ్గులను పరిశీలించి వారిని అభినందించారు. సంప్రదాయ చిహ్నాలైన గంగిరెద్దులు, జోడెడ్ల బండిని పరిశీలించారు. చంద్రబాబు నాగలి భుజానికెత్తుకోగా, పవన్ చర్నాకోలను చేబూనారు. మహిళలు చేసిన పొంగళ్లను ఇద్దరూ రుచిచూశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు.

అవిగవిగో మంచి రోజులు..

'రాక్షస వధ ఆయిపోయింది.. సైకో వధ కూడా త్వరలోనే జరుగుతుంది. మంచి రోజులు వస్తున్నాయి.. శుభ గడియలు తలుపు తడుతున్నాయి.. ప్రజల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది' అని చంద్రబాబు చెప్పారు. రాజకీయ హింసను, అక్రమ కేసులను, మోసపు హామీలను, బడుగు, బలహీనవర్గాల ఉసురు తీస్తున్న మదాన్ని.. మొత్తంగా జగన్ అహంకారాన్ని భోగి మంటల్లో తగులబెట్టామని తెలిపారు. 'అమరావతిపై తెచ్చిన చీకటి జీవోలను ఇక్కడే దహనం చేశాం. పేదల పరిపాలనను ఇక్కడి నుంచే ప్రారంభిస్తాం. ఇది నేనూ, పవన్ కల్యాణ్ కలిసి చెబుతున్న మాట.. మన రాజధాని అమరావతే. రాజధాని నిర్మాణంతోపాటు విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి పూర్వ వైభవం తీసుకొస్తాం!. రాతి యుగం పోవాలి.. స్వర్ణయుగం రావాలి..' అని తన సంకల్పం ప్రకటించారు. భోగి రోజున పాత వస్తువులను మంటల్లో వేసి, ఆ మంటల్లో కాచిన నీళ్లతో స్నానం చేసి పాపాలు పోవాలని కోరుకున్నట్లుగా.. ఈ అసమర్థ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలు మంటల్లో వేసి, అది సృష్టించిన సమస్యలు పోవాలని కోరుకున్నామన్నారు. 'అప్పులు తెచ్చి పంచడం కాదు.. సంపద సృష్టించి పంచుతాం. 2047కల్లా ప్రపంచంలో తెలుగువాడు ఎక్కడున్నా నంబర్ వన్ అనిపించుకునేలా చేసేందుకు కృషి చేస్తా. అమరావతిలో పోలీసులు చేసిన అరాచకాలు రాక్షసులు కూడా చేసి ఉండరు. రేపటి రోజున వాళ్లే రైతులకు సెల్యూట్ చేస్తారు.. చేయిస్తా. బాత్‌రూములపై డ్రోన్లు ఎగరేయడం, పాదయాత్రకు వెళ్తే తినడానికి చోటు కూడా ఇవ్వకుండా రోడ్డుమీదకు తోసేయడం వంటి దారుణాలకు తెగించిన ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాలుగేళ్లుగా అమరావతి రైతులు చేస్తున్న పోరాటానికి, ధైర్యానికి హ్యాట్సాఫ్. వారి గెలుపు అమరావతి గెలుపు మాత్రమే కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల గెలుపు. అన్నదాతల త్యాగం వృథా కాదు' అని హామీ ఇచ్చారు. పోలీసులు కూడా సంక్రాంతి సంకల్పం తీసుకోవాలని సూచించారు. వారు ఇకనైనా మారాలని, తమ ఉద్యోగం, కుటుంబం కోసం సంకల్పం తీసుకోక తప్పదన్నారు.

- రాజధానిలో 35 వేల ఎకరాలున్నాయి. అంటే రూ.3 లక్షల కోట్ల సంపద. దానిని జగన్ పాడుబెట్టాడు. ఆ భూమిని వినియోగించుకునే సంపద సృష్టించి ప్రజలకు ఇస్తా. - చంద్రబాబు
- పేరులో రైతును పెట్టుకుని రైతులను ఏమాత్రం లెక్కచేయని పార్టీ వైసీపీ. కౌలు ఇవ్వకుండా రైతులను వేధిస్తుంటే నిర్బంధాలు, ముళ్ల కంచెలు దాటి అమరావతి రైతుల కోసం వచ్చాను. - పవన్ కల్యాణ్

నాలుగేళ్ల కిందట పీడపట్టింది..: పవన్

నాలుగేళ్ల క్రితం ఈ రాష్ట్రానికి పీడ పట్టిందని.. ఆ పీడను ఈరోజున భోగి మంటల్లో తగులబెట్టామని పవన్ చెప్పారు. వచ్చే ఏడాది ఇదే ప్రాంతంలో జనసేన-టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన సంక్రాంతి వేడుకలు నిర్వహించుకుంటామన్నారు. ఇవి విప్లవంతో కూడిన సంక్రాంతి వేడుకలని.. ఈ సంక్రాంతితో క్రాంతులతోపాటు కొత్త కాంతులను తీసుకొస్తామని తెలిపారు. 'టీడీపీ- జనసేన కలవడానికి అమరావతి రైతుల ఆవేదన, ఏడుపే కారణం. భూములిచ్చిన ఆడబిడ్డలకు మేం అండగా ఉంటాం. మీరు ఏ లక్ష్యంతో అయితే పొలాలు ఇచ్చారో ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తాను. వైసీపీ అన్ని వర్గాలనూ మోసం చేసింది. కౌలు రాలేదని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే ముళ్ల కంచెలు దాటి వచ్చాను. టీడీపీ, జనసేన కలువకూడదని వైసీపీ ఎన్నో కుట్రలు పన్నింది.. మేం కలువకుండా ఉంటే మళ్లీ అధికారంలోకి రావచ్చని జగన్ భావించాడు. తిరిగి వైసీపీ వస్తే ఏపీని మరచిపోవడమే. రాష్ట్రం చీకటైపోతుంది. రాష్ట్రం కోసం, ప్రజల కోసం మేం కలిసి నడుస్తున్నాం. జై అమరావతి నినాదంతో పాటు జై ఆంధ్రా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని తెలిపారు.

నిరసన మంటలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రజావ్యతిరేక జీవోల దహనం

▸▸ జీవో ప్రతులను భోగి మంటల్లో వేసిన టీడీపీ

▸▸ ఎస్మా కాగితాలను తగులబెట్టిన అంగన్‌వాడీలు

▸▸ 34వ రోజూ కొనసాగిన అంగన్వాడీ సమ్మె

▸▸ అదేబాటలో ఉపాధ్యాయులు, సీపీఎస్ ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

భోగి మంటల సాక్షిగా వైసీపీ ప్రభుత్వంపై నిరసన మంటలు ఎగసిపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజావ్యతిరేక జీవో కాపీలను టీడీపీ శ్రేణులు భోగిమంటల్లోకి విసిరి దహనం చేశాయి. మరోవైపు 34 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎస్మా చట్టం, జీవో నంబరు 2 ప్రతులను తగులబెట్టారు. జగన్ సర్కార్ పండగపూట తమ పట్ల కనికరం చూపలేదని మండిపడ్డారు. నిరసన శిబిరాల వద్దే ముగ్గులు వేశారు. తమ సమస్యలను ముగ్గుల్లో ప్రస్తావించారు. శాలరీ పెంచి అంగన్వాడీల గుండె మంట మంటలు చల్లార్చు జగనన్నా అంటూ ముగ్గుల్లో రాశారు. అలాగే, ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీచర్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద జీవోల ప్రతులను దహనం చేశారు. జగన్ ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా భోగి మంటల్లో సీపీఎస్, జీపీఎస్ ప్రతులు వేసి దహనం చేశారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొండ సతీష్, చింతగుంట్ల మరియదాస్ కుటుంబ సభ్యులతో కలిసి సీపీఎస్ ప్రతులు, జీపీఎస్ ప్రతులను భోగిమంటల్లో వేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో సంతనూతలపాడులో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కనిగిరిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ప్రజావ్యతిరేక జీవోలను భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. పలు ఇతరచోట్ల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, సమస్యల పరిష్కారం కోరుతూ 34 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా చట్టం ప్రతులను భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. మరోవైపు టీచర్లకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రతులను యూటీఎఫ్ నాయకులు భోగి సందర్భంగా దహనం చేసి నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏపీ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల డిమాండ్లతో ముగ్గులు వేసి, నినాదాలు రాసి నిరసన తెలిపారు. తర్వాత భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేశారు. జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని వెనక్కు తీసుకోవాలనీ, అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. శ్రీకాకుళంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వం అమలుచేస్తున్న అప్రజాస్వామ్య వైఖరి నశించాలంటూ జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా హామీలు అమలుచేయని ప్రభుత్వమంటూ నినాదాలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు భోగి మంటల్లో ఎస్మా నోటీసులను దహనం చేశారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లా వ్యాప్తంగా కూడా అంగన్వాడీలు ఎస్మా చట్టం ప్రతులను భోగిమంటల్లో వేసి తగులబెట్టారు.

ఉద్యమాలపై నిర్బంధం తగదు: యూటీఎఫ్

ఉద్యమాలపై నిర్బంధం తగదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోమ్ వద్ద భోగి మంటల్లో ప్రభుత్వ వైఖరి దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు తమ హక్కులపై నిరసన గళాన్ని వినిపించడం సాధారణమని, అయితే సమావేశాలకు, సదస్సులకు అనుమతి ఇవ్వకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బకాయిలు చెల్లించకుంటే ఈనెల 19, 24 తేదీల్లో తాలూకా, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకూ అన్ని జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు.

కబ్జాల 'భూ'పాలుడు!

బినామీ పేర్లతో వక్ఫ్ ఆస్తులూ కబ్జా .. ముందుగా అనుచరులు రంగంలోకి ఆ తరువాత నేత వద్ద పంచాయితీ

- కర్నూలులో సీనియర్ ఎమ్మెల్యే దాదాగిరి
- జోరుగా భూకబ్జాలు, దందాలు, సెటిల్‌మెంట్లు
- జోరుగా ఎర్రమట్టి, ఇసుక రవాణా
- తుపాకీతో సోలార్ కాంట్రాక్టరుకు బెదిరింపులు
- ఎర్రమట్టి రవాణాలో తనయుడికి మామూళ్లు
- బావమరిదికీ కీలక కాంట్రాక్టులు

(అమరావతి/కర్నూలు-ఆంధ్రజ్యోతి)

ఫ్యాక్షన్ కుటుంబ నేపథ్యమున్నా బయటకు సౌమ్యంగా మాట్లాడుతారు. లోపల అసలు సిసలైన రాజకీయ నాయకుడిగా పవర్ చూపిస్తారు. వక్ఫ్ భూములైనా, ప్రభుత్వ స్థలాలైనా, వివాదాస్పద భూములైనా ఆ సీనియర్ ఎమ్మెల్యే కన్ను పడిందంటే తనకో.. తనకు అత్యంత సన్నిహితులైన ముఖ్య అనుచరులకో దక్కాల్సిందే. దందాలు అయినా, సెటిల్‌మెంట్లు అయినా నేరుగా ఆయన పాత్ర ఉండదు. ముందుగా తన అనుచరులు రంగంలో దిగుతారు. ఆ తరువాత పంచాయితీ పేరుతో పరోక్షంగా రంగంలో దిగి తనకు అనుకూలంగా సెటిల్ చేసుకోవడంతో ఆయన ఆరితేరిన నాయకుడు. ఎమ్మెల్యే అండదండలతో నియోజకవర్గంలో ఎర్రమట్టి మాఫియా, ఇసుక అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. ఆయనకు పరోక్ష పాత్ర ఉండడంతో అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. కర్నూలు నగర శివారులో 590 ఎకరాల విస్తీర్ణంలో జగన్నాథగట్టు ఉంది. ప్రభుత్వ భవిష్యత్తు అవసరాల (ప్రభుత్వ ఆఫీసులు, విద్యా సంస్థలు మొదలైనవి) కోసం ల్యాండ్ బ్యాంక్‌లో ఉంచారు. ఇక్కడే హైకోర్టు నిర్మిస్తామని ప్రభుత్వ పెద్దలు పదేపదే చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మించారు. పలు ప్రభుత్వ సంస్థలకు భూములు కేటాయించారు. నాణ్యమైన ఎర్రమట్టికి నిలయమైన జగన్నాథగట్టుపై ఎర్రమట్టి మాఫియా కన్నుపడింది. ఎక్స్‌కవేటర్లను కొండలో దింపేసి రేయింబవళ్లు మట్టి తవ్వేసి అక్రమ రవాణా చేశారు. ఎట్టకేలకు మైనింగ్ అధికారులు సర్వే చేసి 1.71 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా ఎర్రమట్టి అక్రమంగా రవాణా చేశారని నిగ్గు తేల్చారు. 8 మంది అక్రమార్కులను గుర్తించి అపరాధ రుసుంతో కలిపి రూ.19.36 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసిందంటే ఏ స్థాయిలో జగన్నాథగట్టును కొల్లగొట్టారో తెలుస్తుంది. ఇక ఇసుక అక్రమ రవాణా సరేసరి. ఎమ్మెల్యే అనుచరులు తుంగభద్ర నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు.



'భూ'మాయ!

సీనియర్ ఎమ్మెల్యే పంచాయితీ చేశారంటే ఆస్తి బినామీలకో.. అనుచరులకో రావాల్సిందే. రూ.కోట్లు విలువైన భూములను సెటిల్‌మెంట్‌ల ద్వారా, ఫోర్జరీ రికార్డుల ద్వారా అధికారం మాటున వైసీపీ నాయకులు సొంతం చేసుకున్నారు. నియోజకవర్గంలో దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో 2006లో వెంచర్ వేశారు. హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇళ్లు కట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుందని పలువురు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, చిరువ్యాపారులు ప్లాట్లు కొనుగోలు చేశారు. 164 మంది రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే బినామీ పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేశారని బాధితులు లబోదిబోమంటూ జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ భూమి విలువ రూ.25-30 కోట్లకు పైగా ఉంటుందని అంటున్నారు.

వక్ఫ్‌బోర్డు భూమి కబ్జా

నగరు శివారులోని ఓ ఎస్టేట్‌లో 10.64 ఎకరాలు వక్ఫ్ బోర్డు భూమి ఉంది. షాషా మసీదుకు 5.30 ఎకరాలు, అల్లిషా మసీద్‌కు 5.14 ఎకరాలు చెందిన భూమి అని నిర్వాహకులు అంటున్నారు. అందులో రెండు ఎకరాలు కబ్జా చేశారు. దీని విలువ రూ.20-30 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దీనిపై మసీదు నిర్వాహకులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎమ్మెల్యే ముఖ్య అనుచరులే నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించుకొని రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారని ముస్లిం మతపెద్దలు అంటున్నారు. దీనిపై పంచాయితీ పేరుతో ఇంటికి పిలిపించి ఆ ప్రజాప్రతినిధి బెదిరింపులకు గురి చేశారని ఆరోపిస్తున్నారు. నెల రోజుల క్రితం టీడీపీ మైనారిటీ నేతలు ఈ భూమిని పరిశీలించి వక్ఫ్‌బోర్డు ఆస్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన 2 ఎకరాలు వక్ఫ్ బోర్డుకు చెందిన భూమేనని రెవెన్యూ అధికారులు కూడా నిగ్గు తేల్చారు.

దేవుడి భూమినీ వదల్లేదు!

నియోజకవర్గంలో ఓ ప్రముఖ ఆలయానికి 6.65 ఎకరాల భూమి ఉంది. నేషనల్ హైవే-44 కోసం 0.42 సెంట్లు భూ సేకరణ చేశారు. సబ్ డివిజన్ చేసి 6.23 ఎకరాలు దేవదాయశాఖ భూమిగా చూపించారు. బహిరంగ మార్కెట్ ప్రకారం ఆ భూమి విలువ రూ.35-40 కోట్లు ఉంటుంది. ఈ భూములపై కన్నేసిన అక్రమార్కులు రికార్డులో లేని సర్వే నంబరును సృష్టించారు. 6.23 ఎకరాలకు సరిహద్దులు చూపించి ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఓ వైసీపీ నాయకుడు నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. 35 సెంట్ల భూమిలో ఏకంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే అండదండలతోనే ఆ పార్టీ నాయకులు బరితెగించారని అంటున్నారు.

గన్ పెట్టి బెదిరించి..

నియోజకవర్గంలోని ఓ మండలంలో టీడీపీ హయాంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. సోలార్ పలకలు క్లీనింగ్ (దుమ్ము శుభ్రం చేయడం) చేసే కాంట్రాక్ట్ (ఓఅండ్ఎం) ఓ ప్రైవేటు సంస్థకు ఇచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ కాంట్రాక్ట్‌పై ఆ పార్టీ ముఖ్య నాయకుల కన్ను పడింది. వారికి ఎమ్మెల్యే అండ కూడా ఉంది. సోలార్ పవర్ ఉత్పత్తి కంపెనీ ఆఫీసుకు వెళ్లి టేబుల్‌పై గన్ పెట్టి పలకల క్లీనింగ్ కాంట్రాక్ట్ తమకే ఇవ్వాలని బెదిరించారు. ఇక చేసేది లేక ప్రజాప్రతినిధి అనుచరులకు కాంట్రాక్ట్‌ను ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఓ మండలం కేంద్రంగా 33 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఓ పరిశ్రమ నిర్మాణంలో ఉంది. భారత ప్రభుత్వ రంగ సంస్థ డీఆర్‌డీఓ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ ముఖ్య ప్రజాప్రతినిధికి చెందిన సంస్థ, అయన బావమరిది చేజిక్కించుకున్నారని అంటున్నారు.

- నియోజకవర్గ కేంద్రం మండల పరిధిలో 605 ఎకరాలు ప్రభుత్వ కొండ పరంబోకు భూమి ఉంది. ఎమ్మెల్యే అనుచరులు ఎర్రమట్టి మాఫియాగా మారి ఇష్టారాజ్యంగా పచ్చని కొండను కొల్లగొట్టారు.
- నియోజకవర్గంలోని ఓ మండలంలో ఎర్రమట్టి (ఎర్రగరుసు), నల్ల మట్టి ఇటుకుల బట్టీలకు అక్రమగా రవాణా చేసి అనుచరులు రూ.కోట్లు కొల్లగొట్టారని, ఇందులో ఎమ్మెల్యేకు భారీగా మామూళ్లు అందాయని ఆరోపణలు ఉన్నాయి.
- నియోజకవర్గంలోని ఓ మండలంలో వైసీపీ నాయకుడు ఒకరు ప్రభుత్వ భూమి 25-30 ఎకరాలు అక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఇటీవలే ఓ ప్రజా ప్రతినిధి అండతో కొంత భూమిని అసైన్మెంట్ కమిటీ ద్వారా బినామీ పేరుతో పట్టాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పాలకా.. మీకేనా పండగ!

- హాలికులకు ఉండరేమి అండగా?
- నెలలు గడిచినా.. నిధుల విడుదలలో నిర్లక్ష్యం
- సాయం చేయని సర్కార్‌పై రైతన్న గుర్రు
- కర్షకుల లోగిళ్లలో కానరాని సంక్రాంతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నవ్యాంధ్రలో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. వరుస విపత్తులతో విలవిల్లాడుతున్న రైతన్నకు పాలకులు దన్నుగా నిలవడం లేదు. కరువు, తుఫానుకు పంట నష్టపోయిన కర్షకులకు ప్రభుత్వపరంగా ఓదార్పు కరువైంది. నష్టపరిహారమైనా అందించి, రైతన్న కన్నీరు తుడిచే ప్రయత్నమూ జరగట్లేదు. భారీనష్టాలతో బావురుమంటున్న రైతులకు పంట రుణాల రీషెడ్యూలైనా చేయట్లేదు. గత నాలుగేళ్ల మాదిరిగానే 2023-24లోనూ విపత్తులు అన్నదాతని కుదేలు చేశాయి. పుడమి పులకరించేలా వర్షాలు కురవాల్సిన తొలకరి నుంచి ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు చాలీచాలని వానతో, మండుటెండలతో కొందరు రైతు లు పంట వేయలేక సాగుకు దూరమయ్యారు. జలాశయాలు, కాలువల్ని నమ్ముకుని పంటలు సాగు చేసిన మరికొందరు రైతులు పంట కోత తరుణంలో తుఫాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం నుంచి అతి భారీ వర్షాల వరకు నష్టపోయిన రైతులకు.. పంట నష్టపరిహారమైనా అందుతుందని ఎదురు చూస్తున్నా.. సర్కార్ నయాపైసా విదిలించలేదు. ఈ నేపథ్యంలో పాత బాకీలకు కొత్త అప్పులు తోడై, వడ్డీలు కట్టలేక సతమతమౌతున్న రైతులు, కౌలు సాగుదారుల ఇళ్లలో పెద్ద పండుగ వేళ సందడే కనిపించడం లేదు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతును చేయి పట్టుకుని నడిపిస్తామన్న ప్రభుత్వ పెద్దలు హాలికులకు అండగా ఉండకుండా, ఎన్నికల హడావుడితో రాజకీయాల్లో బిజీ అయ్యారు. సీట్ల సందడితో నేతల ఇళ్ల వద్దే పండుగ వాతావరణం కనిపిస్తోంది. కానీ రైతు, కూలీల కుటుంబాలు మాత్రం సం క్రాంతిని సంతోషంగా జరుపుకోలేని స్థితిలో ఉన్నాయి.

రైతు కన్నీరు తుడిచేదెవరు?

గతంలో కరువు ఏర్పడితే.. కేంద్రం సాయం ఎక్కువగా పొందటానికి అవకాశం ఉన్నమేరకు కరువు మండలాలను ప్రకటించే పరిస్థితులుండేవి. ముఖ్యంగా చంద్రబాబు పాలనలో ఉమ్మడి రాష్ట్రంలోనైనా, నవ్యాంధ్రలో అయినా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే కరువు మండలాలుగా ప్రకటించారు. కరు వు-చంద్రబాబు కవల పిల్లలని ఎన్నోసార్లు హేళన చేసిన జగన్.. తమ పాలనలో ఒక్క కరువు మండ లం కూడా ప్రకటించాల్సిన అవసరం లేకుండా, దండి గా వర్షాలు కురిసి, జలాశయాలు నిండిపోతున్నాయని బీరాలు తీశారు. కానీ ప్రకృతి పరిహసించి కరువు కబళించింది. ఎల్‌నినో ప్రభావంతో నైరుతీ రుతుపవనాలు బలహీనపడి, ఖరీఫ్ సీజన్ 130 నెలలు తీవ్ర వర్షాభావం నెలకుని, రాష్ట్రవ్యాప్తంగా 27% విస్తీర్ణంలో విత్తనమే నాటలేని పరిస్థితి ఏర్పడింది. కరువునీ అవహేళ చేసిన పాలకులే దిగివచ్చి, 103 కరువు మండలాలను ప్రకటించారు. మరోవైపు తుఫాన్లు సంభవిస్తే.. లక్షలాది ఎకరాల్లో, రూ.వేల కోట్ల విలువైన పంటల్ని రైతులు నష్టపోయారు.

రైతన్న ఎదురుచూపు

ఇదిగో ఇన్‌పుట్ సబ్సిడీ, అదిగో పంటల బీమా అంటున్నా.. నెలల తరబడి నిధులు విడుదల చేయట్లేదు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా పరిహారం కోసం, అలాగే 2021-22 రబీ, 2022ఖరీఫ్ సీజన్లలో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకుని, వడ్డీతోసహా తిరిగి చెల్లించిన రైతులు వడ్డీ రాయితీ సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.